PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 78 | విజయవాడ, ఆదివారం 20 అక్టోబర్ 2024 | 8 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 20 October 2024 | Rs



అభ్యుదయ ఉద్యమాలకు స్ఫూర్తి జ్యోత్స్న

- సంస్మరణ సభలో వివిధ రంగాల ప్రముఖులు 2



గెలిచేదెవరో...?

- న్యూజిలాండ్ లక్ష్యం 107పరుగులు
- సర్ఫరాజ్ సెంచరీ, శతకం చేజారిన పంత్ 8

రాజధానికి మళ్లీ ప్రాణప్రతిష్ట

- ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు
- సిఆర్‌డిఎ కార్యాలయ పనులు పున:ప్రారంభం
- ఆర్థిక రాజధానిగా విశాఖ... కర్నూలుకు హైకోర్టు బెంచ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమరావతి రాజధానికి మళ్లీ ప్రాణప్రతిష్ట చేస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. రాయపూడిలో ఆగిపోయిన సిఆర్‌డిఎ కార్యాలయ నిర్మాణ పనులను ఆయన శనివారం పున:ప్రారంభించారు. అనంతరం భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ గత పాలకులు అబద్ధాలు ప్రచారం చేసి రాజధానిని దెబ్బతీశారని చెప్పారు. భవిష్యత్ తరాల కోసం తమ భూములను ఇచ్చిన రైతులను గత ప్రభుత్వం ఎన్నో ఇబ్బందులు పెట్టిందని తెలిపారు. అమరావతి కోసం మహిళలు చేసిన పోరాటాన్ని గత ప్రభుత్వం అడుగడుగా అణగదొక్కిందని, న్యాయస్థానం నుండి దేవస్థానం కార్యక్రమం చేపడితే దానికి కూడా అనుమతి ఇవ్వలేదని గుర్తుచేశారు. ఎంతమంది అడ్డుపడ్డా అమరావతిని కాపాడిన ఘనత రైతులదేనని తెలిపారు. ప్రస్తుతం పనులు ప్రారంభించిన సిఆర్‌డిఎ భవనాన్ని సరిగ్గా 121వ రోజున ప్రారంభిస్తామని చెప్పారు. విశాఖను ఆర్థిక రాజధానిగా చేస్తామని, కర్నూలులో హైకోర్టు బెంచ్‌తో పాటు పెద్ద ఎత్తున పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి రాష్ట్రంలో అప్పులు తప్ప మరేమీ కనిపించలేదని అన్నారు. రైతులకు పెండింగ్ కౌలు రూ.170 కోట్లు ఇచ్చామని, మిగిలిన రూ.225 కోట్లు త్వరలోనే ఇస్తామని చెప్పారు.

మూడేళ్లలో రాజధాని పనులు పూర్తి

రాజధానికి లక్ష కోట్లు ఖర్చవుతుందంటూ తప్పుడు ప్రచారం చేశారని, అమరావతి సెల్ఫ్ ఫైనాన్సింగ్ మోడల్ అని, అదే విషయాన్ని తను మొదటి నుండి చెబుతున్నానని చంద్రబాబు తెలిపారు.. అమరావతి నగరానికి డబ్బు అవసరం లేకుండానే అభివృద్ధి చేస్తామని చెప్పారు. భవిష్యత్‌లో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసేందుకు అమరావతి నిధుల ఘనిగా మారుతుందన్నారు. ఇప్పటికే ఉన్న విద్యా సంస్థలతోపాటు మిగతా 7లో



సిఆర్‌డిఎ కార్యాలయ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న సిఎం చంద్రబాబు

బెల్టుషాపులు అరికట్టాలి మద్యపానాన్ని నియంత్రించాలి

- స్థానికులు వ్యతిరేకరించిన చోట షాపులు పెట్టొద్దు
- సిపిఎం రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో బెల్టుషాపులు అరికట్టాలని, మద్యపానాన్ని నియంత్రించాలని, స్థానికులు వ్యతిరేకించిన చోట మద్యం షాపులు పెట్టొద్దని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో 3,396 మద్యం షాపులను ప్రైవేటు వ్యక్తులకు, కాంట్రాక్టర్లకు రాష్ట్ర ప్రభుత్వం లాటరీ ద్వారా కేటాయించిందని తెలిపారు. ఈ షాపులు జనావాసాల మధ్య స్కూళ్ల దేవాలయాలకు దగ్గర్లో జన సమర్థం ఉన్న ప్రాంతాల్లో పెడుతున్నారని తెలిపారు. పలు ప్రాంతాల్లో మహిళలు, స్థానిక ప్రజలు వీటిని ప్రతిఘటిస్తున్నారని, అందువల్ల జనావాసాలకు దూరంగా షాపులు పెట్టాలని కోరారు. ప్రజలు, ప్రత్యేకించి మహిళలు వ్యతిరేకించిన చోట పెట్టకుండా నిబంధనలు జారీచేయాలని, రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వారానికి ఒక రోజు డ్రైడేగా ప్రకటించాలని సూచించారు. కొత్తగా షాపులు పొందిన కాంట్రాక్టర్లు అడ్డగోలు లాభార్జన కోసం ఇప్పటికే ఇబ్బడి ముబ్బడిగా ప్రైవేటుగా, అనధికారికంగా వేలం పాటలు నిర్వహించి బెల్టుషాపులతో ఒప్పందాలు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. బెల్టుషాపులతో సహా మద్యం ఆదాయంలో అధికార పార్టీ నాయకులకు, ప్రజాప్రతినిధులకు, అధికారులు కూడా వాటాలు పెడుతున్నట్లు రాష్ట్రం నలుమూలల నుండి సమాచారం అందుతోందని పేర్కొన్నారు. బెల్టుషాపుల వల్ల మద్యం వినియోగం పెరగడమే కాకుండా నియంత్రణలేని మద్యం అమ్మకాలు సాగుతాయని తెలిపారు. జనం అప్పుల పాలవుతున్నారని, మహిళలు వేధింపులకు గురవుతారని వివరించారు. అల్లరి మూకలు పెట్రేగిపోతాయని, అందువల్ల బెల్టుషాపులను ఎక్కడికక్కడ కట్టడి చేయాలని, ప్రజల ఫిర్యాదులకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి వాటిపై కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.

22 నుంచి 25 వరకు ఆధార్ క్యాంపులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామ వార్డు సచివాలయాల పరిధిలో ఆధార్ క్యాంపులు ఈనెల 22 నుంచి 25 వరకు నిర్వహించనున్నట్లు గ్రామ వార్డు సచివాలయాల శాఖ పేర్కొంది. ఈ మేరకు శనివారం ఆ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. కొత్త ఆధార్ కార్డులు, ఆధార్ తీసుకుని పదేళ్లు దాటిన వారికి బయోమెట్రిక్ అప్‌డేట్, ఇంటి అడ్రస్, వయసు, పేరు మార్పు, ఫోన్ నెంబరు అప్‌డేట్, ఐదేళ్లలోపు చిన్నారులకు బాల ఆధార్ కార్డులు జారీ వంటి సేవలను ఈ మొబైల్ క్యాంపుల్లో అందించనున్నారు.



ఎన్‌డిఎ గూటికి గౌరీలంకేష్ హత్య కేసు నిందితుడు

- ఏక్‌నాథ్ షిండే పార్టీలో చేరిక

ముంబయి : దేశవ్యాప్తంగా కలకలం సృష్టించిన ప్రఖ్యాత జర్నలిస్టు గౌరీ లంకేష్ హత్య కేసులో నిందితుడిగా ఉన్న జల్నా మాజీ మున్సిపల్ కౌన్సిలర్ శ్రీకాంత్ పంగార్కర్ ఎన్‌డిఎ గూటికి చేరారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనలో ఆయన శనివారం చేరారు. షిండే శివసేన ఎన్‌డిఎలో భాగస్వామిగా ఉన్న సంగతి తెలిసిందే. శివసేనను రెండు ముక్కలుగా చీల్చి అత్యంత అప్రజాస్వామికమైన రీతిలో బిజెపి షిండేను ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబెట్టిన సంగతి తెలిసిందే. అత్యంత ఘోర నేరాల్లో ప్రమేయమున్న నేతలందరూ బిజెపి, దాని నేతృత్వంలోని ఎన్‌డిఎ భాగస్వామ్యపక్షాల్లో చేరిపోతుండటం గమనార్హం. 2017 సెప్టెంబరు 5న కర్ణాటక రాజధాని నగరం బెంగళూరులో గౌరీ లంకేష్‌ను ఆమె నివాసం వెలుపలే కాషాయ గూండాలు కాల్పులు జరిపి హత్య చేసిన సంగతి తెలిసిందే. ఈ హత్య కేసులోనే పంగార్కర్ తదితరులకు ప్రమేయమున్నట్లు కర్ణాటక పోలీసులు గుర్తించి మహారాష్ట్ర పోలీసుల సహకారంతో దర్యాప్తు సాగిస్తున్నారు. అనేక మంది అరెస్టు కూడా చేశారు. పంగార్కర్ 2001-06 ప్రాంతంలో జల్నా మున్సిపల్ కౌన్సిలర్‌గా పనిచేశారు. గౌరీ లంకేష్ హత్య కేసులో అతడిని 2018 ఆగస్టులో అరెస్టు చేయగా.. కర్ణాటక హైకోర్టు ఈ ఏడాది సెప్టెంబరు 4న బెయిల్ మంజూరు చేసింది. ఇప్పుడు అతడు కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్‌డిఎ భాగస్వామ్య పార్టీ పంచన చేరడంతో గౌరీ లంకేష్ హత్య కేసు దర్యాప్తుపై నీలినీడలు కమ్ముకున్నాయి.

ఇళ్లకు స్మార్ట్ మీటర్లు!

- డిసెంబర్ నుంచి ఏర్పాటుకు సన్నాహాలు
- 'అదాని' సిబ్బందికి గుంటూరులో ఇంటర్వ్యూలు
- 22న రాజమండ్రిలో కాంట్రాక్టు ఏజన్సీ నిర్వహణ



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో రాష్ట్రంలో విద్యుత్ సంస్కరణల అమలు ప్రక్రియ వేగవంతమౌతోంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లను ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రస్తుతం దానికి భిన్నమైన వైఖరిని తీసుకున్నారు. దీనిలో భాగంగా ప్రజానీకం వ్యతిరేకిస్తున్నప్పటికీ ఇళ్లకు స్మార్ట్ మీటర్లను బిగించే ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చేపడుతోంది. డిసెంబర్ నుండి ఈ మీటర్లను ఇళ్లకు బిగించడానికి సన్నాహాలు పెద్ద ఎత్తున సాగుతున్నాయి. రాష్ట్రంలోని వివిధ డిస్కామ్‌లకు ఇప్పటికే అదాని స్మార్ట్ మీటర్లు చేరిన సంగతి తెలిసిందే. ఈ మీటర్లు కొద్ది రోజుల క్రితం విజయవాడలోని విద్యుత్ సౌధకు వచ్చినప్పుడు సిపిఎం ఆధ్వర్యంలో స్థానికులు నిరసన తెలిపారు. తాజాగా ప్రభుత్వం ఆ ప్రక్రియను మరింత వేగవంతం చేసింది. స్మార్ట్ మీటర్లు బిగించేందుకు ఏడాది కాంట్రాక్టు పేరుతో టాలెంట్ సొల్యూషన్స్ ప్రైవేటు లిమిటెడ్ కన్సల్టెన్సీ సంస్థ గుంటూరులో నియామక ప్రక్రియ చేపట్టింది. విషయం తెలుసుకున్న ప్రజాశక్తి ప్రతినిధి అక్కడకు వెళ్లి ఆరా తీయగా తమకేమీ తెలియదని, అదానీ కంపెనీ నుండి అందిన ఆదేశాల మేరకు, వారి కోసం ఏడాది కాంట్రాక్టుకు సిబ్బందిని తీసుకుంటున్నామని చెప్పారు. విద్యుత్ శాఖకు వీరిని అప్పగించనున్నట్లు తెలిపారు. స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియ కోసం వీరిని తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎల్‌టి, హెచ్‌టిలతోపాటు ట్రాన్స్‌ఫార్మర్లను కూడా బిగించేందుకు అనుభవం ఉన్న వారికోసం ఇంటర్వ్యూలు చేస్తున్నట్లు చెప్పారు. శనివారం గుంటూరు, సిఆర్‌డిఏ, విజయవాడ, ఒంగోలు జిల్లాలకు అవసరమైన సిబ్బందికి ఇంటర్వ్యూలు పూర్తి చేశారు. ఇపిడిసిఎల్ పరిధిలోని రాజమండ్రిలో ఈ నెల 22వ తేదిన నిర్వహించనున్నారు. ఆయా జిల్లాల్లో ప్రయోగాత్మకంగా మీటర్ల బిగింపు పనులను వీరు చేపట్టనున్నార. వీరందరూ కూడా శాశ్వత విద్యుత్ ఉద్యోగుల పర్యవేక్షణలోనే చేస్తారనీ వివరించారు. అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో తీసుకునే వర్కర్లకు రూ.24 వేలు, సూపర్‌వైజర్లకు రూ.45 వేల ప్రారంభ వేతనం ఇవ్వనున్నారు. వీరందరికీ డిసెంబర్ ఒకటోతేదీ నుండి విధుల్లోకి హాజరవ్వాలని కన్సల్టెన్సీ ప్రతినిధులు సూచిస్తున్నారు. అప్పటి నుండి తొలివిడతలో సర్వేచేయడం, తదనంతరం మీటర్లు మార్చడం వంటి పనులు ఉంటాయనీ తెలిపింది. ఒక్కొక్కరు రోజుకు ఎన్నిమీటర్లు పెట్టాలనేది కూడా టార్గెట్ ఉంటుందని పేర్కొన్నారు.

రోడ్డు ట్రాన్స్‌పోర్టు కార్మికులకు కేరళ తరహా సంక్షేమ పథకాలు

- ఫెడరేషన్ రాష్ట్రస్థాయి వర్క్ షాప్‌లో గఫూర్ డిమాండ్ 3

పర్యావరణ మార్పు.. పేదలకే ముప్పు

- ప్రపంచ బ్యాంకు అధ్యయనంలో వెల్లడి 7

బిజెపి హయాంలో ప్రభుత్వ రంగంపై తీవ్ర దాడి

- ఎఐఐఇఎ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత మిశ్రా
- విశాఖలో ఐసిఇయు గోల్డెన్ జూబ్లీ వార్షిక సమావేశం ప్రారంభం 2

జార్ఖండ్‌లో ఇండియా బ్లాక్ సీట్ల సర్దుబాటు

- ఆర్‌జెడి, లెఫ్ట్ అసంతృప్తి
- 70 చోట్ల జెఎంఎం, కాంగ్రెస్ పోటీ
- మిగిలిన 11 స్థానాల్లో ఆర్‌జెడి, లెఫ్ట్

రాంచి: జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఇండియా బ్లాక్ భాగస్వామ్య పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు కుదిరినట్లు జెఎంఎం ప్రకటించింది. అయితే, సీట్ల పంపకంలో తమకు తక్కువ సీట్లు కేటాయించడం పట్ల ఆర్జేడి, లెఫ్ట్ పార్టీలు అసంతృప్తి వ్యక్తం చేశాయి. జార్ఖండ్ ముక్తి మోర్చా (జెఎంఎం), కాంగ్రెస్, రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్‌జెడి), వామపక్షాల మధ్య సీట్ల సర్దుబాటు కుదిరినట్లు జార్ఖండ్ ముఖ్యమంత్రి, జెఎంఎం అధినేత హేమంత్ సోరేన్ చెప్పారు. జార్ఖండ్ అసెంబ్లీలోని మొత్తం 81 స్థానాలకు గాను 70 స్థానాల్లో జెఎంఎం, కాంగ్రెస్ పోటీ చేస్తుండగా, మిగిలిన 11 స్థానాలను ఆర్‌జెడి, వామపక్షాలకు విడిచిపెట్టాయి. దీనిపై ఆర్జేడి, లెఫ్ట్ పార్టీల నేతలు స్పందిస్తూ ఇండియా బ్లాక్ ఐక్యపోరాటంపై జెఎంఎం, కాంగ్రెస్ అంత సీరియస్‌గా ఉన్నట్లు అనిపించడం లేదని విమర్శించారు. సీట్ల పంపకం చాలా అధ్వానంగా ఉందన్నారు. చర్చల్లో తమను మినహాయించారని వారు అన్నారు. జెఎంఎం నాయకుడు హేమంత్ సోరెన్ మాత్రం ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించే ఈ సర్దుబాటు చేశామని చెప్పారు. అయితే ఏఏ పార్టీ ఎన్నెన్ని స్థానాల్లో పోటీ చేస్తుందనే వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తుల్లో భాగంగా జెఎంఎం 43 స్థానాలకు పోటీ చేసి 30 స్థానాల్లో గెలవగా, కాంగ్రెస్ 31 స్థానాల్లో పోటీ చేసి 16 స్థానాల్లో గెలిచింది. ఆర్జెడి ఏడు స్థానాల్లో పోటీ చేసి ఒక స్థానంలో గెలిచింది. అయితే ఈ దఫా తమ ప్రజా పునాది బాగా విస్తరించిందని ఆర్‌జెడి రాజ్యసభ సభ్యులు ఎంపి మనోజ్ ఝా అన్నారు. మతోన్మాద బిజెపిని ఓడించితీరాలన్నదే తమ అధినేత లాలూ ప్రసాద్ లక్ష్యమని, ఆ దిశగా తాము పోరాడుతామని మనోజ్ చెప్పారు.

సోరెన్‌తో ఆర్‌జెడి బృందం సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ దఫా తమకు జార్ఖండ్‌లో ప్రజా పునాది మిగతా 7లో



జార్ఖండ్ ముఖ్యమంత్రి సోరెన్‌తో రాహుల్

కడపలో ఘాతుకం

- ఇంటర్ విద్యార్థినిపై పెట్రోల్ పోసి నిప్పంటించిన ఉన్మాది
- నిందితుడిని అరెస్టు చేయండి : సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి- గోపవరం/బద్వేలు (వైఎస్ఆర్ జిల్లా)

ఇంటర్మీడియట్ విద్యార్థినిపై ఓ ఉన్మాది పెట్రోల్ పోసి నిప్పంటించాడు. కడప జిల్లా గోపవరంలో ఈ ఘాతుకం చోటుచేసుకుంది. ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించారు. నిందితుడుని అరెస్టు చేయాలని ఆదేశించారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... బద్వేల్ పట్టణంలోని రామాంజనేయ నగర్‌కు చెందిన దస్తగిరమ్మ (17) ఓ ప్రయివేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతోంది. శనివారం ఉదయం కళాశాలకు ఇంటి నుంచి బయలుదేరిన ఆమెను అదే ప్రాంతానికి చెందిన జక్కల విగ్నేష్ మాట్లాలని చెప్పి తన బైక్‌పై ఎక్కించుకొని మండల పరిధిలోని సెంచరీ ఫ్లైవుడ్ వద్దగల నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లాడు. తనను ప్రేమించాలని వేధించాడు. ఇందుకు తిరస్కరించడంతో దస్తగిరమ్మ ఒంటిపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. మంటలు తాళలేక ఆమె కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఆ విద్యార్థినిని ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. 80 శాతంపైగా శరీరం కాలిపోవడంతో మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. బాధితురాలి నుంచి జిల్లా జడ్జి వాంగ్మూలం నమోదు చేసుకున్నారు. ప్రేమ పేరుతో 8వ తరగతి నుంచే విఘ్నేష్ తమ కుమార్తెను వేధిస్తున్నాడని దస్తగిరమ్మ తల్లిదండ్రులు తెలిపారు. అతనికి వివాహమైనా తర్వాత కూడా వేధింపులు ఆపలేదని, ఇప్పుడు ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని వాపోయారు. వారి ఫిర్యాదు మేరకు బద్వేలు రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, విగ్నేష్ ఒక యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు.

నిందితుడి కోసం 4 బృందాలతో గాలింపు : ఎస్‌పి

విగ్నేష్ కోసం నాలుగు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టామని ఎస్‌పి మిగతా 2లో



ఆస్పత్రిలో రోదిస్తున్న విద్యార్థిని తల్లి



జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా విజయ రహాట్కర్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో


జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సిడబ్ల్యు) చైర్‌పర్సన్‌గా బిజెపి జాతీయ కార్యదర్శి విజయ కిశోర్ రహాట్కార్ నియమితులయ్యారు. కేంద్ర ప్రభుత్వం ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఆమెతో పాటు కమిషన్ సభ్యులుగా డాక్టర్ అర్చన మజుందార్ నియమితులయ్యారు. వీరు ఇరువురు మూడేళ్ల పాటు పదవిలో కొనసాగుతారు. ఎన్‌సిడబ్ల్యు 9వ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న విజయ రహాట్కర్ బిజెపి యువజన, మహిళా విభాగాల్లో క్రియాశీలక నేతగా వ్యవహరించారు. 2007-10 వరకు ఛత్రపతి సంభాజీనగర్ మేయర్‌గా పని చేశారు. ఆ తర్వాత 2016-21 మధ్యకాలంలో ఆమె మహారాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా పనిచేశారు.

మాటల్లోనే రైతు సంక్షేమం

- సాగునీరు ఇవ్వలేని ప్రభుత్వాలు ఉండడం సిగ్గుచేటు : వి రాంభూపాల్
- 'అనంత'లో ముగిసిన సిపిఎం బస్సు యాత్ర

ప్రజాశక్తి- ఆత్మకూరు (అనంతపురం జిల్లా)

రైతుల సంక్షేమం పాలకుల మాటల్లో కన్పిస్తోంది తప్ప, ఆచరణలో ఎక్కడా లేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ అన్నారు. సాగునీటి సాధన కోసం సిపిఎం ఆధ్వర్యాన ఈ నెల 15న బొమ్మనహాల్ మండలంలో ప్రారంభమైన బస్సు యాత్ర రాప్తాడు మండలం కందుకూరులో శనివారం ముగిసింది. సిపిఎం నాయకులు ఆయా గ్రామాల్లో సాగునీటి కాలువలను పరిశీలించారు. రైతులతోనూ, గ్రామస్తులతోనూ మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ ఆత్మకూరు మండలం తలపూరు, వడ్డేపల్లి గ్రామాలకు పిల్ల కాలువ ద్వారా సాగు, తాగునీరు అందించే అవకాశం ఉన్నా పాలకులు దృష్టి సారించడం లేదన్నారు. మదిగుబ్బ, బియాలేరు చెరువులకు నీరిస్తే, వాటి పరిధిలోని ఆయకట్టు భూములు సాగులోకి వస్తాయని తెలిపారు. పాలకులకు మద్యం షాపుల నిర్వహణపై ఉన్న ఆసక్తి రైతులు, ప్రజా సమస్యలపై లేకపోవడం విచారకరమన్నారు. జిల్లాలో ఓ బిజెపి నాయకునికి ఐదు మద్యం షాపులు రావడాన్ని ఆ పార్టీ నాయకులు అదృష్టంగా భావించి గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. రైతులు సాగునీరు లేక పొలాలను బీడుగా పెట్టుకుని ఇబ్బందులు పడుతుంటే, పాలకులు మద్యం షాపుల కోసం పోటీలు పడుతున్నారని విమర్శించారు. ప్రజారంజక పాలన అందిస్తామని ఎన్నికల ముందు చెప్పిన మిగతా 7లో



ఆత్మకూరి మండలం వడ్డుపల్లి గ్రామంలో మాట్లాడుతున్న వి.రాంభూపాల్

21న కలెక్టరేట్ ఎదుట మహాధర్నా

సాగునీటి కోసం ఈ నెల 21న అనంతపురం కలెక్టరేట్ వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నట్లు రాంభూపాల్ తెలిపారు. సాగునీటి కాలువల పరిస్థితిని బస్సు యాత్ర ద్వారా తెలుసుకున్న సమస్యలను మహాదర్నా ద్వారా అధికారులు, పాలకుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. మహాధర్నాలో రైతులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కుటుంబాన్ని వెలేశారని వ్యక్తి ఆత్మహత్య

- వైసిపి నేతలే కారణమని లేఖ

ప్రజాశక్తి-చీరాల (బాపట్ల జిల్లా)

తమ కుటుంబాన్ని వైసిపి నేతలు వెలి వేశారని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నారు. తన మరణానికి వైసిపి నేతల వేధింపులే కారణమని సూసైడ్ నోట్ రాసి బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ సంఘటన బాపట్ల జిల్లా చీరాల మండలం కావూరివారిపాలెంలో శనివారం చోటుచేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కావూరివారిపాలేనికి చెందిన కోట బుజ్జిరెడ్డి (50) టిడిపిలో క్రియాశీలకంగా పని చేయడాన్ని సహించని అదే గ్రామానికి చెందిన కొందరు వైసిపి నేతలు ఆయనపై కక్ష పెంచుకున్నారు. గతంలో 40 రోజులపాటు గ్రామంలో బహిష్కరించారు. గ్రామంలో బుజ్జిరెడ్డితోగానీ, ఆయన కుటుంబ సభ్యులతోగానీ ఎవరైనా మాట్లాడినా, వారి ఇంటికి వెళ్లినా వారికి రూ.50 వేలు జరిమానా విధిస్తామని గ్రామంలో ప్రచారం చేశారు. దీంతో, బుజ్జిరెడ్డి మంగళగిరిలోని టిడిపి కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌కు వెళ్లి కార్యాలయం ఎదుటే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించగా సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. కొద్ది రోజుల అనంతరం కోలుకొని గ్రామానికి చేరుకున్న బుచ్చిరెడ్డి చిల్లర కొట్టు పెట్టుకొని జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన కొట్టుకు ఎవరూ వెళ్లకూడదని వైసిపి నాయకులు మరోసారి ప్రకటించారు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన బుచ్చిరెడ్డి సూసైడ్ నోట్ రాసి.. ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డారు. బుచ్చిరెడ్డికి భార్య, కుమారుడు ఉన్నారు. చీరాల డిఎస్‌పి జగదీష్‌నాయక్, సిఐ శేషగిరిరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

మాజీ ఎంపి ఎంవివి ఇళ్లు, కార్యాలయాలపై ఇడి దాడులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

వైసిపి విశాఖ మాజీ ఎంపి ఎంవివి సత్యనారాయణ నివాసాలు, కార్యాలయాలపై శనివారం ఉదయం నుంచి రాత్రి వరకూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) దాడులు జరిగాయి. ఎంవివి సహా విశాఖ నగరానికి చెందిన ఆడిటర్ జి.వెంకటేశ్వరరావు (జివి) కార్యాలయం, నివాసాల్లో సోదాలు చేశారు. విశాఖ, గోదావరి జిల్లాల్లో మొత్తంగా ఐదు చోట్ల ఈ దాడులు నిర్వహించారు. విశాఖ రుషికొండ సమీపంలోని కొండపై సుమారు 12.6 ఎకరాల్లో హయగ్రీవా ఇన్‌ఫ్రా సంస్థ పేరుతో వృద్ధులకు ఆశ్రమాలు నిర్మాణం జరగాల్సిన చోట సుమారు రూ.100 కోట్ల మనీ లాండరింగ్, భూ ఆక్రమణలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో ఈ దాడులు జరిగాయి. గతం నుంచీ ఎంవివి, ఆడిటర్ జివి, హయగ్రీవ జగదీశ్వరుడి మధ్య ఈ వ్యవహారం నలుగుతోంది. ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో జగదీశ్వరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నెంబర్ 227/2024 కింద పది నాన్ బెయిలబుల్ సెక్షన్‌లను ఎంవివిపై నమోదు చేశారు. సీనియర్ సిటిజన్స్, అనాథలకు కేటాయించిన భూములు ఆక్రమించి, వాటిని ఇతరులకు అమ్ముకున్నారన్నదే వాటిలో ప్రధాన ఆరోపణ. వీటిపై తాజాగా దర్యాప్తు సంస్థలు కదులుతున్నాయి.

కాంట్రాక్ట్ లెక్చరర్ల రెగ్యులర్ జెఎసి డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులర్ చేయాలని కాంట్రాక్ట్ లెక్చరర్ల జెఎసి రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు జెఎసి చైర్మన్ కె సురేష్, కో చైర్మన్ కె శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ చట్టం ప్రకటించి ఈ నెల 20వ తేదితో ఏడాది పూర్తవుతుందని పేర్కొన్నారు. గతంలో అర్హులుగా 10,117 మందిని గుర్తించారని, ఎన్నికల కోడ్ నేపథ్యంలో రెగ్యులరైజేషన్ ప్రక్రియ ఆగిందని తెలిపారు. వీరిలో ఐదువేల మంది కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులర్ చేయాలని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తమను క్రమబద్ధీకరించి ఆదుకోవాలని కోరారు.

కడపలో ఘాతుకం

(మొదటి పేజీ తరువాయి)

హర్షవర్ధన్‌రాజు తెలిపారు. సంఘటనా స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని పరిస్థితిపై ఆరా తీశారు. అనంతరం అర్బన్ పోలీసు స్టేషన్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. విగ్నేష్‌కి, విద్యార్థినికి చిన్నప్పటి నుంచి పరిచయం ఉందని తెలిపారు.

అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్న చంద్రబాబు

ఇంటర్ విద్యార్థినిపై పెట్రోల్ దాడి ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులతో మాట్లాడారు. విద్యార్థిని ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని, నిందితుడిని వెంటనే అరెస్టు చేయాలని అధికారులను ఆదేశించారు.

అభ్యుదయ ఉద్యమాలకు స్ఫూర్తి జ్యోత్స్న

సంస్మరణ సభలో వివిధ రంగాల ప్రముఖులు

ప్రజాశక్తి- మంగళగిరి (గుంటూరు జిల్లా)

సమానత్వం కోసం సమాజాన్ని మేల్కొలిపి చైతన్యం తీసుకొచ్చేందుకు గుళ్లపల్లి జ్యోత్స్న జీవిత పర్యంతం శ్రమించారని పలువురు ప్రముఖులు కొనియాడారు. సమాజాభ్యున్నతికి కృషి చేసిన అభ్యుదయవాదని పేర్కొన్నారు. ఈ నెల 8న రాజస్థాన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదం లో మరణించిన అమరావతి బాలోత్సవ్ కమిటీ కార్యదర్శి, తరుణీ తరంగాలు ప్రధాన కార్యదర్శి, సేఫ్ (స్టెప్ ఎహెడ్ ఫర్ ఈక్వాలిటీ) వ్యవస్థాపకురాలు, ప్రముఖ న్యాయవాది, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) వర్కింగ్ ప్రెసిడెంట్, ఎపి బార్ కౌన్సిల్ సభ్యులు సుంకర రాజేంద్ర ప్రసాద్ సతీమణి గుళ్లపల్లి జ్యోత్స్న సంస్మరణ సభ శనివారం గుంటూరు జిల్లా మంగళగిరిలోని సికె కన్వెన్షన్లో జరిగింది. ఈ సభలో జ్యోత్స్న ఉద్యమ అనుభవాలను, స్మృతులను ఆత్మీయులు పంచుకున్నారు. చిన్ననాటి నుండి వామపక్ష భావాలతో పెరిగిన ఆమె ఆ భావాల వ్యాప్తికి, మహిళా సాధికారతకు ఎంతో కృషి చేశారని తెలిపారు. స్త్రీ, పురుష సమానత్వం కోసం పోరాడిన ఆమె మృతి అభ్యుదయ, మహిళా, వామపక్ష ఉద్యమాలకు తీరని లోటని పేర్కొన్నారు. ముందుగా వివిధ రంగాల ప్రముఖులు, పలు సంఘాల నాయకులు ఆమె చిత్రపటం వద్ద పూలు ఉంచి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కేరళ హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు, కేరళ హైకోర్టు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు, ఐలు జాతీయ నాయకులు థామస్ అబ్రహం మాట్లాడుతూ తనకు జ్యోత్స్న కుటుంబంతో కొన్నేళ్ల క్రితమే పరిచయమైనా ప్రజా హక్కుల కోసం ఆ కుటుంబం చేస్తున్న కృషి మదిలో గుర్తుండిపోతుందన్నారు. ఆమె మరణం ప్రజాతంత్ర ఉద్యమానికి తీరనిలోటని పేర్కొన్నారు. మాజీ మంత్రి, రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ ప్రజల కోసం నిరంతరం పనిచేసిన జ్యోత్స్న మరణం సమాజానికి తీరనిలోటన్నారు.



జ్యోత్స్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వి శ్రీనివాసరావు

ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు అందరూ కృషి చేయాలని సూచించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ స్త్రీ, పురుషుల సమానత్వం కోసం జ్యోత్స్న నిరంతరం పోరాడారని గుర్తు చేశారు. సమాజంలో మార్పు తీసుకురావాలన్న ఆకాంక్షతో పనిచేశారని తెలిపారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ మహిళల హక్కుల కోసం సమాజాన్ని చైతన్య పరిచారన్నారు. పిడిఎఫ్ ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ జ్యోత్స్న కుటుంబంతో ఎస్ఎఫ్ఐ ఉద్యమాల ద్వారా తనకు కలిగిన పరిచయం గత 40 ఏళ్లుగా కొనసాగుతోందన్నారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ ఎన్.ద్వారకనాథ్ రెడ్డి మాట్లాడుతూ జ్యోత్స్న స్ఫూర్తితో న్యాయవాదులు సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ టి.రజిని మాట్లాడుతూ ఆంధ్ర యూనివర్సిటీలో చదువుతున్నప్పుడు ఎస్ఎఫ్ఐ ఉద్యమం ద్వారా తనకు పరిచయమైన జోత్స్న... స్త్రీల హక్కుల కోసం నిరంతరం పోరాడిన మహోన్నతురాలని కొనియాడారు. సర్వోత్తమ గ్రంథాలయ కార్యదర్శి రావి శారద మాట్లాడుతూ మహిళలు, యువతులు, విద్యార్థుల్లోని సృజనాత్మకతను, కళలను వెలుగులోకి తెచ్చేందుకు కృషి చేశారని అన్నారు. ఎంబి విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ చైర్మన్ పి.మధు మాట్లాడుతూ ఇటీవల విజయవాడలో నిర్వహించిన దసరా సాంస్కృతికోత్సవాలను సామాజిక అంశాలతో ముడిపెట్టి ఘనంగా నిర్వహించి విజయవంతం చేయడంలో జ్యోత్స్న పాత్ర కీలకమన్నారు. ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ 'తరుణీతరంగాలు' వేదికను అంతా తానై నిర్వహించారని గుర్తు చేశారు. ప్రజాశక్తి సంపాదకులు బి.తులసీదాస్ మాట్లాడుతూ జ్యోత్స్నకు ప్రజాశక్తితో ఎంతో అనుబంధం ఉందని తెలిపారు.

మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ జ్యోత్స్న ఆదర్శంగా జీవిస్తూ సమాజానికి ఎంతో మేలు చేశారన్నారు. ఐద్వా రాష్ట్ర సీనియర్ నాయకురాలు కె.స్వరూపరాణి మాట్లాడుతూ లింగవివక్షకు వ్యతిరేకంగా విద్యార్థి దశ నుంచే ఉద్యమించారని గుర్తు చేశారు. జ్యోత్స్న సోదరుడు జి.సురేంద్ర మాట్లాడుతూ జ్యోత్స్న ఛాయాచిత్రాలతో త్వరలో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తామన్నారు. మరో సోదరుడు జి.జితేంద్ర మాట్లాడుతూ చదివితేనే అభివృద్ధి సాధిస్తారని తన అక్క చెప్పిన మాటలతో స్ఫూర్తి పొందానన్నారు. జ్యోత్స్న కుటుంబసభ్యులు పలువురు మాట్లాడుతూ జ్యోత్స్న, ఆమె భర్త సుంకర రాజేంద్రప్రసాద్ విలువలతో కూడిన జీవితాన్ని గడిపారని కొనియాడారు. సమాజంలో మార్పు తీసుకురావాలనే ఆకాంక్షతో సమాజాభ్యున్నతికి కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎవి.శేషశాయి, సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపల్ ఎ.సునీత తదితరులు మాట్లాడారు. ముందుగా సభలో జ్యోత్స్న మృతికి సంతాపంగా కొద్దిసేపు మౌనం పాటించారు. అనంతరం అమరావతి బాలోత్సవం, తరుణీతరంగాలుకు చెందిన విద్యార్థులు పలు కళా రూపాలను ప్రదర్శించారు.

ఐఆర్‌టిఎస్ (రిటైర్డ్) అధికారి రవిబాబు మృతి

- ఉస్మానియా ఆస్పత్రికి భౌతికకాయం అప్పగింత

ప్రజాశక్తి- హైదరాబాద్



రవిబాబు (ఫైల్)

ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థి ఉద్యమ నేత, ఐఆర్‌టిఎస్ కేడర్ ఉన్నతాధికారి మంచాల రవిబాబు (63) గురువారం సాయంత్రం హైదరాబాద్‌లో కన్నుమూశారు. ఆయన కొంతకాలంగా కేన్సర్‌తో బాధపడుతున్నారు. పరిస్థితి విషమించడంతో తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య ఫణిశ్రీ, కుమారుడు ప్రత్యూష్, కుమార్తె నయనతార ఉన్నారు. వామపక్ష కుటుంబం నుంచి వచ్చిన ఆయన ఎస్ఎఫ్ఐలో చురుకుగా పనిచేశారు. కమ్యూనిస్టు పార్టీకి తోడ్పడ్డారు. కాకినాడ జెఎన్‌టియు, ఐఐటి ఖర్గపూర్, ఐఐఎం అహ్మదాబాద్‌లో ఫెలోషిప్ చేశారు. విశాఖలో ప్రజా వైద్యశాల నిర్వహిస్తున్న డాక్టర్ రమేష్‌కుమార్‌కు ఆయన సోదరుడు. వ్యవసాయంపై మక్కువతో, గ్రామీణ అభివృద్ధిపై ఆసక్తితో హైదరాబాద్‌లోని ఎన్ఐఆర్‌డిలో డిప్యుటేషన్‌పై రవిబాబు చాలాకాలం పనిచేశారు. 'అనేక ధార' పేరుతో కొంతకాలంగా సామాజిక ఆర్థిక సాంస్కృతిక అంశాలపై ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మేధావులతో ఉపన్యాసాలు నిర్వహించారు. భౌతికకాయాన్ని ఆయన కోరికపై కుటుంబసభ్యులు ఉస్మానియా ఆస్పత్రికి వైద్య పరిశోధనల నిమిత్తం శుక్రవారం అప్పగించారు. కాకినాడ జెఎన్‌టియులో ఇంజనీరింగ్ చదువుతూ 1979లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎస్ఎఫ్ఐ కార్యదర్శిగా రవిబాబు పనిచేశారు. నగరంలో, జిల్లాలో విద్యార్థి సమస్యలపై జరిగిన అనేక పోరాటాలకు నాయకత్వం వహించారు. ఇటీవల కాకినాడలో జరిగిన ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో అనేక విలువైన సలహాలు, సూచనలు ఇచ్చారు. ఎంతో విలువైన జీవితాన్ని ప్రగతిశీల కార్యాలకు వినియోగించే అవకాశాలున్నా ఆకస్మికంగా దూరం కావడం దురదృష్టకరమని ఆయన సన్నిహితులు ఆవేదన వ్యక్తం చేశారు. రవిబాబు మృతి పట్ల వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు సంతాపం ప్రకటించాయి. కాకినాడలో ఆదివారం ఉదయం సంస్మరణ సభ నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ నిర్ణయించింది.

21న ట్రాన్స్‌కో కోఆర్డినేషన్ సమావేశం : సిఎండి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ట్రాన్స్‌కో స్టేట్ కోఆర్డినేషన్ ఫోరమ్ సమావేశం ఈ నెల 21న కర్నూలులో నిర్వహిస్తున్నట్లు ఇంధన శాఖ ప్రత్యేకప్రధాన కార్యదర్శి, ట్రాన్స్‌కో సిఎండి కె విజయానంద్ తెలిపారు. ఎపిఇఆర్‌సి చైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డి అధ్యక్షత వహిస్తారని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎలక్ట్రిసిటీ ప్లాన్ (2024-25, 2028-29) ఆమోదం కోసం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. చైర్మన్ అనుమతితో ఇతర అంశాలు కూడా చర్చించవచ్చని తెలిపారు. ఈ సదస్సులో జెన్‌కో ఎండి కెవిఎన్ చక్రధర్ బాబు, ట్రాన్స్‌కో జెఎండి కీర్తి చేకూరి, డిస్కంల సిఎండిలు ఐ పృథ్వీతేజ్, పట్టన్ శెట్టి రవి, కె సంతోష్ రావు, ఎన్టీపిసి, సెకి తదితర సంస్థల ఉన్నతాధికారులు హాజరవుతారని పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సాయిబాబు

రైల్వే భద్రతా చర్యలపై కేంద్రం నిర్లక్ష్యం

- ఎం. సాయిబాబు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

రైల్వే భద్రతా చర్యలపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడు తోందని రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ కో-ఆర్డినేషన్ కమిటీ జాతీయకోశాధికారి ఎం.సాయిబాబు విమర్శించారు. శనివారం విశాఖలోని సిఐటియు కార్యాల యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద రైల్వే వ్యవస్థగా పేరొందిన ఇండియన్ రైల్వేలో భద్రతా చర్యలు లోపభూయిష్టంగా ఉన్నాయన్నారు. 2023-24లో 40 రైలు ప్రమాదాలు జరిగి 313 మంది ప్రయాణికులు, నలుగురు రైల్వే ఉద్యోగులు మరణించారని తెలిపారు. వేలాది మంది గాయాలపాలయ్యా రన్నారు. రైల్వేలో మూడు లక్షలకుపైగా ఉద్యోగ ఖాళీలు ఉన్నాయని, సేఫ్టీ విభాగంలో స్టేషన్ మాస్టర్స్, సిగ్నలర్, డ్రైవర్స్, గార్డ్స్, టెక్నీషియన్స్ తదితర పోస్టులు భర్తీకి నోచుకోలేదని తెలిపారు. సేఫ్టీ విభాగంలో శిక్షణ పొందిన కార్మికులను వినియోగించకుండా ప్రయివేటీ కరణ పేరిట నచ్చినవారితో పనిచేయిస్తున్నార న్నారు. నాసిరకమైన పరికరాలను వాడుతున్నారని, అధునాతన టెక్నాలజీపై ఉద్యోగులకు సరైన శిక్షణ ఇవ్వడం లేదని విమర్శించారు. సేఫ్టీ విషయంలో మెయింటినెన్స్‌ను ప్రాపర్‌గా చేయకుండా షార్ట్ కట్ మెథడ్స్ ఉపయోగిస్తు న్నారని, రైల్వే బోర్డు చైర్మన్, మంత్రి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లినప్పటికీ ఫలితం లేకపోయిందన్నారు. ప్రమాదాలు జరిగిన తర్వాత నియమించిన వివిధ కమిషన్లు ఇచ్చిన రిపోర్టులను బుట్టదాఖలు చేస్తున్నారని విమర్శించారు.. వయోవృద్ధులు, ఇతరులకు ఇచ్చే రాయితీలకు కోతలు పెడుతున్నారన్నారు. నేషనల్ మానిటైజేషన్ పైపులైన్ పేరుతో రైల్వే స్టేషన్లను ప్రయివేటు వ్యక్తులకు అప్పజెప్పి యూజర్ ఛార్జీల పేరుతో ప్రయాణికులపై విపరీతమైన భారాలను మోపుతున్నారని తెలిపారు. దేశవ్యాప్తంగా రైల్వేలో ఐదు లక్షల మంది కాంట్రాక్టు కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతున్నారని, వారికి కనీస వేతనాలు, కార్మిక చట్టాలు అమలు కావడం లేదన్నారు. త్వరలో రైల్వే సమస్యలపై దేశవ్యాప్త ప్రచారం చేపట్టనున్నామని తెలిపారు. డిసెంబర్ 20న ఢిల్లీలో రైల్వే రక్షణ, ప్రజల భద్రత, పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై కన్వెన్షన్ నిర్వహించి తగిన కార్యాచరణ రూపొందిస్తామన్నారు. సమావేశంలో కో-ఆర్డినేషన్ కమిటీ జాతీయ కన్వీనర్ డి.రమేష్ బాబు, సభ్యులు ఉమామహేశ్వం రావు, వివిఎల్.నరసింహులు, బి.మధు, శ్రీహరి ఆచార్య, ఖలీల్, సిఐటియు నాయకులు కుమార్, జగన్, ఒ.అప్పారావు పాల్గొన్నారు.

గుర్లలో డయేరియా అదుపులో ఉంది : కలెక్టర్

ప్రజాశక్తి- విజయనగరం

విజయనగరం జిల్లా గుర్లలో డయేరియా అదుపులోనే ఉందని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ తెలిపారు. శనివారం కొత్తగా ఎలాంటి కేసులూ నమోదు కాలేదన్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన శిబిరంలో 12 మంది చికిత్స పొందుతున్నారని తెలిపారు. వారందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని పేర్కొన్నారు. సత్వర ప్రాథమిక చికిత్స అందించడానికే గ్రామంలోని పాఠశాలలో తాత్కాలిక వైద్య శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. శిబిరంలో చికిత్స పొందిన వారు కోలుకున్న అనంతరం ఇళ్లకు తిరిగి వెళ్తున్నారని, తదుపరి చికిత్స అవసరమైన వారిని జిల్లా ప్రభుత్వాస్పత్రికి, ఇతర ప్రాంతాల ఆస్పత్రులకు తరలిస్తున్నామని కలెక్టర్ తెలిపారు.

బిజెపి హయాంలో ప్రభుత్వ రంగంపై తీవ్ర దాడి

- బీమా రంగానికి, పరిశ్రమలకు సవాళ్లు
- ఎఐఐఇఎ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత మిశ్రా
- విశాఖలో ఘనంగా ఐసిఇయు గోల్డెన్‌జూబ్లీ సమావేశం ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ రంగంపై దాడి తీవ్రమైందని, బీమా రంగానికి, ప్రభుత్వ పరిశ్రమలకు సవాళ్లు ఎదురవుతున్నాయని ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఎఐఐఇఎ) ప్రధాన కార్యదర్శి శ్రీకాంత మిశ్రా అన్నారు. ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ (ఐసిఇయు) విశాఖపట్నం డివిజన్ 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రెండు రోజులపాటు తలపెట్టిన గోల్డెన్ జూబ్లీ వార్షిక సమావేశం విశాఖపట్నంలోని అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా శనివారం ఘనంగా ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన శ్రీకాంత మిశ్రా మాట్లాడుతూ.. ఐసిఇయు విశాఖపట్నం విభాగం 1974లో ప్రారంభమైందని, ప్రప్రథమంగా ఉద్యోగుల వేతన సవరణ కోసం పోరాటం చేసిందని గుర్తు చేశారు. 2014కు ముందు ఇన్సూరెన్స్ సెక్టార్ ఎంతో దృఢంగా ఉండేదని, బిజెపి అధికారంలోకి వచ్చాక భారత దేశంలో పబ్లిక్ సెక్టార్‌పై దాడులు పెరిగాయని తెలిపారు. ఎన్నో పోరాటాలకు ఐసిఇయు



మాట్లాడుతున్న ఎఐఐఇఎ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత మిశ్రా

విశాఖపట్నం డివిజన్ నేతృత్వం వహించందని, ఇక్కడ చేపట్టిన నిరసనలు, ధర్నాలు, ఆందోళనలు విజయవంతమయ్యాయని తెలిపారు. ఇన్సూరెన్స్ రంగంతోపాటు పబ్లిక్ సెక్టార్ సంస్థలు తీవ్ర సంక్షోభంలోకి వెళ్తుండటంపై ఆందోళన వ్యక్తం చేశారు. సంఘం అధ్యక్షులు వి.రమేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2022లో ఎల్ఐసిలోని 3.5 శాతం వాటాలను ఐపిఒ ద్వారా విక్రయించిందని, అక్కడితో ఆగక డిజిఇన్వెస్టిమెంట్ వైపు అడుగులు ప్రారంభించిందని తెలిపారు. ఇన్సూరెన్స్ రంగంలో వాటాల ఉపసంహరణ ద్వారా ఈ రంగాన్ని ప్రయివేటు వారి చేతుల్లోకి పెట్టేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ఇది పాలసీదారులు, దేశ ప్రయోజనాలకు విఘాతం కలిగించే చర్యని పేర్కొన్నారు. సంఘం మాజీ అధ్యక్షులు అమానుల్లా ఖాన్ మాట్లాడుతూ.. ఎల్ఐసి భారత దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తూ వచ్చిందని, ప్రభుత్వం పెట్టిన రూ.500 కోట్ల పెట్టుబడి మీద రూ.52 లక్షల కోట్ల ఆస్తులను సమకూర్చిందని గుర్తు చేశారు. దేశాభివృద్ధికి ఎంతగానో తోడ్పడిందని తెలిపారు. అటువంటి సంస్థను నిర్వీర్యం చేయడానికి చేస్తున్న ప్రయత్నాలు ఎంత మాత్రమూ సరికాదన్నారు. బీమా రంగాన్ని రక్షించుకునేందుకు ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి కె.వేణుగోపాల్, ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ సౌత్ సెంట్రల్ జోన్ అధ్యక్షులు పి.సతీష్, నాయకులు కె.రవీంద్రనాథ్, ఐసిఇయు మచిలీపట్నం డివిజన్ ప్రధాన కార్యదర్శి జి.కిషోర్ కుమార్, ఐసిఇయు విశాఖ డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.కామేశ్వరి, జి.వరప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు కార్మికులను ఆర్థికంగా దెబ్బతీయడం సరికాదు

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

స్టీల్‌ప్లాంట్ కార్మికులను ఆర్థికంగా దెబ్బతీయడం సరికాదని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ ఎం రాజశేఖర్, ఐఎన్‌టియుసి నాయకులు నీరుకొండ రామచంద్రరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో తలపెట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారానికి 1346వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఐఎన్‌టియుసి కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి నాయకులు మాట్లాడుతూ సకాలంలో జీతాలు అందకపోవడంతో ఉక్కు ఉద్యోగులు, కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాంట్రాక్ట్ కార్మికుల పరిస్థితి మరీ దారుణంగా తయారైందన్నారు. ప్లాంట్‌కు తగినంత ముడిసరుకును సరఫరా చేసి పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో నడపాలని, వర్కింగ్ కేపిటల్ కేటాయించాలని డిమాండ్ చేశారు.

బడి, గుడికి 100మీటర్లు దాటాకే మద్యం షాపులు : మంత్రి రవీంద్ర

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బడులు, దేవాలయాలకు 100 మీటర్లలోపు మద్యం షాపులు ఉండకుండా చర్యలు తీసుకుంటామని గనులు,భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాన్ని బలోపేతం చేస్తామని, డిఎడిక్షన్ కేంద్రాలు రిహ్యాబిటేషన్ ద్వారా అవగాహన కల్పిస్తామని చెప్పారు. టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇసుక, మద్యంలో దోపిడీ జరిగిందని మాజీముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. మద్యం షాపులకు దరఖాస్తుల రూపంలో ప్రభుత్వానికి రూ.1,797 కోట్ల ఆదాయం వచ్చిందని తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే జులై 8 నుంచి ఉచిత ఇసుక అమలు చేసి పారదర్శకంగా అందిస్తున్నామని చెప్పారు. గత ఐదేళ్లల్లో అక్రమ ఇసుక ద్వారా రూ.1,000కోట్లు, మద్యం ద్వారా రూ.1,900కోట్లు జగన్ దోచుకున్నారని విమర్శించారు. మైనింగ్ విధానాన్ని కూడా భ్రష్టు పట్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భవన నిర్మాణ కార్మికులను సర్వ నాశనం చేశారని విమర్శించారు. వైసిపి హయాంలో ఆదాయం జగన్‌కే వచ్చింది తప్ప రాష్ట్రానికి రాలేదని మండిపడ్డారు. అక్రమంగా ఇసుక తవ్వకాలు చేయడం వల్ల నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్(ఎన్‌జిటి) రూ.100కోట్లు జరిమానా విధించడం నిజం కాదా అని ప్రశ్నించారు. వైసిపి చేసిన అనైతిక విధానాల వల్ల ఎన్‌జిటి కఠిన తరమైన నిర్ణయాలు తీసుకుని 130 రీచ్‌లను సీజ్ చేసిందని వెల్లడించారు. దీంతో అన్నీ రీచ్‌లు తెరవలేకపోతున్నామని చెప్పారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి 35లక్షల టన్నుల ఇసుక అందుబాటులో ఉంటే 80లక్షలని వైసిపి అసత్యాలు చెబుతుందని పేర్కొన్నారు.



ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం సమర్పిస్తున్న ద్వారకనాథ రెడ్డి తదితరులు

5 ఎకరాల భూమి కేటాయించండి

- సిఎంకు బార్ కౌన్సిల్ విజ్ఞప్తి
- సిఎంఆర్‌ఎఫ్‌కు రూ.10 లక్షల విరాళం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అమరావతిలోని హై కోర్టు సమీపంలో ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్‌కు 5 ఎకరాల భూమిని కేటాయించాలని బార్ కౌన్సిల్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. బార్ కౌన్సిల్ చైర్మెన్ నల్లారి ద్వారకానాథరెడ్డి నేతృత్వంలోని ప్రతినిధుల బృందం ముఖ్యమంత్రి చంద్రబాబును ఆయన నివాసంలో శనివారం కలిశారు. వరద బాధితుల కోసం బార్ కౌన్సిల్ రూ.10 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా న్యాయవాదులకు సంబంధించిన సమస్యలపై వినతి పత్రాన్ని సిఎంకు అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా బార్ కౌన్సిల్‌లో 70 వేల మందికిపైగా సభ్యులు ఉన్నారని వీరికి వృత్తిపరమైన నైపుణ్యాలను పెంచేందుకు సెమినార్లు, వర్క్‌షాపులు నిర్వహించేందుకు అనువైన భవనాన్ని నిర్మించాలని కోరారు. మరణించిన 905 మంది న్యాయవాదుల కుటుంబాలకు చెల్లించాల్సిన మ్యాచింగ్ గ్రాంట్ 2020 నుంచి పెండింగ్‌లో ఉన్నందున తక్షణమే విడుదల చేయాలని కోరారు. జూనియర్ అడ్వకేట్లకు స్టైఫండ్ రూ.10వేలు ప్రకటించడం పట్ల కౌన్సిల్ హర్షం వ్యక్తం చేసింది. అదేవిధంగా వీరికి శిక్షణ ఇచ్చేందుకు అడ్వకేట్స్ అకాడమిని ఏర్పాటు చేయాలని, అమరావతిలో ఇంటర్నేషనల్ లా స్కూల్ ఏర్పాటు చేస్తామని ప్రకటించడం పట్ల స్వాగతిస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు. న్యాయవాదులు సంక్షేమానికి రూ.100 కోట్ల నిధులు విడుదల చేస్తామని ప్రకటిండాన్ని స్వాగతిస్తున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో న్యాయవాదులు సంక్షేమానికి వంద కోట్ల నిధులు విడుదల చేస్తామని ప్రకటించినప్పటికి నిధులు విడుదల చేయలేదన్నారు. ఇదిలా ఉంటే కోవిడ్ సమయంలో ప్రభుత్వం న్యాయవాదుల సంక్షేమానికి రూ.25 కోట్లు విడుదల చేసిందని, ఆ మొత్తాన్ని న్యాయవాదుల ఆరోగ్య బీమా కోసం ఉపయోగించడం జరిగిందన్నారు.

పిడుగుపాటుకు ఇద్దరు మృతి

ప్రజాశక్తి - యంత్రాంగం

పల్నాడు, ఏలూరు జిల్లాల్లో పిడుగుపాటుకు ఇద్దరు మృతి చెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం గోపాలపురం పంచాయతీ పరిధిలోని పందిరెడ్డిగూడెంకు చెందిన కైల ఏడుకొండలు (53) పశువులను మేపేందుకు పొలానికి వెళ్లారు. వర్షం కురవడంతో ఓ చెట్టు కింద నిల్చున్నారు. ఆ సమయంలో పెద్ద శబ్దంతో పిడుగుపడింది. దీంతో, ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ఏడుకొండలుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం రుద్రవరం గ్రామానికి చెందిన గడ్డం హనుమంతరావు (65) గ్రామ సమీపంలోని పొలాల్లో పశువులను మేత కోసం తోలుకెళ్లారు. మధ్యాహ్నం సమయంలో ఉరుములు, మెరుపులతో వర్షం కురవడంతో చెట్టు కింద నిల్చున్నారు. కొద్ది సేపటికి పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందారు. హనుమంతరావుకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

హామీల అమల్లో ప్రభుత్వం విఫలం : బొత్స

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

ఎన్నికల హామీల అమల్లో టిడిపి కూటమి ప్రభుత్వం విఫలమైందని వైసిపి ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ విమర్శించారు. విశాఖ లాసన్స్ బే కాలనీలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను ఎప్పుడూ అమలు చేస్తారో తెలిపారు. వైసిపి ప్రభుత్వ హయాంలో రూ.10 వేలకు ఇచ్చిన ఇసుకను నేడు రూ.15 వేలకు విక్రయిస్తూ.. ఉచిత ఇసుక పథకమంటూ ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో సీనరేజ్ ఛార్జీల కింద రూ.375 వసూలు చేసే వారిమని, తద్వారా ప్రభుత్వానికి ఆదాయం వచ్చేదని పేర్కొన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం సీనరేజ్ వసూలు చేయకపోయినప్పటికీ టన్ను ఇసుక రేటు తగ్గలేదని తెలిపారు. మద్యం ధరలు తగ్గిస్తామని నూతన మద్యం పాలసీలో స్పష్టంగా తెలియజేసిన ప్రభుత్వం ఎక్కడ తగ్గించారో? ఎంత తగ్గించారో? చెప్పాలని డిమాండ్ చేశారు. నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని తెలిపారు. తల్లికి వందనం, రైతు భరోసా ఒకరికైనా ఇచ్చారా? అని ప్రశ్నించారు. అగ్గిపెట్టెలకు కోట్ల రూపాయలు ఖర్చు చేసిన ప్రభుత్వాన్ని తాను ఎప్పుడూ చూడలేదని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ అవినీతిపై వార్తలు రాస్తే తప్పుడు కేసులు పెడుతున్నారని తెలిపారు. టిడిపి నేతల కుమ్మలాటల వల్ల గుర్లలో డయేరియాతో పది మంది చనిపోయారని, 4 నెలల నుంచి మంచినీటిపై అక్కడ పర్యవేక్షణ లేదని, మంచినీటి కాంట్రాక్టు తమకు ఇవ్వాలంటే తమకు ఇవ్వాలని అక్కడి నేతలు కుమ్ములాడుకున్నారని తెలిపారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే డయేరియా ప్రబలిందన్నారు. డయేరియాతో చనిపోయిన పది మందికి తక్షణం ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వైసిపి జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్‌నాథ్ పాల్గొన్నారు.

వరద బాధితులకు స్పెషలిస్ట్ వైద్య సేవలు

- రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఇటీవల సంభవించిన వరదల ప్రభావంతో విజయవాడలోని అనేక ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడ్డారని, వారందరూ ఆరోగ్యంగా ఉండేందుకు వీలుగా ప్రత్యేక వైద్యశిబిరాన్ని నిర్వహించామని రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ మెంబర్ సెక్రటరీ ఎం.బబిత తెలిపారు. విజయవాడ అర్బన్ పరిధిలోని న్యూ వాంబే కాలనీ యుపిహెచ్‌సిలో రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, వైద్య ఆరోగ్యశాఖ సహకారంతో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎం. బబిత, సెకండ్ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జ్ కమ్ మెట్రోపాలిన్ సెషన్స్ జడ్జి ఎ.సత్యానంద్, డిఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ ఎం.సుహాసిని ప్రారంభించారు. ఈ సందర్భంగా బబిత మాట్లాడుతూ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, రాష్ట్ర న్యాయాధికార సేవా సంస్థ, ప్యాట్రన్ ఇన్ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ మార్గనిర్ధేశనంతో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. రూ.3 లక్షల లోపు వార్షికాదాయం ఉన్న వారు, మహిళలు, పిల్లలు, ఎస్‌సి, ఎస్‌టిలు వరదలు వంటి విపత్తు ప్రభావిత ప్రజలకు న్యాయ సలహా, సహాయం కోసం ఉచితంగా అడ్వకేట్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఇందుకోసం జిల్లా, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థలను సంప్రదించవచ్చని బబిత పేర్కొన్నారు. 15100 హెల్ప్‌లైన్ టోల్ ఫ్రీ నెంబరుకు కూడా ఫోన్ చేయవచ్చని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ డిప్యూటీ సెక్రటరీ డాక్టర్ హెచ్ అమర రంగేశ్వరరావు, డిపిఎంఓ డాక్టర్ నవీన్ పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర లక్ష్య సాధనకు అడుగులు

- లంకా దినకర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ లక్ష్యాల సాధన దిశగా 20 సూత్రాల కార్యక్రమం అమలుచేస్తామని ఆంధ్రప్రదేశ్ 20 సూత్రాల కార్యక్రమం అమలు ఛైర్మన్ లంకా దినకర్ పేర్కొన్నారు. సచివాలయంలో ఆయన శనివారం 20 సూత్రాల కార్యక్రమం అమలు ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మీడియతో మాట్లాడుతూ వికసిత్ భారత్ 2047ను ప్రధాని మోడీ చేపట్టారని, స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్స్ అమలు చేయాలనే లక్ష్యంతో సిఎం ఉన్నారని అన్నారు. కేంద్ర ప్రాయోజిత పథకాలను పూర్తిస్థాయిలో వినియోగించుకునేందుకు సిఎం ప్రత్యేక శ్రద్ధచూపుతున్నారన్నారు. ఈ లక్ష్య సాధనకు అనుగుణంగా రాష్ట్రంలో 20 సూత్రాల కార్యక్రమాన్ని అందరి సహకారంతో అమలు చేసే దిశగా తాను ముందడుగు వేస్తున్నట్లు దినకర్ తెలిపారు. కేంద్ర ప్రాయోజిత పథకమైన జల్ జీవన్ మిషన్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లోని గృహాలకు సురక్షితమైన మంచి నీటిని అందించాలనే లక్ష్యంతోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పాతూరి నాగభూషణం, షేక్ బాజీ పాల్గొన్నారు.



తుళ్లూరు పోలీస్ స్టేషన్లో నందిగం సురేష్

పోలీస్ కస్టడీకి నందిగం సురేష్

ప్రజాశక్తి - తుళ్లూరు (గుంటూరు జిల్లా)

వైసిపి నేత, మాజీ ఎంపి నందిగం సురేష్‌ను పోలీసులు కస్టడీకి తరలించారు. ఓ హత్య కేసులో నిందితుడిగా అరెస్టై గుంటూరు జైలులో ఉన్న ఆయనను తదుపరి విచారణ నిమిత్తం కోర్టు ఉత్తర్వుల మేరకు పోలీసులు శనివారం తుళ్లూరుకు తరలించారు. వెలగపూడిలో 2020 డిసెంబర్ 27న జరిగిన రాళ్ల దాడిలో మెండెం మరియమ్మ అనే వృద్ధురాలు చనిపోయారు. ఆమె హత్య కేసులో రిమాండ్ ఖైదీగా గుంటూరు జైలులో ఉన్న సురేష్‌ను కస్టడీకి ఇవ్వాలని తుళ్లూరు పోలీసులు పిటిషన్ వేయగా మంగళగిరి కోర్టు అనుమతించింది. దీంతో తుళ్లూరు పోలీసులు నందిగం సురేష్‌ను గుంటూరు జైలు నుంచి తుళ్లూరు పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఆయనను డిఎస్‌పి మురళీకష్ణ, సిఐలు వెంకటేశ్వర్లు, అంజయ్య బృందం విచారించనుంది. రెండురోజుల పాటు విచారించిన అనంతరం సోమవారం మధ్యాహ్నం గుంటూరు జైలుకు తరలిస్తారు.


టిడిపి కడప నగర అధ్యక్షుడిపై దాడి

ప్రజాశక్తి-కడప అర్బన్

టిడిపి కడప నగర అధ్యక్షులు శివకొండారెడ్డిపై గుర్తుతెలియని వ్యక్తులు శనివారం దాడి చేశారు. పోలీసుల వివరాల మేరకు...చిన్నచౌక్‌లోని తన ఇంటి నుంచి పాల కోసం ద్విచక్రవాహనంపై మానస కల్యాణ మండపం సమీపంలోని పాలకేంద్రం వద్దకు శివకొండారెడ్డి వచ్చారు. అదే సమయంలో ముగ్గురు యువకులు ద్విచక్ర వాహనంపై వచ్చి కర్రలతో ఆయనపై దాడి చేశారు. దీంతో శివకొండారెడ్డి తలకు తీవ్రగాయాలయ్యాయి. ఆయనను స్థానికులు ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ట్రాన్స్‌పోర్టు కార్మికులకు కేరళ తరహా సంక్షేమ పథకాలు

- ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి వర్క్ షాప్‌లో గఫూర్ డిమాండ్



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న గఫూర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రోడ్డుట్రాన్స్‌పోర్టు కార్మికుల జీవితాలు విపత్కర పరిస్థితుల్లో ఉన్నాయని, ప్రభుత్వాలు ఆదుకోవాలని సిఐటియు రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.గఫూర్ డిమాండ్ చేశారు. రెండురోజులపాటు జరగనున్న ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌ను నంద్యాల ఎన్‌జిఒ కాలనీ నేషనల్ పిజి కళాశాల కాన్ఫరెన్స్ హాలులో శనివారం ప్రారంభమైంది. ఫెడరేషన్ జెండాను గఫూర్ ఆవిష్కరించి వర్క్‌షాపును ప్రారంభించారు. ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు శివాజీ అధ్యక్షత వహించారు. గఫూర్ మాట్లాడుతూ.. వర్షాలు, వరదలు వచ్చినప్పుడు ఆటో, రవాణా రంగం కార్మికులను ప్రభుత్వాలు అదుకోవాలని డిమాండ్ చేశారు. ఆటో రంగంలో పనిచేసే వర్కర్లకు, డ్రైవర్లకు, క్లీనర్లకు భద్రత లేదన్నారు. ఎంఎస్‌సిలు, ఎంఇడిలు, ఇంజనీరింగ్ చదివిన యువత ఉద్యోగాలు లేక ఆటోలు నడుపుతూ జీవనం సాగిస్తోందని తెలిపారు. అసంఘటిత కార్మికులు, ట్రాన్స్‌పోర్ట్ కార్మికులు, ఆటో కార్మికుల జీవితాల్లో మార్పు రావాలని, అందుకోసం ఉద్యమించాలని కోరారు. కేరళ తరహాలో మన రాష్ట్రంలోని రవాణా రంగం కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం రూ.పదివేల కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.ఐదు వేల కోట్లు ట్రాన్స్‌ఫోర్ట్ కార్మికులకు ఖర్చు పెట్టాలని కోరారు. రాష్ట్ర అధ్యక్షులు శివాజీ మాట్లాడుతూ.. ట్రాన్స్ పోర్ట్ రంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల కోసమే ఆటో, ట్రాన్స్‌పోర్ట్ కార్మికులను ఉపయోగించుకుంటున్నారు తప్ప వారి అభివృద్ధికి పాలకులు చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.శివాజీ , ప్రధాన కార్యదర్శి ముజఫర్ అహ్మద్, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు, ఎస్‌బ్ల్యుఎఫ్ రాష్ట్ర కోశాధికారి దివాకర్, సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వి.ఏసురత్నం, ఎ.నాగరాజు, ఆటో వర్కర్స్ యూనియన్ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి డి.లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



బొబ్బిలి ఆర్‌టిసి కాంప్లెక్స్ జంక్షన్‌లో రాస్తారోకో చేస్తున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

డయేరియా మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్, బొబ్బిలి

విజయనగరం జిల్లా గుర్లలో డయేరియాతో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని, బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యాన శనివారం విజయనగరం, బొబ్బిలిలో ఆందోళనలు చేపట్టారు. బొబ్బిలి ఆర్‌టిసి కాంప్లెక్స్ కూడలిలో జరిగిన రాస్తారోకోలో సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, కలెక్టరేట్ వద్ద నిరసనలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకర్రావు పాల్గొని మాట్లాడారు. కలుషిత నీటితో ప్రజలు డయేరియా బారిన పడినప్పటికీ నివారణకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోకపోవడం అన్యాయమన్నారు. డయేరియాతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా మెరుగైన వైద్యసేవలు అందించకుండా పాఠశాలలో బెంచీలపై రోగులకు చికిత్స చేయడం దుర్మార్గమని తెలిపారు. గుర్లలో జిల్లా కలెక్టర్, మంత్రి పర్యటించినా వాస్తవాలు మాట్లాడకుండా డయేరియా తీవ్రత లేదని చెప్పడం దారుణమన్నారు. డయేరియాతో 8 మంది మరణిస్తే ఒక్కరు మాత్రమే మృతి చెందారని ప్రకటించడం విడ్డూరంగా ఉందని ధ్వజమెత్తారు. కలుషిత నీటి వల్లే డయేరియా వ్యాప్తి చెందిందని తెలిపారు.

ప్రభుత్వం స్పందించి సురక్షితమైన తాగునీరు సరఫరా చేయాలని, పారిశుధ్య పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు పరిహారం చెల్లించకుంటే ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. అనంతరం డిఆర్‌ఓ అనితకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టివి రమణ, పి.శంకరరావు, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు కె.పుణ్యవతి, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.రామ్మోహన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాల్‌మనీ కేసులో ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఏలూరు జిల్లాలో సంచలనం రేకెత్తించిన కాల్‌మని కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు వివరాలను జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్‌పి కె.ప్రతాప్ శివకిషోర్ శనివారం మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు వన్‌టౌన్‌కు చెందిన సుబ్బలక్ష్మి అదే ప్రాంతానికి చెందిన మేడపాటి సుధాకర్‌రెడ్డి 2019లో రూ.1.20 లక్షలు తీసుకుని వారానికి రూ.3 వేలు చొప్పున వడ్డీ చెల్లిస్తూ రూ.6 లక్షల వరకూ వడ్డీ రూపంలో చెల్లించారు. ఈ సొమ్ము మొత్తం ఫోన్‌పే ద్వారానే చెల్లించినప్పటికీ అప్పు చెల్లించలేదని సుధాకర్‌రెడ్డి ఆమెను వేధిస్తున్నారు. ఖాళీ నోట్లు, చెక్కులపై సంతకాలు చేయించుకుని కోర్టులో కేసులు వేశారు. ఇంట్లో సామగ్రి సైతం పట్టుకుపోయారు. కుటుంబ సభ్యులను చంపేస్తామని బెదిరిస్తూ మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించారు. సుధాకర్‌రెడ్డి వేధింపులు తాళలేక బాధితురాలు సుబ్బలక్ష్మి పోలీసులను ఆశ్రయించారు. దీంతో సుధాకర్‌రెడ్డిని, ఆయన భార్య అల్లాడ లావణ్య, అనుచరులు గూడవల్లి విద్యాసాగర్, వీరమల్ల రాజేష్, మహ్మద్ షకీల్ రెహ్మాన్‌పై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ నెల 7న గూడవల్లి విద్యాసాగర్, మహ్మద్ షకీల్ రెహ్మాన్‌లను అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడు సుధాకర్‌రెడ్డి, లావణ్య, వీరమల్ల రాజేష్‌లను శనివారం అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. సుధాకర్‌రెడ్డి బ్యాంకు ఖాతాలను సీజ్ చేశారు. అధిక వడ్డీలతో ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్ హెచ్చరించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్

వరద బాధితులను ఆదుకోవాలి

- రైతు సంఘం రాష్ట్ర సీనియర్ నాయకులు కేశవరావు

ప్రజాశక్తి-ఉంగుటూరు (కృష్ణా)



సదస్సులో మాట్లాడుతున్న వై .కేశవరావు, పక్కన నేతలు

వరద బాధిత రైతులపై ప్రభుత్వం, అధికారులు వివక్ష విడనాడి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని రైతు సంఘం రాష్ట్ర సీనియర్ నాయకులు వై కేశవరావు డిమాండ్ చేశారు. వరదల కారణంగా పంట నష్టపోయిన రైతులకు, బుడమేరు ప్రాంతంలో వ్యవసాయ పంపుసెట్లు, ఇంజన్లు, మోటర్లు పాడైపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని కోరుతూ రైతు, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలంలోని మానికొండ సూర్యావతి శ్రామిక భవనంలో సదస్సు జరిగింది. ముఖ్య అతిథి వై. కేశవరావు మాట్లాడుతూ.. విజయవాడ వరద ప్రభావిత ప్రాంతంలో మోటార్ వాహనాలు పాడైపోయిన వారికి పరిహారం అందించడం అభినందనీయమని, దేశానికి అన్నం పెడుతున్న రైతులకు ఆధారంగా నిలిచిన మోటార్లు, ఆయిల్ ఇంజన్‌లకు ఎందుకు పరిహారం అందించలేదని ప్రశ్నించారు. వెంటనే రైతులకు కొత్త మోటార్లు, ఆయిల్ ఇంజన్‌లను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కౌలు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు టివి లక్ష్మణ స్వామి మాట్లాడుతూ.. నష్టపోయిన రైతాంగానికి పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గత నెల 28న చేసిన ధర్నా ఫలితంగా ముక్కపాడు, లంకపల్లి ఓంద్రంపాడు తదితర గ్రామాలోని 600 మంది రైతులకు రూ.60 లక్షల పరిహారం అందిందన్నారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై నరసింహారావు మాట్లాడుతూ.. కృష్ణా నది పరివాహక ప్రాంతంలో కంద, పెండలం, చిలగడ దుంప తదితర పంటలకు ఎకరాకు రూ. నాలుగు లక్షల వరకు ఖర్చవుతుందని.. నష్టపరిహారం కింద కేవలం రూ. 14 వేలు ప్రకటించటం దుర్మార్గమన్నారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి డిప్యూటీ తహశీల్దార్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి అజ్మీరా వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో కౌలు రైతు సంఘం కృష్ణా జిల్లా ప్రధాన కార్యదర్శి పంచకర్ల రంగారావు, సిఐటియు మండల కార్యదర్శి కడవకొల్లు రామరాజు, వెన్నూతల గ్రామ సర్పంచ్ తెల్లాకుల వెంకట రామ్మోహన్‌రావు, రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లోనూ ఫిర్యాదులు

- జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ విజయభారతి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రజల ప్రాథమిక హక్కులకు భంగం కలిగినప్పుడు సంబంధిత శాఖకు ఫిర్యాదు చేసినా స్పందించకపోతే జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేయవచ్చునని జాతీయ మానవ హక్కుల కమిషన్ యాక్టింగ్ చైర్‌పర్సన్ విజయ భారతి సయాని తెలిపారు. పోస్టల్ లేదా ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. శనివారం స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో నిర్వహించిన మానవ హక్కులపై అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. వ్యక్తి హక్కులకు భంగం కలిగినట్లు ప్రసార మాధ్యమాల ద్వారా తెలిస్తే మానవ హక్కుల కమిషన్ సుమోటోగా కేసు స్వీకరిస్తుందని తెలిపారు. 1992-93 సంవత్సరంలో 493 ఫిర్యాదులు అందాయని, 2023-24 సెప్టెంబర్ వరకు 68,223 అర్జీలు వచ్చాయని, 68 వేల కేసులు పరిష్కరించామని తెలిపారు. ముఖ్యంగా బాలల హక్కులు పరిరక్షించేలా చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. బాలలకు, మహిళలకు, వృద్ధులకు, మత్స్యకారులకు , మైనారిటీలకు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ట్రాన్స్ జెండర్స్‌కు ఇలా సుమారు 60 తరగతుల వారికి ప్రత్యేక చట్టాలు ఉన్నాయని పేర్కొన్నారు. తాడేపల్లిలో ఎస్‌సి హాస్టల్ ను పరిశీలించామని, ఇప్పటి వరకు 14 హాస్టళ్లలో తనిఖీలు నిర్వహించి విద్యార్థులతో మాట్లాడామని తెలిపారు.

టొయోటా గ్లాంజా ఫెస్టివల్ ఎడిషన్ ఆవిష్కరణ

బెంగళూరు : ప్రముఖ ప్రీమియం కార్ల తయారీ కంపెనీ టొయోటా కిర్లోస్కర్ మోటార్ (టికెఎం) కొత్తగా టొయోటా గ్లాంజా 'ఫెస్టివల్ లిమిటెడ్ ఎడిషన్'ను ఆవిష్క రించినట్లు శనివారం తెలిపింది. దీనిపై కొనుగోలుదారులు ప్రత్యేకమైన డీలర్-ఫిట్టెడ్ టొయోటా జెన్యూన్ యాక్సెసరీ (టిజిఎ) ప్యాకేజీలను అక్టోబర్ 31 వరకు పొందవచ్చని పేర్కొంది. నూతన ఎడిషన్‌ను మెరుగైన శైలి, పనితీరు, సౌలభ్యంతో వారి డ్రైవింగ్ అనుభవాన్ని మెరుగుపర్చేలా రూపొందించబడిందని పేర్కొంది.



మెట్రో క్యాష్ అండ్ క్యారీలో పండుగ ఆఫర్లు

హైదరాబాద్ : భారత్‌లో మెట్రో క్యాష్ అండ్ క్యారీ కార్యకలాపాలు ప్రారంభించి 21 ఏళ్ల పూర్తి చేసుకున్న నేపథ్యంలో చిన్న, స్వతంత్ర వ్యాపారాల కోసం ప్రత్యేక ఆఫర్లను అందిస్తున్నట్లు తెలిపింది. పండుగ ఆఫర్ కింద 'మెట్రో - ఫెస్టివ్ గిఫ్ట్'ను నవంబర్ 3వరకు కొనసాగించనున్నట్లు వెల్లడించింది.

ఐసిఐసిఐ లాంబార్డ్ లాభాలు 20 శాతం వృద్ధి


ఐసిఐసిఐ లాంబార్గ్ జనరల్ ఇన్సూరెన్స్ 2024-25 సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో 20 శాతం పెరుగుదలతో రూ.694 కోట్ల నికర లాభాలు సాధించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.577 కోట్ల లాభాలు ప్రకటించింది. ఇదే సమయంలో రూ.5,049 కోట్లుగా ఉన్న మొత్తం ఆదాయం.. గడిచిన క్యూ2లో రూ.5,850 కోట్లకు చేరింది.

ఆర్‌బిఎల్ బ్యాంక్ లాభాల్లో 24 శాతం తగ్గుదల

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికంలో ఆర్‌బిఎల్ బ్యాంక్ నికర లాభాలు 24 శాతం పతనమై రూ.223 కోట్లుగా నమోదయ్యాయి. అధిక వ్యయాలు లాభాల తగ్గుదలకు ప్రధాన కారణమయ్యాయి. బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) 9 శాతం పెరిగి రూ.1,615 కోట్లుగా ఉంది. రుణాల జారీ 15.14 శాతం పెరిగి రూ.87,882 ్కఓట్లుగా నమోదయ్యాయి. జూన్ 30 నాటికి 2.69 శాతంగా ఉన్న స్థూల ఎన్‌పిఎలు.. సెప్టెంబర్ ముగింపు నాటికి 2.88 శాతానికి పెరిగాయి.

సామ్‌సంగ్ నుంచి గెలాక్సీ ఎ16 5జి విడుదల

గూర్‌గావ్ : ప్రముఖ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీ సామ్‌సంగ్ కొత్తగా గెలాక్సీ ఎ16 5జిని విడుదల చేసింది. రెండు వేరియంట్లలో లభించే దీని ప్రారంభ ధరను రూ.18,999గా నిర్ణ యించింది. 50 ఎంపి, 5ఎంపి అల్ట్రావైడ్, 2ఎంపి మాక్రో లెన్స్ కెమెరాలను అమర్చింది. సెల్ఫీలూ వీడియో కాల్స్ కోసం 13-మెగా పిక్సెల్ సెల్ఫీ కెమెరా ఉంటాయి. మీడియాటెక్ డైమెన్సిటీ 6300 ఎస్ఓసీ ప్రాసెసర్, 8 జిబి ర్యామ్ విత్ 256 జిబి స్టోరేజీ కెపాసిటీ కలిగి ఉంది.



వ్యవసాయరంగ సమస్యలపై 21, 22 తేదీల్లో జాతీయ సదస్సు

- ముఖ్యఅతిథిగా కేరళ మంత్రి ఎంబి రాజేష్ : ఎపి రైతు సంఘం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వ్యవసాయ రంగం సమస్యలపై ఈ నెల 21, 22 తేదీల్లో విజయవాడలో జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి తెలిపారు. విజయవాడ ఎంబివికెలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, సీనియర్ నాయకులు వై.కేశవరావుతో కలిసి ఆయన మాట్లాడారు. విజయవాడ ఎంబివికెలో రెండు రోజులపాటు జరిగే జాతీయ సదస్సుకు కేరళ శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి ఎం.బి.రాజేష్, రాష్ట్ర వ్యవసాయశాఖ మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, ఎఐకెఎస్ అఖిల భారత నాయకులు కె.కృష్ణప్రసాద్, విద్యుత్‌రంగ నిపుణులు అశోక్‌రావు, రాష్ట్ర జలవనరుల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ ఎం.వెంకటేశ్వరరావు, ఎఐకెఎస్ సహాయ కార్యదర్శి టి.సాగర్, వివిధ రంగాల నిపుణులు పాల్గొంటారని తెలిపారు. రాష్ట్రంలో ఎన్నికల ముందు చంద్రబాబునాయుడు రైతులకు పెట్టుబడిసాయం కింద రూ.20 వేలు ఇస్తామని హామీనిచ్చారని, అధికారంలోకి వచ్చి ఆరునెలలు గడుస్తున్నా ఇంతవరకు ఇవ్వలేదని తెలిపారు. 2025 మార్చిలో కేంద్ర ప్రభుత్వ వాటాతో కలిపి ఇస్తామని చెబుతున్నారని, ఇంతకంటే మోసం మరొకటి ఉండదని తెలిపారు. 2023 ఖరీఫ్ సీజన్లో లక్షలాది మంది రైతులు కరువుతో పంటలు పండక, తుపాన్‌తో పండిన పంటలు నీటిపాలై పెద్దఎత్తున నష్టపోతున్నారని తెలిపారు. ఇప్పటి వరకూ పంటల బీమా పరిహారం రైతులకు అందలేదని వివరించారు. ఆగస్టు చివర్లో బుడమేరు, కృష్ణానదికి వచ్చిన వరదలకు కృష్ణా, గుంటూరు, ఎన్‌టిఆర్, బాపట్ల, ఏలూరు జిల్లాల్లో ఆరు లక్షల ఎకరాలకుపైగా పంట దెబ్బతిందని తెలిపారు. తొలుత ప్రభుత్వం ఇదే ప్రకటించిందని, పరిహారం ఇచ్చే సమయానికి అంచనాను తగ్గించిందని తెలిపారు. రూ.10 వేల పరిహారంతో సరిపెట్టారని, వ్యాపార పంటకు రూ.14 వేలు మాత్రమే ఇచ్చారని తెలిపారు. రైతులు, కౌలు రైతులు పంటలు కోల్పోయారని, వరికి ఎకరాకు రూ.25 వేలు, పసుపు, కంద, అరటి వంటి వ్యాపార పంటలకు రూ.50 వేలు ఇవ్వాలని కోరారు. కృష్ణానది కరకట్టలోపల ఉన్న పొలాల రైతులు తీవ్రంగా నష్టపోయారని, వారిని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కౌలు రైతుల రక్షణ చట్టం తీసుకొస్తున్నామని ప్రభుత్వం ప్రచారం చేస్తున్నా ఆచరణలో తాత్సారం చేస్తున్నారని, 30 లక్షల ఎకరాలకుపైగా ఉన్న కౌలుదారులకు గుర్తింపు కార్డులు ఇవ్వడంలోనూ, బ్యాంకుల నుండి రుణాలు ఇప్పించడం లోనూ ప్రభుత్వం చెప్పేమాటలకు, ఆచరణకు పొంతన లేదని వివరించారు. భూ యజమానులతో సంబంధం లేకుండా కౌలు రైతులకు బ్యాంకు రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా వంటి అన్ని రైతు సంక్షేమ పథకాలు అమల య్యేలా కౌలు రైతులకు రక్షణ కల్పిస్తూ చట్టాన్ని ఆమోదించాలని డిమాండ్ చేశారు. మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకం ద్వారా రైతులను ఆదుకోవాలని కోరారు. స్మార్ట్‌మీటర్లు, ట్రూ అప్ ఛార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ ఛార్జీలు పెంచితే ఉద్యమం

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ
- నాలుగు నెలల్లో అవినీతి పెరిగింది

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలకు భిన్నంగా కార్యాచరణ ఉందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. శనివారం విజయవాడ సిపిఐ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబునాయుడు ప్రతిపక్షంలో ఉండగా తాము అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తామని, ట్రూఅప్ భారాలు వేయబోమని, స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా మాట్లాడారని తెలిపారు. అధికారం చేపట్టిన తరువాత రూ.8114 కోట్ల విద్యుత్ భారాలు మోపేందుకు సిద్ధమయ్యారని పేర్కొన్నారు. ఇప్పటికే ఒక్కో యూనిట్ విద్యుత్‌కు రూ.1.03 పైసలు ట్రూఅప్ ఛార్జీ ఉందని, మరలా రూ.1.27 పైసలు భారం వేస్తున్నారని తెలిపారు. దీంతో గృహ వినియోగదారులపై తీవ్ర విద్యుత్ ఛార్జీల భారం పడుతుందని పేర్కొన్నారు. అన్నదాత సుఖీభవ కింద రైతులకు రూ.20 వేలు ఇస్తామన్నారని, ఇంతవరకు ఇవ్వలేదని పేర్కొన్నారు. ఇళ్లస్థలాలకు సంబంధించి పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇస్తామని, ఇళ్ల నిర్మాణానికి అయ్యే ఖర్చు పెంచుతామని వాగ్దానం చేశారని, దీన్ని కేవలం హామీగా కాకుండా ఖచ్చితంగా అమలు చేయాలని కోరారు. దీనికోసం రాష్ట్ర వ్యాప్తంగా 18వ తేదీన రాష్ట్రంలో అన్ని సచివాలయాల వద్ద సామూహికంగా అర్జీలు ఇవ్వనున్నట్లు తెలిపారు. విశాఖ స్టీలుపై చంద్రబాబు మోడీని నిలదీయలేకపోతున్నారని చెప్పారు. ఉచిత ఇసుక విధానం విఫలం కావడానికి ఎమ్మెల్యేలే కారణమని తెలిపారు. గతంలో కంటే ఎక్కువ ధరతో ఇసుక కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. సిఐ, ఎస్ఐ పోస్టులకు కమీషన్ వసూలు చేస్తున్నారని, జనసేన ఎమ్మెల్యే ఒకరు సిఐ పోస్టుకు రూ.46 లక్షలు వసూలు చేశారని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన నాలుగు నెలల్లో అవినీతి పెరిగిందని అన్నారు.

హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్‌కు రూ.16,820 కోట్ల లాభాలు

- పెరిగిన డిపాజిట్లు



న్యూఢిల్లీ : ప్రయివేటు రంగ దిగ్గజ విత్త సంస్థ హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ 2024-25 సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో 5.3 శాతం వృద్ధితో రూ.16,820 కోట్ల నికర లాభాలు సాధించింది. నికర వడ్డీ ఆదాయం పెరగడంతో పాటుగా కేటాయింపుల భారం తగ్గడంలో లాభాల్లో పెరుగుదల చోటు చేసుకుంది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.15,976 కోట్ల లాభాలు ప్రకటించింది. క్రితం క్యూ2లో బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ)10 శాతం పెరిగి రూ.30,110 కోట్లకు చేరింది. మొండి బాకీల కోసం రూ.2,700 కోట్లు కేటాయించింది. 2023-24 ఇదే క్యూ2లో రూ.3,310 కోట్ల కేటాయింపులు చేసింది. 2025 సెప్టెంబర్ ముగింపు నాటికి బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 1.36 శాతానికి పెరిగాయి. ఇంతక్రితం ఏడాది ఇదే కాలం నాటికి 1.34 శాతంగా జిఎన్‌పిఎ చోటు చేసుకుంది. నికర నిరర్థక ఆస్తులు 0.41 శాతంగా నమోదయ్యాయి. గడిచిన క్యూ2లో రూ.1.2 లక్షల కోట్ల డిపాజిట్లను సమీకరించినట్లు హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ వెల్లడించింది. దీంతో మొత్తం డిపాజిట్లు 15 శాతం పెరిగి రూ.25 లక్షల కోట్లకు చేరాయని తెలిపింది. రుణాల జారీ 7 శాతం పెరిగి రూ.25.19 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. రిటైల్ రుణాల్లో 11.3 శాతం, వాణిజ్య, రూరల్ బ్యాంకింగ్ రుణాల్లో 17.4 శాతం పెరుగుదల ఉంది.

సంపాదకీయం

ఈ నగరాలకు ఏమైంది..?

'అది ఒక వైభవోజ్వల మహాయుగం- వల్లకాటి అధ్వాన్న శకం, వెల్లివిరిసిన విజ్ఞానం- బ్రహ్మాజెముడులా అజ్ఞానం, భక్తి విశ్వాసాల పరమపరిధవం- పరమ పాషండాల ప్రల్లద కల్లోలం, స్వర్గానికి రాచబాట పుచ్చుకున్న జనం- నడుస్తున్నారు నరకానికి సూటిగా, అరుస్తున్నాయ్ అధికార కంఠాలు, అంతా అమోఘంగా వుందని' అంటూ ఫ్రెంచి విప్లవం సమయంలో రెండు మహానగరాల స్థితిగతులను చార్లెస్ డికెన్స్ 'ఏ టేల్ ఆఫ్ టూ సిటీస్' (రెండు మహానగరాలు) నవలలో కవితాత్మకంగా వర్ణిస్తాడు. 'భారతదేశంలోని మహానగరాల నేటి దుస్థితి నాటి పరిస్థితికి ఏమాత్రం తీసిపోదు' అంటారు ఈ నవలను అనువదించిన తెన్నేటిసూరి. ఎప్పుడు వర్షం పడినా చెన్నై నగరం చెరువైపోతుంది. హైదరాబాద్‌లో వచ్చే కుండపోత వర్షంతో కిలోమీటర్ల కొద్దీ ట్రాఫిక్ నిల్చిపోతుంది. వాయుకాలుష్యంతో ఢిల్లీ అతలాకుతలం అవుతున్నది. ప్రతిసారీ ముంబైలో వచ్చే వరదలకు జనజీవనం స్థంభించిపోతుంది. ఇటీవల వచ్చిన వరదలతో విజయవాడ కూడా ఈ జాబితాలో చేరింది.

ఎక్కడైనా నగరాల విస్తరణ, పురోగమనం... అక్కడి అసంఖ్యాక శ్రామికులు చెల్లించే జీవన మూల్యాల ఫలితమే. ఈ నగరాలే మానవ నాగరికతా వికాసాన్ని కాలగమనంలో ఆయా దశల్లో ప్రతిఫలిస్తాయి. మరికొన్ని కాలానికి సాక్షిగా నిలిచాయి. మహానగరాల జీవితం- ఆ దేశపు చరిత్ర... సంస్కృతితో పెనవేసుకొని వుంటుంది. అలాంటి మహానగరాల్లో దేశరాజధాని ఢిల్లీ సహా కలకత్తా, ముంబాయి, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ వంటివి చాలానే వున్నాయి. ఈ మహానగరాల చరిత్ర, కీర్తి పేరుకు మాత్రమే... ఇక్కడి జీవనం మహానరకం. ఈ నగరాలను విశ్వనగరాలుగా తీర్చిదిద్దాలనుకుంటున్నాయి మన ప్రభుత్వాలు. కానీ, చిన్నపాటి వర్షాలను, ఓ మోస్తరు ఎండలను కూడా తట్టుకోలేక విశ్వగురువుల కలలు గాలిబుడగల్లా పేలిపోతున్నాయి. మ్యాన్‌హోల్స్ నోళ్లు తెరుస్తున్నాయి. కొన్ని నగరాల్లో పడవలు వాడాల్సివస్తోంది. సంపన్నుల విలాసవంతమైన భవనాలు కూడా నీళ్లలో చిక్కుకుంటున్నాయి. అసలు ఈ మహానగరాలకు ఏమైంది? ఎందుకిలాంటి పరిస్థితి ఏర్పడుతోంది? మహానగరాలు అనగానే మనకు గుర్తొచ్చేది ఆకాశాన్నంటే భవనాలు, అపార్ట్‌మెంట్‌లు, కాంక్రీట్ రోడ్లు. 'ఇతిహాసపు చీకటికోణం/ అట్టడుగునపడి కాన్పించని/ కథలన్నీ కావాలిప్పుడు/ దాచేస్తే దాగని సత్యం' అంటారు శ్రీశ్రీ. చెరువులు, చెట్లు, అడవులు, వాగులు, వంకలు ఆక్రమణల పాలవుతున్నాయి. అడవుల్లో వుండాల్సిన జంతువులు... జనవాసాల్లోకి చొరబడుతున్నాయి. కుండపోత వర్షాలు, భరించలేని ఎండలు సర్వసాధారణం అయిపోయాయి. ప్రకృతి విపత్తుకి మానవ తప్పిదాలే ప్రధాన కారణమని పర్యావరణవేత్తలు అంటున్నారు. అయినా, ప్రకృతిని ప్రకృతిలా వుండనీయడంలేదు. నగరీకరణ, సుందరీకరణ పేరుతో ప్రకృతి సహజత్వం విధ్వంసమౌతోంది. ఇప్పటికీ ఈ మహానగరాల్లో దశాబ్దాల నాటి డ్రైనేజీ వ్యవస్థే కొనసాగుతోంది. వేసవిలో చెమట్లుకారే రద్దీ, వానాకాలంలో ఒళ్లంతా బురద పూసే నీటి గుంటలు తప్ప పెరుగుతున్న జనాభాకనుగుణంగా మౌలిక వసతుల్లో మార్పులు చోటుచేసుకోడంలేదు.

'నా నగరాన్ని మహాసముద్రంలో చేపల్లా నిండిపోనీ జనంతో' అంటాడు కులీ కుతుబ్‌షా నాలుగు శతాబ్దాల మహానగరం హైదరాబాద్ నుద్దేశించి. పరిధిని మించి పెరిగిన జనాభాకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించలేక ఇప్పుడు తలబాదుకుంటున్నారు. మిగతా నగరాల పరిస్థితి కూడా దీనికి భిన్నంగా ఏమీ లేదు. అభివృద్ధి చెందిన దేశాల్లో బహిరంగంగా చెత్తవేయడం నేరం. కానీ, మన దేశంలో పట్టించుకునే నాధుడే లేడు. 'మహానగరాన్ని నిర్మించిన/ నిర్మిస్తున్న మనుష్యుల/ మమతలు తినేసిన ఉప్పుగాలి/ అంతశ్చైతన్యాన్ని అంతం చేసి నవ్వుకున్న నగరం/ పెరుగుతూంది.../ నిశ్చయంగా విస్తరిస్తూంది' అంటారు కవి నిఖిలేశ్వర్. ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకోవాలి. ప్రజలకు అవగాహన కల్పించాలి. పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి. ప్రకృతి వనరులను కార్పొరేట్ శక్తులు చెరపట్టకుండా కాపాడుకోవాలి. అప్పుడే మన మహానగరాలు విశ్వనగరాలుగా శిరమెత్తుతాయి.

మంచి మాట



కార్మిక వర్గ పోరాటం వారి విముక్తి కోసమే కాదు. అణచివేత నుండి, దోపిడీ నుంచి మొత్తంగా మానవాళి విముక్తి కోసం అది పోరాడుతుంది.
- హోచిమిన్



మహారాష్ట్రలో కీలక సమర సంకేతాలు!

ప్రస్తుతం



తెలకపల్లి రవి

నవంబరు 20వ తేదీన మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలు జరుగుతాయని ఎన్నికల కమిషన్ ప్రకటించడానికి ముందే భారత దేశ ఆర్థిక రాజధాని రాజకీయ మంత్రాంగంతో అట్టుడికిపోతున్నది. బి.జె.పి, ఎన్.డి.ఎ కూటమిని దారుణంగా దెబ్బ తీసిన లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ఒకవైపు, తాజాగా జరిగిన హర్యానా ఎన్నికలలో ఊహలకు భిన్నంగా బి.జె.పి పెద్ద విజయం సాధించడం మరోవైపు ఇందుకు కారణమైనాయి. ఇది రాస్తున్న సమయానికి కూడా మహారాష్ట్రలో 'ఇండియా' వేదిక ప్రతిరూపమైన మహా వికాస్ అగాఢీ (ఎం.వి.ఎ) సీట్ల సర్దుబాట్లు ఒక కొలిక్కి వచ్చినట్టు కనిపించదు. మూడు ప్రధాన భాగస్వామ్య పార్టీలైన శివసేన (ఉద్ధవ్ వర్గం), ఎన్.సి.పి, కాంగ్రెస్‌లు స్పష్టంగా సర్దుబాటు చేసుకోలేకపోవడం ఒకటైతే మిగిలిన భాగస్వామ్య పార్టీలు వామపక్షాలు ఇతర ప్రాంతీయ పార్టీలను విశ్వాసంలోకి తీసుకోకపోవడం మరో సవాలుగా తయారైంది. నిజానికి కాంగ్రెస్, శివసేనలే పరస్పర విరుద్ధమైన రకరకాల ప్రకటనలతో రచ్చకెక్కడం చూస్తున్నాం. బి.జె.పి, శివసేన (ఏక్‌నాథ్ షిండే వర్గం), ఎన్.సి.పి (అజిత్ పవార్) కూటమి కూడా మల్లగుల్లాలు పడుతున్నది. ఏమైనా రెండు కూటముల నేతలకూ కలసి వెళ్లడం తప్పదని తెలుసు గనక పరిశీలకులు కలిపే చూస్తున్న పరిస్థితి. హర్యానాలో కాంగ్రెస్ అతి అంచనాలతో దెబ్బతిన్న తర్వాత శివసేన కొంచెం బెట్టు పెంచగా అటు మహాయుతిలో బి.జె.పి షరతులు బిగించడం సహజంగానే జరిగింది. ముఖ్యమంత్రి ఎవరో ఎన్నికల తర్వాతనే చెబుతామని ఇరు కూటములు కూడా దాటేస్తున్నా ఎంతో కొంత ఉద్ధవ్ ధాకరే, షిండేలే వుంటారన్న సంకేతాలు కూడా వెలువరించడానికి సిద్ధపడుతున్నాయి. ఒంటరిగా పోటీ చేయడం నష్టదాయకమన్న భయమే ఇందుకు దారి తీస్తున్నది కానీ అదే సమయంలో అధికార ప్రతినిధులు, రాష్ట్ర నాయకులు మాత్రం తీవ్ర భాషలోనే వివాదపడుతున్నారు.

లోక్‌సభ ఫలితాల సంచలనం

లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తర ప్రదేశ్ తర్వాత మహారాష్ట్ర ఫలితాలే 'ఇండియా'కు ఊపునిచ్చాయి. యు.పి లో 2019 ఎన్నికల కన్నా 2024లో 'ఇండియా' వేదికకు 37 స్థానాలు అధికంగా మొత్తం 43 వచ్చాయి. మహారాష్ట్రలోని 48 సీట్లలోనూ 'ఇండియా' భాగస్వాములకు 2019లో కంటే 25 స్థానాలకు పెరిగి మొత్తం 30 స్థానాలు దక్కాయి. వీటి వల్లనే లోక్‌సభ ముఖచిత్రం మారింది. ఈ 25 మాత్రమే గాక కాంగ్రెస్ తిరుగుబాటు అభ్యర్థి ఒకరు నెగ్గారు. బి.జె.పి, ఎన్.డి.ఎ లకు చెందిన ముగ్గురు మంత్రులు, 25 మంది ఎంపీలు ఓడిపోయారు. సీట్లలో ఇంత తేడా వున్నా ఓట్ల శాతం మాత్రం పోటాపోటీగానే వుండటం విస్మరించరానిది. 'ఇండియా' ఎం.వి.ఎ పార్టీలకు 44 శాతం ఓట్లు వస్తే ఎన్.డి.ఎ, మహాయుతికి 43.6 శాతం వచ్చాయి. అంటే తేడా కేవలం 0.4 శాతం మాత్రమే! ఎన్నికలకు ముందు ఎం.వి.ఎ చాలా సమస్యలను ఎదుర్కొన్నది. బి.జె.పి ఒత్తిడి కారణంగా కావచ్చు ఎన్నికల సంఘం శివసేన, ఎన్.సి.పి పార్టీల అధికారిక గుర్తులను పోటీ వర్గాలకే కేటాయించింది. ఉద్ధవ్, పవార్ పార్టీలు కొత్త గుర్తులతో పాల్గొన్నాయి. దేశ ఆర్థిక రాజధానిగా వుండటంతో కార్పొరేట్ మద్దతు మాత్రమే గాక మీడియా ప్రచారం కూడా ఎన్.డి.ఎ కే విస్తారంగా లభించింది. అయినా సరే షిండే ప్రభుత్వ అవినీతి, నిరంకుశ పోకడలపై తీవ్ర వ్యతిరేకత, సమస్యల కారణంగానే ప్రజలు ప్రతిపక్ష కూటమిని బలపర్చారు. వాస్తవానికి వందమంది సేన, ఎన్.సి.పి సభ్యులు షిండేను బలపర్చడం వెనక కేంద్రంలోని మోడీ ప్రభుత్వ ఒత్తిళ్లు, బెదిరింపులు, వేధింపులు, కుట్రలు కీలక పాత్ర వహించాయి. మాతృ సంస్థలకు వెన్నుపోటు పొడిచి వీరంతా అటు చేరారనే ఆగ్రహంతో ప్రజలు ఎం.వి.ఎ కు సానుభూతి చూపించారు. ప్రజల నిరసనకు రాజకీయ చక్రధారి శరద్ పవార్, మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ధాకరే. కాంగ్రెస్ అధ్యక్షుడు నానా పటోల్ నాయకులుగా ఆదరణ పొందారు. ప్రధాని మోడీ, హోం మంత్రి అమిత్ షా, ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్, యు.పి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వంటి బి.జె.పి నేతలు మతపరమైన విభజన కోసం అనేక పథకాలు వేసినా రకరకాల రిజర్వేషన్ల సమస్యలను తీసుకొచ్చినా జీవనోపాధి సమస్యలు, ఆర్థికాంశాలపై కేంద్రీకరించిన ఎం.వి.ఎ వైపే ఓటర్లు మొగ్గు చూపారు. మతతత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా ముస్లిం మైనార్టీలు, ఇతరులు కూడా ఎం.వి.ఎ ను బలపర్చారు. 'వంచిత్ బహుజన్ అగాఢీ' (వి.బి.ఎ), మజ్లిస్ వంటి పార్టీల విచ్ఛిన్నకర పాత్రను కూడా తోసిపుచ్చారు. మహారాష్ట్రకు సంబంధించిన పరిశ్రమలు, ప్రాజెక్టులు గుజరాత్‌కు తరలించే ధోరణి కూడా విముఖతకు కారణమైంది. బడా మీడియా బి.జె.పి తరపునే పనిచేసినా ప్రజాసంఘాలు, మీడియా వేదికలు వినూత్న నినాదాలతో పట్టుదలగా పోరాడటం మరింత దోహదం చేసింది. రాజ్యాంగాన్ని కాపాడుకోవాలనే స్ఫూర్తి ప్రతిబింబించింది.



> ఎం.వి.ఎ పార్టీలు మరింత అప్రమత్తంగా, ఐకమత్యంగా వ్యవహరించితేనే లోక్‌సభ ఫలితాల ప్రభావాన్ని కొనసాగించడం శాసనసభలో విజయం సాధించడం అవసరమనే భావన అందరిలోనూ వ్యక్తమైంది. హర్యానా ఫలితాల తర్వాత కాంగ్రెస్ అక్కడ అనుసరించిన వైఖరిపై భాగస్వామ్య పార్టీల నుంచి వచ్చిన విమర్శల ప్రభావం మహారాష్ట్ర పైనే ఎక్కువగా పడింది. నిజానికి ఈ రెండు రాష్ట్రాల ఎన్నికలు ఒకసారి జరపడానికి బి.జె.పి జంకింది గనకే నవంబర్‌కు వాయిదా పడ్డాయి. అయితే అనుకోని విధంగా అక్కడ బి.జె.పి మూడోసారి విజయం సాధించడంతో మహారాష్ట్ర రాజకీయంపైనా ప్రభావం పడింది. ఎం.వి.ఎ లోని మూడు పార్టీల సంప్రదింపులలో పలు విభేదాలు తొంగిచూశాయి. ఒకవైపున అత్యధిక స్థానాలలో అవగాహన కుదిరిందని అంటున్నా విదర్భ, ముంబాయి సీట్లలో తీవ్రంగానే తేడాలు కొనసాగాయి. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు నానా పటోల్‌తో చర్చలు జరిపే ప్రసక్తి లేదని సంజయ్ రౌత్‌తో సహా హెచ్చరికలు చేశారు. ఆయన మాట్లాడే తీరుపై విమర్శలే గాక నిర్ణయాధికారం లేనివారితో చర్చలు ఎందుకని ఉద్ధవ్ కూడా ప్రశ్నించారు. సీట్ల చర్చలలో విభేదాలు సహజమే గానీ ఈ కారణంగానే తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నట్టు వ్యాఖ్యానించారు.

హర్యానా అనంతరం...

ఈ నేపథ్యంలో ఎం.వి.ఎ పార్టీలు మరింత అప్రమత్తంగా, ఐకమత్యంగా వ్యవహరించితేనే లోక్‌సభ ఫలితాల ప్రభావాన్ని కొనసాగించడం శాసనసభలో విజయం సాధించడం అవసరమనే భావన అందరిలోనూ వ్యక్తమైంది. హర్యానా ఫలితాల తర్వాత కాంగ్రెస్ అక్కడ అనుసరించిన వైఖరిపై భాగస్వామ్య పార్టీల నుంచి వచ్చిన విమర్శల ప్రభావం మహారాష్ట్ర పైనే ఎక్కువగా పడింది. నిజానికి ఈ రెండు రాష్ట్రాల ఎన్నికలు ఒకసారి జరపడానికి బి.జె.పి జంకింది గనకే నవంబర్‌కు వాయిదా పడ్డాయి. అయితే అనుకోని విధంగా అక్కడ బి.జె.పి మూడోసారి విజయం సాధించడంతో మహారాష్ట్ర రాజకీయంపైనా ప్రభావం పడింది. ఎం.వి.ఎ లోని మూడు పార్టీల సంప్రదింపులలో పలు విభేదాలు తొంగిచూశాయి. ఒకవైపున అత్యధిక స్థానాలలో అవగాహన కుదిరిందని అంటున్నా విదర్భ, ముంబాయి సీట్లలో తీవ్రంగానే తేడాలు కొనసాగాయి. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు నానా పటోల్‌తో చర్చలు జరిపే ప్రసక్తి లేదని సంజయ్ రౌత్‌తో సహా హెచ్చరికలు చేశారు. ఆయన మాట్లాడే తీరుపై విమర్శలే గాక నిర్ణయాధికారం లేనివారితో చర్చలు ఎందుకని ఉద్ధవ్ కూడా ప్రశ్నించారు. సీట్ల చర్చలలో విభేదాలు సహజమే గానీ ఈ కారణంగానే తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నట్టు వ్యాఖ్యానించారు. ఒకటి రెండు రోజులు పడితే గానీ ఎంవిఎ లోని మూడు పార్టీల మధ్య సంప్రదింపులు ముగిసేట్టు కనిపించడం లేదు. మొత్తంపైన 260 సీట్ల వరకూ అవగాహనకు రాగలిగామని మరో పాతిక ముప్పై సీట్లలో ఎవరు పోటీ చేయాలనే దానిపై తుది నిర్ణయం జరగాలని వారంటున్నారు. అన్నిటినీ ఢిల్లీకి తెప్పించి ఆలస్యంగా నిర్ణయాలు చేసే రివాజును కాంగ్రెస్ మార్చుకోవాలని శివసేన నేతలు అంటుంటే కాంగ్రెస్ పరిశీలకుడుగా వచ్చిన రమేష్ చెన్నితల అంతా అయిపోతుందని భరోసా ఇస్తున్నారు. 115 స్థానాల్లో కాంగ్రెస్, 80-90 మధ్య సేన, 70 సీట్లకు పైన ఎన్.సి.పి పోటీ చేస్తాయని సూచనలున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ప్రభావం కలిగివున్న సమాజ్‌వాది పార్టీకి రెండు మూడు సీట్లు, వామపక్షాలకు మూడు, పెజంట్స్ అండ్ వర్కర్స్ పార్టీకి రెండు సీట్లతో సర్దుబాటు జరగొచ్చని అంచనాలు చలామణిలో వున్నాయి. సి.పి.ఎం గతంలో ఒక స్థానం స్వంతంగా గెల్చుకోగా మరో చోట చాలా దగ్గరగా వచ్చింది. మరి కొన్ని చోట్ల కూడా ప్రభావం కలిగివుంది. ఎం.వి.ఎ సీట్ల చర్చలు త్వరగా ముగించకుండా ఆలస్యం చేయడం నష్టమని కూడా ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి డా.ఉదయ్ నర్కర్ గతంలో వ్యాఖ్యానించారు. మొత్తంపైన లౌకిక పార్టీల సంప్రదింపుల ప్రక్రియ ఎలా ముగిసేది చూడవలసిందే.

బి.జె.పి వ్యూహాలేంటి?

మహాయుతి వరకూ చూస్తే బి.జె.పి 150 స్థానాలు, మిగిలినవి తక్కిన పార్టీలు పోటీ చేసేలా చర్చలు నడుస్తున్నట్టు చెబుతున్నారు. షిండేను ముఖ్యమంత్రిగా కొనసాగిస్తామని సూచనలు ఇస్తూనే సీట్ల పరంగా తాము పెద్ద పార్టీగా వుండాలన్నది బి.జె.పి వ్యూహంగా కనిపిస్తున్నది. పోటీకి విముఖత వ్యక్తం చేసిన దేవేంద్ర ఫడ్నవిస్‌ను ఒప్పించి పోటీలో నిలబెట్టడం కూడా గమనించదగ్గది. బీహార్ వంటి చోట్ల అనుసరించిన ఎత్తుగడలే బి.జె.పి ఇక్కడా అమలు చేయొచ్చని పరిశీలకులు భావిస్తున్నారు. దేశంలో మరెక్కడా లేని విధంగా ఈ రాష్ట్రంలో బి.జె.పి ప్రతి ప్రాంతీయ పార్టీని రెండు ముక్కలు చేసింది. అందులోనూ మళ్లీ తన ఏజంట్లను నియోగించి ఎప్పటికప్పుడు ఒత్తిళ్లు తెస్తున్నది. కాని సాపేక్షంగా చూస్తే బారామతిలో అజిత్ పవార్ భార్యను ఓడించి సుప్రియా సూలే ఎన్నికవడంతో శరద్ పవార్ తిరుగు లేని నాయకుడుగా మరోసారి రుజువు చేసుకున్నారు. దానికి తోడు ప్రధాని మోడీ ఎన్నికల ప్రచారంలో పవార్‌ను బతక్తి ఆత్మ (ప్రేత సంచారి)గా అవహేళన చేయడం ప్రజలు ఆమోదించలేదు. ఉద్ధవ్ ధాకరే నకిలీ అని కూడా గేళి చేశారు. ఇవన్నీ మహారాష్ట్ర ఆత్మగౌరవాన్ని అవమానించడమేనని ఎం.వి.ఎ నాయకులు ఉధృతంగా చేసిన ప్రచారం లోక్‌సభ ఎన్నికలలో బాగా పనిచేసింది. ఇప్పటికీ ఆ ప్రభావం కొనసాగుతుండగా ఎన్.సి.పి నాయకుడు బాబా సిద్దికి హత్యలో లారన్స్ విష్ణోయ్ ముఠా పేరు బయటికి రావడం శాంతి భద్రతలపై ఆందోళన పెంచింది. గుజరాత్‌లో జైలులో వున్న విష్ణోయ్ బి.జె.పి వ్యతిరేకులైన నాయకులనే వెంటాడి హత్య చేయడం ఎలా సాధ్యమవుతుందనే ప్రశ్నలు తలెత్తాయి. ఈ సమయంలోనే కెనడాలోనూ నిజ్జర్ హత్యలో ఆ ముఠా ప్రమేయం వుందని ఆ దేశ ప్రధాని ఆరోపించడంతో కేంద్రం సమాధానం చెప్పుకోవలసిన స్థితిలో పడిపోయింది. కెనడా ప్రధాని ట్రూడోది తప్పే అయినా గుజరాత్ జైలులో వుండి విష్ణోయ్ ఇన్ని హత్యలు ఎలా చేయించగలుగుతున్నారు? అతని వెనక ఎవరి ప్రోద్బలం వుంది అనే ప్రశ్నలు ముందుకొచ్చాయి. కార్పొరేట్ల నిధులతోనే బి.జె.పి రాజకీయం నడుపుతున్నదని, మహారాష్ట్రలో వారు మరోసారి గెలిస్తే పరిస్థితి పూర్తిగా దిగజారుతుందని ప్రతిపక్షాలు హెచ్చరిస్తున్నాయి. మరి పది రోజుల లోపే నామినేషన్ల ప్రక్రియ మొదలవుతుండగా కీలకమైన మహారాష్ట్ర ఎన్నికల తీర్పు ఎలా వుంటుందనేది ఉత్కంఠ కలిగిస్తున్నది.

> దేశంలో మరెక్కడా లేని విధంగా ఈ రాష్ట్రంలో బి.జె.పి ప్రతి ప్రాంతీయ పార్టీని రెండు ముక్కలు చేసింది. అందులోనూ మళ్లీ తన ఏజంట్లను నియోగించి ఎప్పటికప్పుడు ఒత్తిళ్లు తెస్తున్నది. కాని సాపేక్షంగా చూస్తే బారామతిలో అజిత్ పవార్ భార్యను ఓడించి సుప్రియా సూలే ఎన్నికవడంతో శరద్ పవార్ తిరుగు లేని నాయకుడుగా మరోసారి రుజువు చేసుకున్నారు. దానికి తోడు ప్రధాని మోడీ ఎన్నికల ప్రచారంలో పవార్‌ను బతక్తి ఆత్మ (ప్రేత సంచారి)గా అవహేళన చేయడం ప్రజలు ఆమోదించలేదు. ఉద్ధవ్ ధాకరే నకిలీ అని కూడా గేళి చేశారు. ఇవన్నీ మహారాష్ట్ర ఆత్మగౌరవాన్ని అవమానించడమేనని ఎం.వి.ఎ నాయకులు ఉధృతంగా చేసిన ప్రచారం లోక్‌సభ ఎన్నికలలో బాగా పనిచేసింది. ఇప్పటికీ ఆ ప్రభావం కొనసాగుతుండగా ఎన్.సి.పి నాయకుడు బాబా సిద్దికి హత్యలో లారన్స్ విష్ణోయ్ ముఠా పేరు బయటికి రావడం శాంతి భద్రతలపై ఆందోళన పెంచింది.

బుద్ధుందా! లేదా!

సెటైర్

సుబ్రమణ్యం

గుమ్మంలో ఎవరితోనో భార్య మాట్లాడుతున్న మాటలు వినపడి నిద్ర నుండి లేచాడు పుల్లారావు.

అప్పుడే లోపలికి వస్తున్న సతీమణిని అడిగాడు "ఆ వచ్చిందెవరు ?"

"వాళ్ళు సిపిఎం పార్టీ వాళ్ళండీ. ఏదో కరపత్రం ఇచ్చి వెళ్ళేరు..." అంటూ ఆ కరపత్రాన్ని భర్త చేతికిచ్చింది సుశీల. కరపత్రం చూసి "ప్రజా హోరు" అని పైకి చదివి పక్కన పడేశాడు పుల్లారావు.

"చదవకుండానే పడేశారేమిటీ?" అని సుశీల అడిగింది.

"ఆ! ఈ కమ్యూనిస్టుల కరపత్రాలలో ఏముంటుంది? ఎంతసేపూ ప్రజలు సమస్యలతో బాధ పడిపోతున్నారని, ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని, పోరాటాలే దారి అని రాయడం తప్ప వేరే ఏముంటుంది దాన్లో? వీళ్ళు ఎప్పుడూ గెలవరు, గెలిచినవారిని ఆడిపోసుకోవడం, ధర్నాలు, గొడవలు చేయడం, అరెస్టులు చేసేస్తున్నారంటూ మళ్ళీ గోల చేయడం. అంతేగా. పైగా ఈ కరపత్రాలొకటి. చదవడం టైము వేస్టు" అని బాత్‌రూం లోకి పోయాడు పుల్లారావు.

వాష్‌రూం నుంచి వచ్చి ఫ్రెష్‌గా భార్య అందించిన కాఫీ కప్పు అందుకున్నాడు పుల్లారావు. ఇంతలో గుమ్మంలోకి వచ్చాడు వీధిచివరనున్న టైలర్ చిన్నారావు. ఏమిటిలా వచ్చేవు అన్నట్టు చూసేడు పుల్లారావు.

"మరేం లేదు బాబూ! గతేడాది దసరాకి తమరికి రెండు డ్రెస్‌లు కుట్టాను కదా. గుర్తుందా బాబూ?" అని ఆగాడు చిన్నారావు. "ఈ సారి రెడీమేడ్ డ్రెస్‌లు తీసుకున్నాను లేవయ్యా" అన్నాడు పుల్లారావు.

" అహ! అది కావు బాబూ ! అప్పటి డ్రెస్ లకి మీరిచ్చిన కుట్టుకూలి చాల్లేదు బాబూ ! ఓ మూడొందలు తక్కువైంది. ఇప్పించండి." అన్నాడు చిన్నారావు.

"అదేంటయ్యా? నీ బిల్లు మొత్తం ఇచ్చేశాను కదా?" అన్నాడు పుల్లారావు.

"అది కాదు బాబూ! బిల్లు మొత్తం కట్టేశారు మీరు. కాని అది చాల్లేదు బాబూ. నిన్ననే లెక్కలు సరి చూసుకున్నాను. అందుచేత ఆ తేడా మీరు ఇప్పించాలి" అన్నాడు చిన్నారావు.

"ఇదేం విడ్డూరమయ్యా? ఏడాది క్రితం కుట్టించిన బట్టలకి పుచ్చుకున్న చార్జీలు చాల్లేదని ఇప్పుడు వసూలు చేస్తావా? నీకు బుద్ధుందా? లేదా? నీకు ఇవ్వాల్సిందంతా అప్పుడే ఇచ్చేశాను. ఇప్పుడు పైసా కూడా ఇచ్చేది లేదు. ఫో!" అని కేకలేసి చిన్నారావుని పంపేశాడు పుల్లారావు.

బ్రేక్ ఫాస్ట్ చేద్దామని డైనింగ్ టేబుల్ దగ్గర కూచున్నాడో లేదో, గుమ్మం దగ్గర స్కూటర్ మెకానిక్ ప్రత్యక్షం. "ఏం అప్పారావూ! బాగున్నావా? నేనిప్పుడు స్కూటర్‌ని అమ్మేసి కారు కొన్నానయ్యా. సర్వీసింగ్ ఇప్పుడేమీ అవసరం లేదు" అన్నాడు పుల్లారావు.

"అది కాదండీ, గతేడాది మీరు స్కూటర్ రిపేరు చేయించుకున్నారు కదా, దాని బిల్లు లెక్క చూస్తే మీరింకా ఐదొందలివ్వాలని తేలిందండి. అదిప్పిస్తే.." అన్నాడు అప్పారావు.

"ఇదేంటయ్యా? నీ బిల్లు అప్పుడే మొత్తం ఇచ్చేశానుగా? ఏడాది తర్వాత వచ్చి మళ్ళీ ఐదొందలంటావేం? బుద్ధుందా? లేదా?" అని కేకలేసి అప్పారావును గెంటినంత పని చేశాడు పుల్లారావు.

"వీళ్ళకేమైంది సుశీలా? వాళ్ళకి సరిపోలేదని ఏడాది తర్వాత, రెండేళ్ళ తర్వాత మనల్ని మళ్ళీ డబ్బులు అడుగుతున్నారు? మతులు పోలేదు కదా?" అంటూ ఆఫీసుకు బయల్దేరబోతూంటే వాచ్‌మేన్ వచ్చి "సార్! ఈ నెల కరెంటు బిల్లు వచ్చింది సార్" అని చేతికిచ్చి వెళ్ళాడు.

పుల్లారావు ఓ సారి బిల్లు చూసేడు. గత నెల కన్నా అదనంగా రెండు వేలు పెరిగింది. ఎక్కువ కరెంటు వాడేమేమో అని అనుమానం వచ్చింది. చూస్తే గత నెల కన్నా ఇరవై యూనిట్లు తగ్గేయి. మరి బిల్లు ఏకంగా రూ.2000 ఎందుకు పెరిగింది? డిస్కాం ఆఫీసు



పిఆర్వోకి ఫోను చేసేడు పుల్లారావు.

"రెండేళ్ళ క్రితం వాడిన కరెంటుకి సంబంధించిన బకాయిలండీ అవి." అన్నాడు పిఆర్వో.

"నేను ఏ నెల బిల్లు ఆనెలలోనే కట్టేస్తున్నాను కదండీ. మళ్ళీ ఇదేమిటి?" అడిగేడు పుల్లారావు.

"ఎప్పటి బిల్లులు అప్పుడు కట్టకపోతే కరెంటు కట్ చేస్తాం లెండి. ఈ రెండు వేలూ రెండేళ్ల క్రితం కంపెనీకి అయిన ఖర్చుల్లో తేడాలు. అందుకే వసూలు చేస్తున్నాం." అని ఫోను కట్ చేసేశాడు పీఆర్వో.

"వీళ్ళకి చాలకపోతే మళ్ళీ బిల్లుల్ని తిరగదోడి మననుండి వసూలు చేస్తారా? బుద్ధుందా? లేదా?" అని కోపంగా పుల్లారావు అరుస్తూంటే సుశీల వచ్చి నెమ్మదిగా "అందుకే కరపత్రం చదవమని చెప్పాను. మీరు చెవికెక్కించుకోలేదు" అంటూ ఆ కరపత్రం చేతికిచ్చింది.

పుల్లారావు కరపత్రం చదువుతూంటే దూరం నుంచి 'ప్రజా హోరు' నినాదాలు వినపడుతున్నాయి. ఇప్పుడు ఆ నినాదాలు పుల్లారావు చెవిలో స్పష్టంగా వినిపిస్తున్నాయి.

ఆకలి సూచీ - పొంచి వున్న ప్రమాదం


అభిప్రాయం

అంతర్జాతీయంగా, జాతీయంగా, ప్రాంతీయంగా నిర్దిష్ట సంవత్సర కాలంలో పేదరిక స్థాయిని నిర్ధారించటానికి, ఆకలి తీరు తెన్నులు కొలవడానికి ప్రపంచ ఆకలి సూచీ (జి.హెచ్.ఐ) ఒక ముఖ్యమైన ప్రామాణికంగా పరిగణిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆకలిని తగ్గించేందుకు చర్యలు చేపట్టాలనే లక్ష్యంతో ఈ నివేదిక రూపొందిస్తారు.

ఆహారం సరిపడినంతగా దొరకకపోవడం, మొత్తం జనాభాలో పోషకాహార లేమితో ఉన్న జనాభా ప్రాతిపదికన నిర్ధారించే పోషకాహార లోపం (అండర్ నరిష్‌మెంట్), 5 సంవత్సరాలలోపు పిల్లలలో ఎత్తుకు తగ్గ బరువు లేకపోవడం (చైల్డ్ స్టంటింగ్), 5 సంవత్సరాల లోపు పిల్లలలో తీవ్రమైన పోషకాహార లేమి వల్ల వయసుకు తగిన ఎత్తు లేకపోవడం (చైల్డ్ వేస్టింగ్), 5 సంవత్సరాలలోపు వారిలో పోషకాహార లేమి వలన, అనారోగ్యకర వాతావరణం వలన జరుగుతున్న శిశు మరణాలు వంటి నాలుగు కీలక సూచికలను కొలమానంగా తీసుకుని 'ప్రపంచ ఆకలి సూచీ'ని లెక్కిస్తారు. 127 దేశాలను పరిగణనలోకి తీసుకుంటే 27.3 హంగర్ స్కోరుతో భారతదేశం 105వ స్థానంలో నిలిచింది. గ్లోబల్ హంగర్ ఇండెక్స్ నివేదిక ప్రకారం ఆకలి ప్రమాదకర స్థాయిలో ఉన్న 41 దేశాల జాబితాలో భారతదేశం చేరటం శోచనీయం.

ప్రపంచ ఆకలి సూచీలో భారతదేశం తర్వాత ఉగాండా, మొజాంబిక్, జింబాబ్వే, పాకిస్తాన్, నైజీరియా, సూడాన్, జాంబియా వంటి 22 దేశాలు మాత్రమే ఉండడం గమనార్హం. భారత దేశానికి పొరుగు దేశాలైన చైనా (4), శ్రీలంక (56), నేపాల్ (68), బంగ్లాదేశ్ (84) ర్యాంకులతో మనకంటే ముందు నిలిచాయి. గ్లోబల్ హంగర్ ఇండెక్స్ నివేదిక వెల్లడించిన వివరాల ప్రకారం 36 దేశాలు అత్యంత ప్రమాదకర స్థాయిలోను, 6 దేశాలు ఆకలి తీవ్రతతోనూ ఉన్నాయి.

నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే 2019-2021కి సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన గణాంకాలలో చైల్డ్ వేస్టింగ్ 19.3 శాతంగా, చైల్డ్ స్టంటింగ్ 35.5 శాతంగా ఉంది. ఎస్.ఒ.ఎఫ్.ఐ 2023 నివేదిక కూడా భారతదేశంలో 24 కోట్ల మంది ప్రజలు పోషకాహార లేమితో ఉన్నారని తెల్పింది. ఫుడ్ సెక్యూరిటీ అండ్ న్యూట్రిషన్ ప్రపంచ నివేదిక-2023లో కూడా



ఇది 16.6 శాతంగా ఉన్నది.

'పోషణ్', 'ప్రధాన మంత్రి మాతృ వందన యోజన', 'జాతీయ ఆహార భద్రతా చట్టం', 'మధ్యాహ్న భోజన పథకం', 'ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన' వంటి వివిధ పథకాలు, కార్యక్రమాలు, చర్యల ద్వారా ఆకలిని తగ్గించి, పోషణను పెంచే ప్రయత్నాలు చేస్తున్నామని ప్రభుత్వం ప్రచారం చేసుకుంటోంది. అయితే ఈ ప్రచారార్భాటంలోని డొల్లతనాన్ని ప్రపంచ ఆకలి సూచీలో భారతదేశ స్థానం బహిర్గతం చేసింది.

సామాజిక-ఆర్థిక తారతమ్యాలు, ప్రబలిన పేదరికం, తగినంత ఆహారాన్ని తీసుకోలేకపోవడం, పోషక విలువలున్న ఆహార వస్తువుల ధరలు అందుబాటులో లేకపోవడం, ఆరోగ్య పరిరక్షణా కొరత, లోపభూయిష్టమైన వ్యవసాయ పద్ధతులు, ఆహార పంపిణీ విధానాలు, లింగ అసమానతలు వంటివి ప్రపంచ ఆకలి సూచిలో భారతదేశ స్థానాన్ని దిగజార్చడానికి తీవ్ర ప్రభావాన్ని చూపిన అంశాలు. దీనిని పాలకులు గమనించి, సార్వజనీయ ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు ఆర్థిక అసమానతలను తగ్గించే ప్రత్యామ్నాయ విధానాలను రూపొందించి దేశ ప్రజలకు ఆహార భద్రత కల్పించాల్సిన సమయమిది.

- జి. కిషోర్ కుమార్,
జాయింట్ సెక్రటరీ, ఎస్.సి.జడ్.ఐ.ఇ.ఎఫ్ (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల ఎల్ఐసి ఉద్యోగ సంఘం),
సెల్ : 9440905501

నిరాహార దీక్షలో హక్కుల కార్యకర్తలు

- కోర్టులో హాజరు పరచకుండా పోలీసుల తాత్సారం
- ఎస్కార్ట్ సిబ్బంది లేరంటూ సాకులు
- ఎల్గర్ పరిషత్ కేసులో సుదీర్ఘ జైలు జీవితం



చిత్రంలో హనీబాబు, మహేష్ రౌత్, సుదీర్ ధావలే, సురేంద్ర గాడ్లింగ్, సాగర్ గోర్కే, రమేష్ గైచర్, రోనా విల్సన్ (ఫైల్)

ముంబయి : ఎల్గర్ పరిషత్ కేసులో విచారణను ఎదుర్కొంటూ జైలులో మగ్గుతున్న పలువురు మానవ హక్కుల కార్యకర్తలు శుక్రవారం నిరాహార దీక్షకు దిగారు. గతంలో ఈ కేసు విచారణకు వచ్చిన మూడు సందర్భాలలోనూ పోలీసులు హక్కుల కార్యకర్తలను న్యాయస్థానం ముందు హాజరు పరచలేదు. ప్రస్తుతం తలోజా కేంద్ర కారాగారంలో ఉన్న వీరిని తగిన ఎస్కార్టుతో దక్షిణ ముంబయిలోని ప్రత్యేక జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) కోర్టుకు తీసుకురావాలని న్యాయస్థానం ఆదేశించినప్పటికీ నవీ ముంబయి పోలీసులు శుక్రవారం జరిగిన విచారణకు వారిని హాజరు పరచలేదు. దీనిపై తీవ్ర నిరసన వ్యక్తం చేసిన హక్కుల కార్యకర్తలు చివరికి నిరాహార దీక్షకు పూనుకున్నారు.

జైలులో మగ్గుతున్నది వీరే

ఎల్గర్ పరిషత్ కేసులో మొత్తం 16 మందిని అరెస్ట్ చేశారు. వీరిలో కొందరికి బెయిల్ వచ్చింది. ఒకరు చనిపోయారు. ఏడుగురు పురుషులు, ఒక మహిళ ఇప్పటికీ జైలులోనే కాలం గడుపుతున్నారు. జైలు జీవితం గడుపుతున్న వారిలో హక్కుల న్యాయవాది సురేంద్ర గాడ్లింగ్, ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ హనీ బాబు, ఖైదీల హక్కుల కార్యకర్త రోనా విల్సన్, సాంస్కృతిక కార్యకర్తలు సాగర్ గోర్ఖే, రమేష్ గైచర్, విద్రోహి మ్యాగజైన్ సంపాదకుడు, రచయిత సుధీర్ ధావలే, గిరిజన హక్కుల కార్యకర్త మహేష్ రౌత్ ఉన్నారు. ఈ కేసులో అరెస్టయి బైకుల్లా మహిళా జైలులో ఉన్న హక్కుల కార్యకర్త జ్యోతి జగ్తప్‌ను కోర్టులో హాజరు పరిచారు.

కోర్టు ఆదేశాలు బేఖాతరు

ఈ 16 మందిపై 'అర్బన్ నక్సల్స్' అనే ముద్ర వేసి క్రూరమైన చట్ట వ్యతిరేక కార్యకలాపాల (నిరోధక) చట్టంలోని పలు కఠిన నిబంధనల కింద కేసులు పెట్టారు. పండుగలు, ఎన్నికలు, వీఐపీల సందర్శనలను సాకుగా చూపి నిందితులను భద్రతా సిబ్బంది కోర్టుకు లేదా ఆస్పత్రికి తీసుకెళ్లలేకపోతున్నారని అధికారులు వివరణ ఇస్తుంటారు. ఇప్పటికీ జైలులో ఉన్న వారిలో గాడ్లింగ్ తన కేసును తానే వాదించుకుంటున్నారు. ఆయనను కోర్టులో హాజరు పరచకపోవడంతో న్యాయస్థానంలో పిటిషన్‌ను సమర్పించలేదు. కోర్టులో వాదనలూ వినిపించలేదు. చివరిసారిగా జరిగిన విచారణ సందర్భంగా గాడ్లింగ్, ఇతర నిందితులను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరు పరిచారు. ఈ నేపథ్యంలో కేసులో అరెస్టయిన వారందరినీ శుక్రవారం తన ఎదుట హాజరు పరచాలని న్యాయస్థానం ఆదేశించింది. అయితే ఆ ఆదేశాలను పోలీసులు బేఖాతరు చేశారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో అంతరాయాలు

కోర్టులో వీడియో కాన్ఫరెన్స్ సేవలకు సాంకేతిక పరమైన అంతరాయం ఏర్పడడంతో హక్కుల కార్యకర్తలను ఆన్‌లైన్ ద్వారా కూడా హాజరు పరచలేదు. వీడియో కాన్ఫరెన్స్ సదుపాయం విఫలమవడం భారత న్యాయ వ్యవస్థలో నిత్యకృతమై పోయింది. అయినా నిందితులను వీడియో కాన్ఫరెన్స్ ద్వారానే హాజరు పరుస్తామని అనేక రాష్ట్రాలు చెబుతున్నాయి. 'మా నాన్నగారు నాకు ఫోన్ చేశారు. కోర్టు ఆదేశాలను పోలీసులు ఉల్లంఘించినందుకు, విచారణకు తమను హాజరు పరిచేందుకు నిరాకరించినందుకు నిరసనగా తామంతా నిరాహార దీక్షకు దిగుతున్నామని ఆయన చెప్పారు' అని గాడ్లింగ్ కుమారుడు, యువ న్యాయవాది సుమిత్ చెప్పారు. కాగా నిరాహార దీక్ష వార్త విని హనీ బాబు భార్య, ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఆందోళన వ్యక్తం చేశారు.

వైఫల్యాన్ని అంగీకరించిన మహారాష్ట్ర ప్రభుత్వం

జైలులో ఉన్న వారిని చాలా కాలంగా కోర్టుకు హాజరు పరచడం లేదని, ఖైదీలను జైలు నుంచి కోర్టుకు తరలించేందుకు అవసరమైన ఎస్కార్ట్ బృందాన్ని నియమించడం లేదని న్యాయస్థానం రాష్ట్ర ప్రభుత్వాన్ని తప్పు పడుతోందని మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. పోలీసు సిబ్బంది నియామకంపై ప్రభుత్వం కొన్ని సంవత్సరాల క్రితమే ఆదేశాలు జారీ చేసినప్పటికీ క్షేత్ర స్థాయిలో ఎలాంటి మార్పు రాలేదు. కుటుంబ సభ్యులను కలుసుకునేందుకు మాత్రమే ఖైదీలను అనుమతిస్తారు. కోర్టులో హాజరు పరచడానికి తీసుకెళ్లేటప్పుడు, తిరగి జైలుకు తీసుకొచ్చేటప్పుడు కొన్ని గంటల పాటు మాత్రమే వారు బాహ్య ప్రపంచాన్ని చూడగలుగుతారు.

నేటికీ మొదలవని విచారణ

ఎల్గర్ పరిషత్ కేసు విషయానికి వస్తే హక్కుల కార్యకర్తలు అనేక సంవత్సరాలుగా జైలు నాలుగు గోడల మధ్యే కాలం గడుపుతున్నారు. కొందరైతే 2018 మధ్య నుంచి జైలులోనే ఉన్నారు. వారి దరఖాస్తులు అనేకం అపరిష్కృతంగా ఉన్నాయి. తమకు ఈ కేసు నుంచి విముక్తి కల్పించాల్సిందిగా నిందితులు న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. అయితే వాటికి నేటికీ అతీగతీ లేదు. ఈ కేసులో రచయిత వరవరరావు, విద్యావేత్తలు ఆనంద్ తెల్తుంబ్డే, షోమా సేన్, పాత్రికేయుడు గౌతమ్ నవలఖ, న్యాయవాదులు సుధా భరద్వాజ్, అరుణ్ ఫెరైరా, హక్కుల కార్యకర్త వెర్నన్ గాన్‌సాల్వ్‌కు బెయిల్ లభించింది.

ఈ కేసులో అరెస్టయిన 84 సంవత్సరాల క్రైస్తవ మత బోధకుడు స్టాన్ స్వామి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ విచారణకు రాకముందే ప్రాణాలు కోల్పోయారు. స్టాన్ స్వామికి కోవిడ్ సోకినప్పుడు ప్రభుత్వం సకాలంలో తగిన వైద్య సాయం అందించలేదని ఆయన న్యాయవాదులు ఆరోపించారు. అండర్ ట్రయల్స్‌గా ఉన్న హక్కుల కార్యకర్తలు సంవత్సరాల తరబడి జైళ్లలో మగ్గుతున్నప్పటికీ ఈ కేసులో నేటికీ విచారణ ప్రారంభం కాలేదు.

ఎఫ్‌ఎలకు రాజకీయ వేధింపులు

- ఒక వైపు పని దినాల లక్ష్యం
- మరో వైపు అధికారుల ఒత్తిళ్లు
- ఆందోళనలో 'ఉపాధి' ఫీల్డ్ అసిస్టెంట్లు



ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి హామీ చట్టంలో క్షేత్రస్థాయిలో కీలకంగా పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు రాజకీయ వేధింపులు ఎక్కువయ్యాయి. పనిదినాల లక్ష్యం గోరుచుట్టుపై రోకలి పోటులా మారింది. ఉద్యోగుల సమస్యల పరిష్కారం, ఉద్యోగ భద్రత కోసం ఫీల్డ్ అసిస్టెంట్లు దశల వారీ పోరాటాలు చేసినా అధికార యంత్రాంగం పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. పని దినాలతో సంబంధం లేకుండా వేతనం ఇవ్వడంతో పాటు, జీతాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని వారు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికీ పని దినాల ఆధారంగానే జీతాలు ఇస్తుండటంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గతంలో 910 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం లక్ష్యాలను చేరుకోవడంతో వెనుకపడుతూ రావడంతో దశల వారీగా 460 మంది సీనియర్ మేట్లుగా మిగిలిపోయారు. ఇదే విధానం అమలు చేస్తే రాబోయే రోజుల్లో పూర్తిగా ఉపాధికి దూరమవుతారనే ఆందోళన వారిలో వ్యక్తమవుతోంది.

అందని ద్రాక్షలా టార్గెట్లు

ఏడాదిలో గ్రామంలో 7,500 పని దినాలు కల్పించిన వారిని ఎ-గ్రేడ్ కింద చేర్చి వారికి నెలకు రూ.8,900 వేతనం, రూ.350 అలవెన్స్ ఇస్తున్నారు. 7,500-6,500 మధ్య పని దినాలు కల్పించిన వారిని బి-గ్రేడ్‌గా పరిగణించి రూ.7,900 వేతనం, రూ.350 అలవెన్స్, అలాగే 5వేల నుంచి 6,500 మధ్య పనిదినాలు కల్పించిన వారిని సి-గ్రేడ్‌గా పరిగణించి రూ.6,400 వేతనం, రూ.350 అలవెన్స్ ఇస్తున్నారు. 5వేల కంటే తక్కువ పని దినాలు కల్పించిన వారికి జీతాలు ఉండవు. వీరిని సీనియర్ మేట్‌గా పరిగణిస్తారు. ఈ విధంగా జిల్లాలో 460 మంది సీనియర్ మేట్లుగా మిగిలిపోయారు. గ్రేడ్ల కోటాలో కొందరికి మాత్రమే జీతాలు చెల్లించి మిగిలిన వారికి మొండిచేయి చూపిస్తూ పొమ్మన కుండా పొగబెడుతున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ పరిస్థితిని చక్కదిద్దాలని కోరుతున్నారు.

మూడు నాలుగు నెలలే పనులు..

ఉపాధి హామీ పనులు ఏడాదంతా సాగడం లేదు. వేసవిలో మూడు నుంచి నాలుగు నెలలకు మించి పనులు జరగడం లేదు. ఫిబ్రవరి, మే వరకే కాస్త హడావుడి కనిపిస్తోంది. మిగతా రోజుల్లో ఆశించిన స్థాయిలో పనులు జరగట్లేదు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో వ్యవసాయ పనులుంటాయనే పేరుతో ఉపాధి నిర్వహించట్లేదు. ఇలాంటి పరిస్థితుల్లో తమ ఉ[illegible] కరువైందని ఫీల్డ్ అసిస్టెంట్లు వాపోతున్నారు. ఈ[illegible] దశల వారీ ఆందోళనలను ప్రారంభించారు. ము[illegible] విలీనమైన గ్రామ పంచాయతీల్లో ఫీల్డ్ [illegible] ప్రత్యామ్నాయం చూపించాలని కోరుతున్నారు.

అదే విధంగా ఉపాధి కూలీలకు రోజుకు [illegible] వేతనం కల్పించి 200 రోజులు పని కల్పించ[illegible] చేస్తున్నారు. అర్హత, అనుభవం కల్గిన ఫీల్డ్ అ[illegible] ప్రమోషన్, మండల స్థాయిలో బదిలీల[illegible] కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్ర[illegible] మరణించిన వారికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియ[illegible] జూనియర్ మేట్, సీనియరల్ మేట్, ఫీల్డ్ అసి[illegible] తారతమ్యం లేకుండా అందరినీ ఫీల్డ్ అసి[illegible] పరగణించి వేతనాలు చెల్లించాలని పాలకు[illegible] చేస్తున్నారు.

రాజకీయ వేధింపులు

ఇటీవల పల్లెపండుగ పేరుతో ప్రభుత్వ[illegible] పనులను నిర్వహిస్తోంది. ఈ పనులను ఉ[illegible] కూలీలతో నిర్వహించాలని నిర్ణయించింది. [illegible] అసిస్టెంట్లపై రాజకీయ నాయకుల పెత్తనం ఎక్కువైంది. అవసరం ఉన్నా లేకున్నా అనధికారికంగా వారితో సమావేశాలు నిర్వహిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు. నాయకులు చూపిన వారికే పని ఇవ్వాలనే ఒత్తిళ్లు ఎక్కువగా ఉన్నాయి. తమ పార్టీ కాని కూలీలను పక్కన పెట్టాలని అధికారపార్టీ నాయకులు మౌఖికంగా ఆదేశాలు ఇస్తున్నారు. వారిని కాదని పనులు కల్పిస్తే బెదిరింపు లకు సైతం దిగుతున్నారని ఎఫ్ఎలు వాపోతున్నారు. కొన్ని ప్రాంతాల్లో అధికారులు కూడా నాయకులకే వత్తాసు పలకడంతో ఫీల్డ్ అసిస్టెంట్లు నానా ఇబ్బందులు పడుతున్నారు.

'అన్నమయ్య సంకీర్తన' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - క్యాంపస్ (తిరుపతి)

వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ లండన్ వారి ద్వారా వరల్డ్ రికార్డ్ సాధించాలనే సత్సంకల్పంతో నవంబర్ 10న జరిగే బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే అనే అన్నమయ్య సంకీర్తనకు 2024 మందితో సామూహిక కోలాటం సంబంధించినటువంటి పోస్టర్‌ను జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం విసి ప్రొఫెసర్ జి.యస్.ఆర్ కష్ణమూర్తి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రహ్మమొక్కటే పర బ్రహ్మమొక్కటే అనేటటువంటి సంకీర్తన ద్వారా అందరూ సమానులే అనేటువంటి భావనను అన్నమాచార్యులు వారు ఈ సంకీర్తన ద్వారా ఆనాడే చెప్పడం జరిగిందన్నారు. ఈరోజు మనం అందరం కలిసి భావితరాల వారికి శ్రీవేంకటేశ్వర స్వామి పట్ల భక్తి భావాన్ని కలిగి ఉండాలనేటువంటి విషయాన్ని తెలియజేసేటటువంటి ప్రయత్నం ఈ కార్యక్రమ ద్వారా చేయడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనాలంటే 9603050414 నెంబర్‌ను సంప్రదించవచ్చని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ స్కూల్ మేనేజ్మెంట్ అసోసియేషన్ జోనల్ ప్రెసిడెంట్ డా.విశ్వనాథ్ రెడ్డి, తిరుపతి జిల్లా ప్రెసిడెంట్ ఓబులు వెంకటరమణారెడ్డి, సెక్రటరీ బి.రవీంద్ర రెడ్డి, జాయింట్ సెక్రెటరీ డా.టి.రామకష్ణారెడ్డి, సీనియర్ ప్రెసిడెంట్ జి.ఓం ప్రకాష్ రెడ్డి, శ్రీధర్ అకాడమీ సీఈవో ఎస్.లీలాకష్ణ స్వామి, అన్నమయ్య డాన్స్ అకాడమీ అధ్యక్షులు డా.సి.శ్రీ రామ్ బాబు పాల్గొన్నారు.

కౌలు కార్డులున్నా...అందని రుణాలు..!

● కౌలురైతులకు రుణాల మంజూరులో తీవ్ర నిర్లక్ష్యం
● ఖరీఫ్ ముగుస్తున్నా అరకొరగానే రుణాల మంజూరు
● పశ్చిమలో రూ.102 కోట్లు, ఏలూరు జిల్లాలో రూ.125 కోట్లు
● ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తేనే కౌలు రైతులకు న్యాయం



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రభుత్వాలు మారినా కౌలురైతుల బతుకులు మాత్రం మారలేదు. వాస్తవ సాగుదారులైన కౌలురైతులకు రుణాలిచ్చేందుకు బ్యాంకర్లు ససేమిరా అంటున్నారు. జిల్లా వ్యవసాయంలో అగ్రభాగం కౌలురైతులే సాగు చేస్తున్నా బ్యాంకు రుణాల మంజూరులో మాత్రం అట్టడుగున ఉన్న పరిస్థితి నెలకొంది. దీంతో అందరికీ అన్నంపెట్టే అన్నదాత ఊసూరుమంటూ అప్పుల కోసం పరుగులు తీయాల్సిన దుస్థితి కొనసాగుతోంది. కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి కౌలురైతులకు రుణాలందేలా చర్యలు తీసుకుంటేనే అన్నదాతకు మేలు జరిగే పరిస్థితి ఉంటుంది.

రాష్ట్రంలో అత్యధికంగా కౌలురైతులు ఉన్న జిల్లాలు ఏలూరు, పశ్చిమగోదావరిలే. ప్రస్తుత ఖరీఫ్‌లో రెండు జిల్లాల్లో దాదాపు నాలుగున్నర లక్షల్లో వరి సాగు చేయగా అందులో 70 శాతం కౌలురైతులే చేస్తున్నారు. సాగులో అగ్రభాగంలో ఉన్న కౌలురైతుల పట్ల బ్యాంకర్లు అత్యంత చిన్నచూపు చూస్తున్నారు. ప్రభుత్వం చెబుతున్న మాటలకు, కౌలురైతులకు బ్యాంకర్లు మంజూరు చేస్తున్న రుణాలకు అసలు పొంతన లేకుండా పోతుంది. జిల్లా వ్యవసాయ రుణ ప్రణాళికలో కౌలురైతులకు ఇచ్చే రుణాలు ఒక్కశాతం కూడా లేని పరిస్థితి. ఖరీఫ్ ముగిసే దశకు చేరుకున్నా రెండు జిల్లాల్లో కౌలురైతులకు బ్యాంకర్లు ఇచ్చిన పంట రుణాల మంజూరు చూస్తే ఎవరైనా నోరెళ్లబెట్టాల్సిందే. 2019కు ముందు టిడిపి ప్రభుత్వం ఇచ్చిన లెక్కల ప్రకారం చూస్తే ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు మూడు లక్షల మంది వరకూ కౌలురైతులు ఉన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో కౌలురైతుల సంఖ్యను భారీగా కుదించి సిసిఆర్‌సి (కౌలుకార్డులు) మంజూరులో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించిన పరిస్థితి నెలకొంది. వైసిపి ప్రభుత్వ పదవీ కాలంలో కౌలురైతుల పరిస్థితి అత్యంత దుర్భరంగా మారింది. కౌలుచట్టంలో సైతం మార్పులు చేసి కౌలురైతులను నిలువునా దెబ్బతీశారు. కూటమి ప్రభుత్వం రావడంతో తమకు న్యాయం జరుగుతుందని కౌలురైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కౌలుచట్టంలో మార్పులు చేస్తామని ప్రభుత్వం చెప్పింది. వచ్చే రబీ నుంచి కొత్త కౌలు చట్టం ప్రకారం కౌలుకార్డులు జారీ ప్రక్రియ జరుగుతుందని తెలిపింది. అక్కడ వరకూ బాగానే ఉంది. ప్రస్తుత ఖరీఫ్‌లో పశ్చిమగోదావరి జిల్లాలో 89 వేల మందికి, ఏలూరు జిల్లాలో 65 వేల మందికి కౌలుకార్డులు జారీ చేశారు. కార్డులిచ్చిన రైతులకైనా రుణాలు మంజూరు చేశారా అంటే అదీ లేకుండాపోయింది.

పంట రుణాల మంజూరులో ఇంత నిర్లక్ష్యమా..

కౌలుకార్డు అందుకున్న రైతులకు సైతం బ్యాంకర్లు పంటరుణాలు ఇవ్వని దుస్థితి నెలకొంది. ప్రస్తుత ఖరీఫ్ ముగింపు దశకు చేరుకుంది. కౌలురైతులకు బ్యాంకర్లు మంజూరు చేసిన రుణాలు చూస్తే ఆశ్చర్యపోక తప్పదు. పశ్చిమగోదావరి జిల్లాలో 89 వేల మంది కౌలురైతులకు కౌలుకార్డులు ఇచ్చినట్లు లెక్కలు చెబుతుండగా ఇందులో దాదాపు 12 వేల మందికి రూ.102 కోట్లు మాత్రమే పంట రుణాలు మంజూరయ్యాయి. ఏలూరు జిల్లాలో 64,686 మందికి కౌలుకార్డులు మంజూరు చేయగా ఇప్పటి వరకూ 20,135 మందికి రూ.125.31 కోట్లు మాత్రమే పంటరుణాలు మంజూరు చేసిన పరిస్థితి ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏలూరు జిల్లా వ్యవసాయ రుణ ప్రణాళిక రూ.7,300 కోట్లు వరకూ ఉంది. కొద్దిరోజుల క్రితం జిల్లాకు చెందిన మంత్రి కొలుసు పార్థసారధి మాట్లాడుతూ వ్యవసాయ రుణ ప్రణాళికలో కౌలురైతులకు రూ.రెండు వేల కోట్లు పంట రుణాలుగా మంజూరు చేయాలని బ్యాంకర్లకు తెలిపారు. ఆయన చెప్పిన దానికి, బ్యాంకర్లు మంజూరు చేసిన పంట రుణాలకు అసలు పొంతనే లేకుండాపోయింది. వ్యవసాయ సాగులో అష్టకష్టాలు పడుతూ అందరికీ అన్నం పెడుతున్న కౌలురైతుల పట్ల బ్యాంకర్లు ఎందుకు చిన్నచూపు చూస్తున్నారో ఎవ్వరికీ అర్థం కావడం లేదు. కౌలురైతులకు రుణాల మంజూరుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తే తప్ప అన్నదాతకు న్యాయం జరిగే పరిస్థితి కన్పించడం లేదు. అవసరమైతే ప్రభుత్వమే కౌలురైతులకు గ్యారెంటీ ఇచ్చి రుణాలు అందించేవిధంగా చర్యలు తీసుకోవాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా బ్యాంకర్లు తీరు మారకపోతే అన్నదాత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోక తప్పదు.

డ్రోన్ సమ్మిట్‌కు 2వేల మంది

ఏర్పాట్లను ముమ్మరం చేసిన అధికారులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఈ నెల 22, 23 తేదిల్లో జరగనున్న అమరావతి డ్రోన్ సమ్మిట్‌కు అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వంద మంది ప్రతినిధులు, వివిధ విశ్వవిద్యాలయాల నుంచి 400 మంది విద్యార్థులు, ఈ రంగంపై ఆసక్తి ఉన్న ఎంటర్‌ప్రెన్యూర్‌లు, ఇతరులు మరో 15వందల మంది వరకూ రానున్నారు. మొత్తంమీద 2వేల మంది వరకు హాజరవుతారని అధికారులు అంచనా వేస్తున్నారు. తాడేపల్లిలోని సికె కన్వెన్షన్‌లో ఈ సదస్సును ప్రభుత్వం నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సదస్సులో డ్రోన్ల వినియోగం, తయారీలో సాంకేతికత, భవిష్యత్తులో ఈ రంగంలో వచ్చే మార్పులు, నూతన అవకాశాలు తదితర అంశాలకు సంబంధించి ప్యానల్ చర్చలు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఐదు వేల డ్రోన్లతో డ్రోన్ షోను 22వ తేదీన సాయంత్రం కృష్ణానది ఒడ్డున పున్నమి ఘాట్‌లో నిర్వహిస్తున్నారు.


నూతన సాంకేతిక విప్లవంలో భాగంగా డ్రోన్ టెక్నాలజీ పాత్రను గుర్తించి ఈ రంగాన్ని మరింత ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కొత్తగా డ్రోన్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసింది. విజయవాడలో ఇటీవల సంభవించిన వరదల్లో రాష్ట్ర ప్రభుత్వం బాధితులకు ఆహారం, మందులు, నిత్యావసర వస్తువులు అందించేందుకు డ్రోన్లను వినియోగించిన సంగతి తెలిసిందే. అదేవిధంగా డ్రోన్లు వ్యవసాయం, విపత్తు నిర్వహణ, విభిన్న రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్నాయి. డ్రోన్ల టెక్నాలజీకి రాష్ట్రప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను గుర్తించి పెట్టుబడిదారులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుంటే నూతన ఉద్యోగాల కల్పనకు వీలుంటుందని అధికారులు చెబుతన్నారు. 2014లో దేశంలో డ్రోన్ విధానం ప్రారంభమైనప్పటికీ తొలుత వీటిని వినియోగించే అవకాశం ప్రభుత్వ సంస్థలను మాత్రమే అనుమతించారు. క్రమేణా 2018, 2021లలో ఈ నిబంధనలను సడలించడంతో డ్రోన్ల వినియోగం పెరిగింది. డ్రోన్ కవరేజ్ 300 నుంచి 500 కిలోమీటర్లకు పెంచారు. ఈ పరిణామాలతో డ్రోన్ టెక్నాలజీకి సంబంధించి దేశంలో 150 నుంచి 200 వరకూ స్టార్టప్‌లు ఏర్పాటయినట్లు అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలో కూడా డ్రోన్ల స్టార్టప్‌లను ఏర్పాటు చేసే వారిని ప్రోత్సహించడంతో ఈ రంగంలో వస్తున్న అవకాశాలను అందిపుచ్చుకుని రాష్ట్రాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని ప్రభుత్వం భావిస్తోంది.

సందర్శకులకు ఇబ్బంది లేకుండా చర్యలు

● డ్రోన్ కార్పొరేషన్ ఎమ్‌డి దినేష్‌కుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దేశంలోనే తొలిసారిగా నిర్వహిస్తున్న మెగా డ్రోన్ షో కార్యక్రమాన్ని తిలకించడానికి వచ్చే సందర్శకులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని డ్రోన్ కార్పోరేషన్ ఎమ్‌డి కె.దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. డ్రోన్ సమ్మిట్ 2024లో భాగంగా విజయవాడలోని పున్నమి ఘాట్‌లో నిర్వహిస్తున్న మెగా డ్రోన్ షో ఏర్పాట్లను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 5 వేల డ్రోన్‌లతో ఈ మెగా డ్రోన్ షోను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యమంత్రి, మంత్రులు, విఐపిలు, సందర్శకులు హాజరవుతారని షోను తిలకించడానికి ఎవరెవరికి ఎక్కడెక్కడ ఏర్పాట్లు చేయాలనే విషయాన్ని అధికారులకు సూచించారు. సందర్శకులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందే అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. డ్రోన్ షోతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు, క్రాకర్స్ షో కూడా ఉంటాయని ఈ కార్యక్రమాలను తిలకించేందుకు అధిక సంఖ్యలో సందర్శకులు హాజయ్యే అవకాశం ఉన్నందున తాగునీరు, వాహనాల పార్కింగ్ తదితర విషయాలలో సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ నిధి మీనా, మున్సిపల్ కమిషనర్ ధ్యాన్‌చంద్ర, తదితరులు పాల్గొన్నారు.



సిఎం చంద్రబాబుకు చెక్కు అందిస్తున్న అప్సా నాయకులు

విజయవాడ వరద బాధితులకు 'అప్సా' సాయం

ప్రజాశక్తి-తిరుపతి (మంగళం)

విజయవాడ వరద బాధితులకు సాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (అప్సా) రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రైవేటు పాఠశాలల నుంచి విరాళాలను సేకరించింది. సేకరించిన విరాళాలను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి అప్సా రాష్ట్ర అధ్యక్షులు సుబ్రమణ్యం రాజు ఆధ్వర్యంలో విజయవాడలోని సిఎం క్యాంపు కార్యాలయంలో రూ.64,02,854 వరద సహాయాన్ని చెక్కు రూపంలో అందించారు. వరద బాధితులకు సాయం చేసిన అప్సా కార్యవర్గాన్ని సిఎం అభినందించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెంనాయుడు, గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు, అప్సా నాయకులు పాల్గొన్నారు.

వెంటాడుతున్న డోలీ కష్టాలు

● గర్భిణిని ఐదు కిలోమీటర్లు మోసుకెళ్లిన కుటుంబసభ్యులు



డోలిలో గర్భిణి రాములమ్మను మోసుకెళుతున్న కుటుంబసభ్యులు

ప్రజాశక్తి- అనంతగిరి (అల్లూరి జిల్లా)

మారుమూల గిరిజన గ్రామాలకు కనీస రోడ్డు సౌకర్యం లేక గిరిజన గర్భిణులు, రోగులకు డోలీ మోత కష్టాలు తప్పడం లేదు. మండలంలోని గుమ్మ పంచాయతీ మారుమూల కర్రిగోడ గ్రామానికి చెందిన బడ్నాయిని రాములమ్మకు శనివారం పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు కర్రలతో డోలీ కట్టి, ఎత్తయిన కొండలు, రాళ్లురప్పలున్న అటవీ మార్గంలో సుమారు ఐదు కిలోమీటర్ల దూరం భుజానమోసి గుమ్మ పంచాయతీ కేంద్రం వరకు తీసుకెళ్లారు. అక్కడి నుంచి ప్రయివేటు ఆటోలో ఎస్.కోట ఏరియా ఆస్పత్రికి తరలించారు. కర్రి గోడ, కడరేవు, ముల్లెలు తదితర అయిదు గిరిజన గ్రామాల రోగులు, గర్భిణులు అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రికి వెళ్లాలంటే డోలీమోతే శరణ్యం. లుంగపర్తి పిహెచ్‌సికి వెళ్లాలన్నా వీరు ఇటువంటి కష్టాలు ఎదుర్కోక తప్పడం లేదని ఆయా గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అటవీశాఖ అభ్యంతరంతో నిలిచిన రోడ్డు పనుల వల్ల అవస్థలు

మిషన్ పాడేరు కనెక్టివిటీ ప్రాజెక్టు కింద 2020-21లో కోట్ల రూపాయల నిధులతో అధికారులు గుమ్మ గ్రామం నుండి రోడ్డు పనులు మొదలుపెట్టారు. మూడు కిలోమీటర్లు పూర్తి చేశారు. ఇంతలో అటవీశాఖ అధికారుల అభ్యంతరంతో రోడ్డు పనులు నిలిచిపోయాయి. తర్వాత వీటి గురించి ఎవరూ పట్టించుకోకపోవడంతో అసంపూర్తిగా మిగిలిన రోడ్డుతో గిరిజనులు ఇబ్బందులకు గురవుతున్నారు.

146 కిలోల గంజాయి స్వాధీనం

● ఇద్దరు అరెస్ట్ ● మరో ఇద్దరి కోసం గాలింపు

ప్రజాశక్తి- నక్కపల్లి (అనకాపల్లి జిల్లా)

ఉమ్మడి విశాఖ జిల్లా ఏజెన్సీ ప్రాంతం నుంచి ఒక కారులో గంజాయిని అక్రమంగా తరలిస్తుండగా శనివారం ఉదయం వేంపాడు టోల్ ప్లాజా వద్ద సిఐ కుమారస్వామి తన సిబ్బందితో తనిఖీలు చేపట్టి పట్టుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో సిఐ మాట్లాడుతూ మహారాష్ట్రకు చెందిన రామేశ్వర్ చౌహాన్, రాబిన్ అనే వ్యక్తులు ఏజెన్సీ ప్రాంతం నుంచి గంజాయి తీసుకురావాలని మోమిన్ రీస్‌జులా, ప్రకాశ్ మంగీలాల్ జయదేవన్‌లను పురమాయించడంతో వారు కారులో ఈ నెల 11న విశాఖ చేరుకున్నారని తెలిపారు. ఈ నెల 15న రామేశ్వర్ చౌహాన్, రాబిన్ కూడా విశాఖ చేరుకున్నారన్నారు. శనివారం ఉదయం మోమిన్ రీస్ జులా, ప్రకాశ్ మంగీలాల్ జయదేవ్ 146 కేజీల గంజాయిని ముంచింగిపుట్ సమీపాన కొనుగోలు చేసి కారులో మహారాష్ట్రలోని బీడ్ జిల్లాకు తీసుకెళ్తుండగా, వేంపాడు హైవే టోల్ ప్లాజా వద్ద తనిఖీలు నిర్వహించి పట్టుకున్నట్లు సిఐ చెప్పారు. రెండేసి కేజీల చొప్పున గంజాయి ప్యాకెట్లు 73 ఉన్నాయని, సుమారు రూ.4.38 లక్షలు విలువైన గంజాయిని స్వాధీనపర్చుకుని, ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశామని తెలిపారు. మధ్యవర్తులుగా ఉన్న రామేశ్వర్ చౌహాన్, రాబిన్ కోసం గాలిస్తున్నామని చెప్పారు.

పర్యావరణ మార్పు.. పేదలకే ముప్పు

- చిన్న పరిశ్రమలు, పేద కుటుంబాలకు అధిక నష్టం
- అసంఘటితరంగ కార్మికుల పాలిట శాపం
- అత్యధిక ఉష్ణోగ్రతలు, వరదలతో బిక్కుబిక్కు
- సంపన్నులు అనుకూల ప్రాంతాలకు తరలివెళ్లే ఆప్షన్
- ప్రపంచ బ్యాంకు అధ్యయనంలో వెల్లడి



న్యూఢిల్లీ : పారిశ్రామిక విప్లవం తర్వాత భూతాపం పెరుగుతూ వస్తున్నది. పెట్టుబడిదారి విధానం దాన్ని మరింత పెంచి పోషిస్తున్నది. తత్ఫలితమే పర్యావరణ మార్పులు. ఈ మార్పుల వల్ల కలిగే దుష్పరిణామాలు చిన్న చిన్న పరిశ్రమలను, పేదలనే ఎక్కువ నష్టపరుస్తాయని తాజాగా వరల్డ్ బ్యాంక్ ఓ అధ్యయనంలో వెల్లడించింది. పెట్టుబడిదారి విధానంలో పీడితులైన పేదలే.. ఈ పర్యావరణ మార్పుల దుష్ప్రభావాన్ని ఎక్కువ ఎదుర్కోనుండటం వైచిత్రి. పంచభూతాలపై సమస్త ప్రాణకోటికి సమాన హక్కులు ఉంటాయి. కానీ, కొన్ని ఉన్నత వర్గాలు వీటిని వ్యాపారాలకు, స్వలాభాల కోసం ఇష్టారీతిన వినియోగించి మానవాళికి పెనుసవాళ్లను తెచ్చిపెడుతున్నాయి. పర్యావరణ మార్పుల వల్ల అత్యధిక ఉష్ణోగ్రతలు, వరదలు వంటి దుష్ప్రభావాలు చిన్న చిన్న పరిశ్రమలపైనా, పేద ప్రజలపైనా ఎక్కువ ప్రతాపాన్ని చూపుతాయని ప్రపంచ బ్యాంకు తాజా అధ్యయనంలో వెల్లడైంది. 'హౌజ్ హెూల్డ్ అండ్ ఫరమ్ ఎక్స్‌పోజర్ టు హీట్ అండ్ ఫ్లడ్స్ ఇన్ సౌత్ ఏషియా' అనే రీసెర్చ్ పేపర్ పర్యావరణ మార్పుల గురించి కీలక వివరాలను బయటపెట్టింది. అత్యధిక ఉష్ణోగ్రతల వల్ల వ్యాధిగ్రస్తుల పరిస్థితులు దిగజారుతాయని, మరణాల సంఖ్య పెరుగుతుందని తెలిపింది. పాఠశాలల మూసివేత వల్ల విద్యార్థులు నష్టపోతారు. సాగు ఉత్పాదకత దెబ్బతిని కర్షకులు దివాళా తీసే పరిస్థితులు దాపురిస్తాయి. ఇక వరదల వల్ల భారీ పంట నష్టాలేగాక ఆస్తుల నష్టం కూడా వాటిల్లుతుంది.

చిన్న పరిశ్రమలకు పెద్ద దెబ్బ

మన దేశంలో వ్యవసాయేతర రంగాల్లో పెద్ద పెద్ద పరిశ్రమల కంటే చిన్న పరిశ్రమలు, అసంఘటిత రంగాలు వరదలు, అత్యధిక ఉష్ణోగ్రతలను ఎదుర్కొనే చాన్స్ ఉన్నదని ఈ రీసెర్చ్ పేపర్ వివరించింది. సాధారణంగానే ఉద్యోగులు పెద్ద పెద్ద పరిశ్రమల్లో ఎక్కువ. సగటున 33 డిగ్రీల ఉష్ణోగ్రతల వద్ద కంటే 31 డిగ్రీల ఉష్ణోగ్రతల వద్ద 12.5 శాతం మంది ఉద్యోగులు తక్కువగా ఉంటారని ఈ అధ్యయనం తెలిపింది. పట్టణ ప్రాంతాల్లో అత్యధిక ఉష్ణోగ్రతల ప్రభావం ఎక్కువ ఉంటుంది. అదే వరదల విషయానికి వస్తే పట్టణ ప్రాంతాల్లో పేదలు ఎక్కువ నష్టపోయే ముప్పు ఉండగా.. గ్రామీణ ప్రాంతాల్లో సంపన్నులు ఈ సమస్యను ఎక్కువగా ఎదుర్కొంటారని అంచనా వేసింది. వలస వెళ్లే శక్తి సామర్థ్యాలు పర్యావరణ మార్పుల వల్ల ఉత్పన్నమయ్యే తీవ్ర వాతావరణ పరిస్థితుల నుంచి తప్పించుకుని అనుకూల ప్రాంతాలకు తరలి వెళ్లే శక్తి సామర్థ్యాలు పేదల కంటే సంపన్నులకు ఎక్కువ ఉంటాయి. అయితే, తరచూ సంభవించే ఈ సమస్యలు ధనికవర్గాలనూ తీవ్రంగా నష్టపరుస్తాయి. ఇవి వారి ఆస్తులను క్రమంగా ధ్వంసం చేయగలవు.

ఇవీ ప్రమాదాలు..

- పర్యావరణ మార్పులతో ఉత్పన్నమయ్యే తీవ్ర ఉష్ణోగ్రతలు, వరదలను చిన్న పరిశ్రమలు, పేద కుటుంబాలు అధికంగా ఎదుర్కోనున్నాయి.
- ఈ ప్రాంతాల్లో ఎక్కువగా పేద ప్రజలు నివసిస్తున్నారని సర్వే తెలిపింది.
- ఎక్కువ మంది కార్మికులకు ఉపాధినిచ్చే చిన్న పరిశ్రమలే.. అత్యధిక ఉష్ణోగ్రతలు, వరదలను చవిచూస్తాయి.
- సంపన్నులు అనుకూల ప్రాంతాలకు వలస వెళ్లే అవకాశాలున్నాయి. పేదలు వలస వెళ్లే సామర్థ్యాలను కోల్పోతారు.

మహాయుతికి మరో ఎదురు దెబ్బ

- థాకరే పార్టీలో చేరిన నేతలు

ముంబయి : మహారాష్ట్రలో శాసనసభ ఎన్నికలకు ముందు మహాయుతికి దెబ్బ మీద దెబ్బ పడుతోంది. సింధుదుర్గ్‌కి చెందిన బిజెపి నాయకుడు రాజన్ తెలి, సోలాపూర్‌కు చెందిన ఎన్‌సిపి (అజిత్) నాయకుడు దీపక్ సలుంఖే తమ పార్టీలకు రాజీనామా చేసి ఉద్ధవ్ థాకరే నేతృత్వంలోని శివసేన యుబిటిలో చేరారు. కేంద్ర మాజీ మంత్రి, రత్నగిరి-సింధుదుర్గ్‌కు చెందిన బిజెపి ఎంపీ నారాయణ్ రాణేకు రాజన్ తెలి సన్నిహితుడు. ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనకు చెందిన విద్యా శాఖ మంత్రి దీపక్ కేసర్కార్‌పై ఆయన పోటీ చేసే అవకాశం ఉంది. తెలి 18 సంవత్సరాల తర్వాత తిరిగి పార్టీలో చేరారని ఉద్ధవ్ ఠాక్రే చెప్పారు. తాను పది సంవత్సరాల క్రితం బిజెపిలో చేరానని, అక్కడ అనేక ఇబ్బందులు పడ్డానని తెలి తెలిపారు. కాగా సోలాపూర్ మాజీ ఎమ్మెల్యే, ఎన్‌సిపి (అజిత్) జిల్లా అధ్యక్షులు సలుంఖే కూడా శివసేన యుబిటిలో చేరారు.

బాల్య వివాహాలతో విద్యకు దూరం

- 11.5 లక్షల మందిపై అధ్యయనం

న్యూఢిల్లీ : బాల్య వివాహం సామాజిక దురాచారమని అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు శుక్రవారం తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు, సంబంధిత ప్రభుత్వ సంస్థలకు న్యాయస్థానం ఈ సందర్భంగా పలు మార్గదర్శకాలు జారీ చేసింది. బాల్య వివాహాల కారణంగా దేశంలో అభం శుభం తెలియని 11.5 లక్షల మంది చిన్నారులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తాజా పరిశీలనలో తేలింది. జాతీయ బాలల హక్కుల రక్షణ కమిషన్ ఆదేశాల మేరకు 27 రాష్ట్రాలు, 7 కేంద్ర పాలిత ప్రాంతాలలో బాల్య వివాహాల కారణంగా జరుగుతున్న అనర్థాలపై పరిశీలన జరిగింది. బాల్య వివాహాలు చేసుకున్న వారు మధ్యలోనే చదువుకు స్వస్తి చెబుతున్నారని, మరి కొంతమంది అసలు పాఠశాలకే వెళ్లడం లేదని, లేదా పాఠశాల అధికారులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా దీర్ఘకాలం గైర్హాజరు అవుతున్నారని వివరించింది. బాల్య వివాహాల కారణంగా ఇబ్బందులు పడుతున్న 11.5 లక్షల మంది బాలబాలికలలో ఐదు లక్షల మంది ఉత్తరప్రదేశ్, లక్షన్నర మంది అస్సాం, సుమారు లక్ష మంది మధ్యప్రదేశ్‌కు చెందిన వారే. లక్షద్వీప్, అండమాన్ నికోబార్ దీవులలో బాల్య వివాహాల బారిన పడిన బాలబాలికలు ఒక్కరూ లేరు. అనేక జిల్లాలలో పరిశీలన జరపలేదని, గోవా, లడఖ్‌లు సమాచారాన్ని అందజేయలేదని బాలల హక్కుల కమిషన్ తన నివేదికలో తెలిపింది.

అక్షయ తృతీయకు ఒక నెల రోజుల ముందు...మార్చిలో ఈ పరిశీలన ప్రక్రియను చేపట్టారు. అక్షయ తృతీయ రోజు సామూహిక వివాహాల ముసుగులో బాల్య వివాహాలు జరుగుతుంటాయి. ఆయా రాష్ట్రాలలోని మూడు లక్షల గ్రామాలకు చెందిన సుమారు ఆరు లక్షల పాఠశాలలలో సర్వే నిర్వహించారు. సర్వే అంశాలతో కూడిన సమాచారాన్ని గత వారం బాలల కమిషన్ రాష్ట్రాలకు పంపింది. ఆ సమాచారంతో పాటు కమిషన్ అధిపతి ప్రియాంక్ కనూంగో రాసిన లేఖను జత చేసింది. బాల్య వివాహాలను అడ్డుకునేందుకు చర్యలను వేగవంతం చేయాలని ఆయన ఆ లేఖలో కోరారు. బాలబాలికలు విద్యను కొనసాగించేలా చేస్తే బాల్య వివాహాలను అడ్డుకోవచ్చునని కనూంగో చెప్పారు. చదువు మధ్యలో మానేసిన వారు, అసలు పాఠశాలలోనే చదవని వారు, పాఠశాలకు సరిగా రాని బాలబాలికల జాబితాను రూపొందించాలని బాలల జాతీయ కమిషన్ రాష్ట్రాలను కోరింది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి సమాచారం ఇవ్వకుండా గైర్హాజరు అయిన చిన్నారుల జాబితాను ప్రత్యేకంగా రూపొందించాలని సూచించింది. ఈ జాబితాలను జిల్లా విద్యా శాఖ రూపొందించి జిల్లా మెజిస్ట్రేట్, బాల్య వివాహాల నిరోధక అధికారికి అందజేయాలని చెప్పింది. గుర్తించిన బాలబాలికల కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ నిర్వహించాలని, సరైన విచారణ జరపాలని జాతీయ బాలల కమిషన్ కోరింది.

ఢిల్లీలో మళ్లీ క్షీణించిన వాయు నాణ్యత

- 226కి పడిపోయిన ఎక్యూఐ

న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలో మరోమారు గాలి నాణ్యత క్షీణించింది. శనివారం ఢిల్లీలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఎక్యూఐ) 2226కి పడిపోయింది. దీంతో అక్కడ పొగమంచు కమ్మేయడంతో ఢిల్లీవాసులు శ్వాసకోశ సమస్యల్ని ఎదుర్కొంటున్నారు. ఢిల్లీలోని అక్షరధామ్, ఆనంద్ విహార్ ప్రాంతాల్లో ఎక్యూఐ 334గా నమోదైంది. దీంతో ఆ ప్రాంతాల్లో గాలి నాణ్యత తీవ్రస్థాయిలో పడిపోయినట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి తెలిపింది. ఇక ఎయిమ్స్ ఆసుపత్రి సమీపంలో ఎక్యూఐ 253, ఇండియా గేట్ వద్ద 251 ఎక్యూఐగా నమోదైంది. కాగా, అక్షరధామ్‌లో గత రెండు రోజులుగా కాలుష్యంగా పెరిగింది. దీనివల్ల నివాసితులు బాగా ఇబ్బందులు పడుతున్నారని ఆశిష్ కుమార్ మీనా అనే యువకుడు మీడియాకు తెలిపారు. కాలుష్య నివారణ చర్యల్లో భాగంగా ఢిల్లీలోని ఆప్ ప్రభుత్వం బాణాసంచా వినియోగం, తయారీపై నిషేధం విధించింది.

జార్ఖండ్ డిజిపి తొలగింపునకు ఇసి ఆదేశం

న్యూఢిల్లీ : ప్రస్తుతం డిజిపిగా ఉన్న అనురాగ్ గుప్తాను వెంటనే తొలగించాలని జార్ఖండ్ ప్రభుత్వాన్ని భారత ఎన్నికల సంఘం ఆదేశించింది. అనురాగ్ గుప్తా స్థానంలో క్యాడర్‌లో అందుబాటులో ఉన్న సీరియర్ మోస్ట్ డిజిపి స్థాయి అధికారికి తాత్కాలిక డిజిపి బాధ్యతలు అప్పగించాలని శనివారం ఈసి ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఆదేశాలను సాయంత్రం 7 గంటలలోపు సమర్పించాలని ఇసి రాష్ట్ర ప్రభుత్వానికి తెలిపింది. అలాగే ఐపిఎస్ ఆఫీసర్ల ప్యానల్‌ను అక్టోబర్ 21 ఉదయం 10 గంటలలోపు ప్రభుత్వం సమర్పించాలని ఇసి పేర్కొంది. కాగా, గత ఎన్నికల సమయంలో గుప్తాపై వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా ఆయనపై చర్య తీసుకున్నట్లు ఇసి వెల్లడించింది. 2019 సార్వత్రిక ఎన్నికల సమయంలో జెఎంఎం ఆరోపణల మేరకు ఎడిజి(స్పెషల్ బ్రాంచ్) బాధ్యతల్లో ఉన్న గుప్తాను తొలగించారు. ఆ తర్వాత ఆయనను ఢిల్లీలోని రెసిడెంట్ కమిషనర్ కార్యాలయానికి కేటాయించారు. ఆ రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేవరకు జార్ఖండ్‌కు తిరిగి రాకుండా ఆయనపై నిషేధం విధించారు. అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఎడిజిపిగా ఉన్న గుప్తాపై 2016లో ఛార్జిషీటు కూడా నమోదైంది. 2021లో అవినీతి నిరోధక చట్టం 1988 17 (ఎ) ప్రకారం జార్ఖండ్ ప్రభుత్వం ఆయనపై విచారణకు అనుమతిని మంజూరు చేసింది.

మణిపూర్‌లో కాల్పులు

ఇంఫాల్ : మణిపూర్‌లో జిరిబామ్ జిల్లాలోని ఒక గ్రామంపై తాజాగా సాయుధ మిలిటెంట్లు దాడి చేశారు. శనివారం తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో ఈ హింస చెలరేగిందని ఒక అధికారి తెలిపారు. బోరోబెక్రా పోలీస్ స్టేషన్ పరిసర గ్రామాన్ని లక్ష్యంగా చేసుకుని అధునాతన ఆయుధాలతో కాల్పులు జరిపారని తెలిపారు. సీఆర్‌పీఎఫ్, పోలీసు సిబ్బంది మిలిటెంట్లపై ఎదురుకాల్పులు జరిపారని అధికారి తెలిపారు. ఘటనా స్థలానికి అదనపు భద్రతా బలగాలను తరలిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు ఎలాంటి ప్రాణనష్టం జరగలేదన్నారు. వద్దులు, మహిళలు, చిన్నారులను భద్రతా బలగాలు సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నాయి.

ఇజ్రాయిల్ వైమానిక దాడుల్లో 50 మంది మృతి

- నెతన్యాహు నివాసంపై డ్రోన్ల దాడి

జెరూసలెం: ఇజ్రాయిల్ వైమానిక దాడుల్లో 50 మంది చనిపోయారు. ఇంకా అనేక మంది గాయపడ్డారు. ప్రధాని బెంజిమిన్ నెతన్యాహు ఇంటిని లక్ష్యంగా చేసుకుని దాడి జరిగింది. అయితే ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదని ప్రధాని కార్యాలయం తెలిపింది. తీర ప్రాంత పట్టణమైన సిజేరియాలోని ఇంటిని లక్ష్యంగా చేసుకుని హమాస్ దాడి చేసిందని, ఆ సమయంలో నెతన్యాహు అక్కడ లేరని, ఆయన భార్య సురక్షితంగానే ఉన్నారని తెలిపింది. ఇదిలా వుండగా ఇజ్రాయిల్ దళాలు పాలస్తీనా ఎన్‌క్లేవ్‌లోని ఉత్తర భూ భాగంలోని ఆస్పత్రులపై కాల్పులు జరిపాయి. గడచిన 24 గంటల్లో జరిగిన దాడుల్లో పిల్లలతో సహా 50 మందికిపైగా మరణించినట్లు అధికారులు తెలిపారు.

పోరాట పటిమ పెంపొందించుకోండి

- వ్యూహాత్మక క్షిపణి దళాలను కోరిన జిన్‌పింగ్

బీజింగ్: చైనా వ్యూహాత్మక క్షిపణి దళాలు తమ ప్రతిఘటన, పోరాట పటిమను మరింత పెంపొందించుకోవాలని, పార్టీ, ప్రజలు తమకు అప్పగించిన కర్తవ్యాలను పూర్తిగా నెరవేర్చాలని అధ్యక్షుడు, చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి, సెంట్రల్ మిలిటరీ కమిషన్ చైర్మన్ అయిన సీ జిన్‌పింగ్ కోరారు. ఆయన బీజింగ్‌లోని పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ రాకెట్ ఫోర్స్ బ్రిగేడ్‌ను సందర్శించిన సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేశారు. యాభై ఏళ్ల చరిత్ర కలిగిన వ్యూహాత్మక క్షిపణి దళం నిరంతర శిక్షణ ద్వారా పోరాట పటిమను బలోపేతం చేసుకుంటోందని, పలు ప్రధాన కర్తవ్యాలను సమర్థవంతంగా పూర్తి చేసిందని ఆయన అన్నారు. జిన్‌పింగ్ శిక్షణా క్షేత్రానికి వెళ్లి బ్రిగేడ్ కొత్తగా ప్రవేశపెట్టిన ఆయుధాలు, సామగ్రి, వ్యూహాత్మక సాంకేతిక పని తీరు గురించి తెలుసుకున్నారు. బ్రిగేడ్‌లోని అధికారులు, సైనికులు ఉత్తమ సామర్థ్యాన్ని కలిగి ఉండాలని, పార్టీ, ప్రజల విశ్వాసానికి అనుగుణంగా జీవించాలని ఆయన ఉద్బోధించారు. సాయుధ దళాలపై పార్టీ సంపూర్ణ నాయకత్వాన్ని నిలబెట్టడం, ప్రాథమిక స్థాయిలో పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేయడం తాలూకు ప్రాధాన్యతను ఆయన నొక్కి చెప్పారు.



గురువారం జిన్‌పింగ్ చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ రాకెట్ ఫోర్స్ బ్రిగేడ్‌ను సందర్శిస్తున్న దృశ్యం

అదే సమయంలో జాతీయ వ్యూహాత్మక భద్రత, ప్రధాన ప్రయోజనాలను సమర్థవంతంగా పరిరక్షించడానికి సైనిక శిక్షణను తీవ్రతరం చేయాలని, అన్ని స్థాయిల్లోను పోరాట సంసిద్ధతను మెరుగుపరచుకోడానికి, పోరాట పటిమను పెంపొందించుకోడానికి యత్నించాలని ఆయన కోరారు. తైవాన్ చుట్టూ మిలిటరీ డ్రిల్స్‌ను నిర్వహించిన కొద్ది రోజులకే ఆర్మీ పోరాట సన్నద్ధత గురించి జిన్ పింగ్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

అమెరికా తైవాన్‌లో జోక్యానికి పావులు కదుపుతున్న నేపథ్యంలో తైవాన్ చైనా ప్రాదేశిక సార్వభౌమత్వంలో భాగమని జిన్‌పింగ్ మరోసారి స్పష్టం చేశారు. 1949లో మావో జెడాంగ్ నేతృత్వంలో చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ నిరంకుశ చాంగ్ కే షేక్‌ను ఓడించింది. దీంతో ఆయన తైవాన్ దీవికి పారిపోయాడు. అప్పటి నుంచి తైవాన్‌లో విడిగా పాలన సాగుతున్నా అది తన ప్రాదేశిక సార్వభౌమత్వం పరిధిలోనే ఉందని చైనా పదే పదే స్పష్టం చేస్తూ వస్తోంది.

ఉక్రెయిన్ యుద్ధం కొనసాగింపు, ఇజ్రాయిల్‌కు వత్తాసు

- బెర్లిన్ సమావేశంలో యూరప్ దేశాలను కోరిన బైడెన్

బెర్లిన్: ఉక్రెయిన్ యుద్ధాన్ని కొనసాగించాలని, గాజా, లెబనాన్‌లపై ఇజ్రాయిల్ సాగిస్తున్న దాడులకు ఎప్పటిలానే మద్దతు ఇవ్వాలని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ తన మిత్రదేశాలను కోరారు. శుక్రవారం బెర్లిన్‌లో జరిగిన ఒక రోజు శిఖరాగ్ర సమావేశంలో బైడెన్‌తో బాటు జర్మనీ చాన్స్‌లర్ ఒలాఫ్ షుల్జ్, బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమానియెల్ మాక్రాన్ హాజరయ్యారు. తలుపులు మూసేసి రహస్యంగా జరిపిన చర్చల్లో ఉక్రెయిన్ యుద్ధం, పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ప్రధానంగా ప్రస్తావనకు వచ్చాయి. అమెరికా అధ్యక్ష ఎన్నికలు మరో రెండు వారాల్లో జరగనున్నందున ఉక్రెయిన్‌కు మిలిటరీ మద్దతుకు సంబంధించి అంతరాయమేర్పడవచ్చని, కాబట్టి నాటో మిత్ర దేశాలు తమ మద్దతును కొనసాగించాల్సిన అవసరాన్ని బైడెన్ నొక్కి చెప్పారు. అయితే, . దీర్ఘ శ్రేణి క్షిపణులను ఉక్రెయిన్‌కు సరఫరా చేసే విషయంలో వీటి మధ్య ఏకాభిప్రాయం ఏమీ కుదరలేదు.సందట్లో సడేమియాలా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ బ్రిటన్, ఇతర నాటో నాయకులను ఇక్కడ కలుసుకుని తన విక్టరీ ప్లాన్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. రానున్నది శీతాకాలం, తాము చాలా గడ్డు పరిస్థితి ఎదురవుతోంది. ఈ పరిస్థితుల్లో మమ్మల్ని ఒంటరిగా వదిలేయొద్దు అని ప్రాధేయపడ్డాడు. నవంబరు5న జరిగే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థి ట్రంప్ గనుక గెలిస్తే ఉక్రెయిన్‌కు మిలిటరీ మద్దతు ఆగిపోతుందని జెలెన్స్కీ ఆందోళన చెందుతున్నాడు. పశ్చిమ దేశాలు దీర్ఘ శ్రేణి క్షిపణులను తామకు అప్పగిస్తే రష్యాతో యుద్ధంలో నెగ్గుకొస్తానని చెబుతున్నాడు. అయితే, ఈ ఆయుధాలను ఇవ్వడానికి అమెరికా, బ్రిటన్ అంత సుముఖంగా లేవు.

క్యూబాలో బ్లాకవుట్

హవానా: అమెరికా దశాబ్దాల తరబడి కొనసాగిస్తున్న ఆర్థిక దిగ్బంధనం కారణంగా క్యూబా తన అవసరాలకు తగినంతగా ఇంధనాన్ని కొనుగోలు చేయలేకపోవడం, థర్మో ఎలక్ట్రిక్ ప్లాంట్‌లో వైఫల్యం ఇవన్నీ క్యూబాలో విద్యుత్ బ్లాకవుట్‌కు దారితీశాయి. దీని నుంచి పూర్తిగా రికవరీ కావడానికి ఎక్కువ సమయమే పట్టవచ్చు. నేషనల్ ఎలక్ట్రిక్ సిస్టమ్ (ఎస్ఇఎన్) పునరుద్ధరణ పనులు యుద్ధ ప్రాతిపదికన చేపడుతుండడంతో కొన్ని ప్రాంతాలకు విద్యుత్‌ను అందించగలుగుతున్నారు. శనివారం ఉదయం 6.15 గంటల ప్రాంతంలో నేషనల్ ఎలక్ట్రికల్ సిస్టమ్ పూర్తిగా డిస్‌కనెక్ట్ అయింది. తాము దానిని పునరుద్ధరించే పనిలో ఉన్నామని ప్రభుత్వ యాజమాన్యంలోని ఎలక్ట్రిక్ యూనియన్ (యుఎన్ఇ) సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టింది. దేశంలోని ప్రధాన జనరేటర్లలో ఒకటైన గిటెరాన్ థర్మో ఎలక్ట్రిక్ ప్లాంట్‌లో వైఫల్యం కారణంగా జాతీయ విద్యుత్ వ్యవస్థ కుప్పకూలింది. దీంతో దేశ వ్యాపితంగా అంధకారం ఏర్పడింది. దీంతో ఇంధన అత్యయిక పరిస్థితిని ప్రకటించారు. కొన్ని రోజులుగా విద్యుత్ సరఫరా 50 శాతం వరకు తగ్గింది. ఫలితంగా చాలా కార్యకలాపాలకు అంతరాయమేర్పడింది. క్యూబాకు విదేశీ కరెన్సీ ప్రవాహాన్ని అడ్డుకుంటున్న అమెరికా ఆంక్షల వల్ల నాలుగు దశాబ్దాలుగా నాన్ స్టాప్‌గా పనిచేస్తున్న థర్మో ఎలక్ట్రిక్ ప్లాంట్లలో తరచూ సాంకేతిక వైఫల్యాలు తలెత్తుతున్నాయని, విద్యుత్ బయట నుంచి కొనుగోలు చేయాలంటే విదేశీ మారక నిల్వల సమస్య వెంటాడుతోందని అధ్యక్షుడు మియాజ్ డి కానెల్ తెలిపారు. ఈ సంక్లిష్ట పరిస్థితిని అధిగమించేందుకు అనేక ఫ్లోటింగ్ పవర్ ప్లాంట్లను అద్దెకు తీసుకుంది. తరచూ వచ్చే బ్లాకవుట్‌లు క్యూబా ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి.

అవామీ లీగ్‌ను నిషేధించండి

- తాత్కాలిక ప్రభుత్వంపై ఎల్‌డిపి ఒత్తిడి

ఢాకా: ప్రజల తిరుగుబాటుతో ఉద్వాసనకు గురైన ప్రధాని షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్‌పై నిషేధం విధించాలని మితవాద లిబరల్ డెమొక్రాటిక్ పార్టీ అధ్యక్షుడు కల్నల్ (రిటైర్డ్) ఓలి అహ్మద్ డిమాండ్ చేశారు. తాత్కాలిక ప్రభుత్వంలో చీఫ్ అడ్వయిజర్ ప్రొఫెసర్ మహ్మద్ యూనస్‌ను ఇక్కడి ప్రభుత్వ అతిథి గృహంలో శుక్రవారం కలిసి ఈ మేరకు ఒత్తిడి తెచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, జులై, ఆగస్టు మాసాల్లో తలెత్తిన విద్యార్థి ఉద్యమంపై అవామీలీగ్ ప్రభుత్వం పోలీసు నిర్బంధాన్ని ప్రయోగించి 1500 మందిని పొట్టనబెట్టుకుందని, దేశాన్ని అవినీతి కూపంలోకి నెట్టిందని విమర్శించారు. 1971 బంగ్లా విమోచనా యుద్ధం తర్వాత జమాతేపై నిషేధం విధించారు. దానికి కారణమేమిటి? అదే కారణంతో అవామీ లీగ్‌పై నిషేధం ఎందుకు విధించరు? అని ఆయన మీడియాతో మాట్లాడుతూ అన్నారు.హసీనాకు గట్టి మద్దతుదారులను పనిచేసిన అధికారులపై కేసులు పెట్టాలని కూడా ఎల్‌డిపి నాయకుడు డిమాండ్ చేశారు.

బంగ్లాదేశ్‌లో ఎన్నికలు ఎప్పుడు నిర్వహించేది చీఫ్ అడ్వయిజర్ యూనస్ ఖాన్ నిర్ణయిస్తారని న్యాయ శాఖ సలహాదారు అసిఫ్ నజ్రుల్ వివరణ ఇచ్చారు. 2025లో బంగ్లా పార్లమెంటు ఎన్నికలు ఉంటాయని, ఇందుకు సంబంధించి కొత్త ఎన్నికల కమిషన్, సెర్చ్ కమిటీల ఏర్పాటు చేయాల్సి ఉందని అంతకు ముందు ఓ టివి చానెల్‌కిచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించిన నజ్రుల్ ఆ తర్వాత వెనక్కి తగ్గారు. ఎన్నికల నిర్వహణ అనేది విధాన పరమైన అంశమని, దీనిపై నిర్ణయం తీసుకునే అధికారం చీఫ్ అడ్వయిజర్‌కే ఉందని ఆయన శనివారం తెలిపారు.

ఆదివాసీలపై మోడీ సర్కార్ అణిచివేత

- బిజెపి కనుసన్నల్లో ఇసి, సిబిఐ, ఇడి
- సంవిధాన్ సమ్మాన్ సమ్మేళన్‌లో రాహుల్



రాంచీ : కేంద్రంలోని బిజెపి నేతృత్వ ఎన్‌డిఎ ప్రభుత్వంపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపి రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. జార్ఖండ్ సహా దేశవ్యాప్తంగా ఉన్న ఆదివాసీల పట్ల కేంద్ర ప్రభుత్వం తీవ్రమైన అణిచివేత చర్యలకు పాల్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివాసీలను వనవాసీలుగా బిజెపి పేర్కొంటోందని, దీని వెనుక పెద్ద కుట్ర దాగుందని ఆయన చెప్పారు. రాజ్యాంగ పరిరక్షణ అవశ్యకత కోసం పోరాడాలని పిలుపునిస్తూ రాంచీలో శనివారం నిర్వహించిన 'సంవిధాన్ సమ్మాన్ సమ్మేళన్' సభలో ఆయన ప్రసంగించారు. కేంద్ర ఎన్నికల సంఘం (ఇసి), కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి), ఆదాయ పన్ను శాఖ (ఐటి), న్యాయశాఖ, ప్రభుత్వ యంత్రాంగం (బ్యూరోక్రసీ) ఇలా రాజ్యాంగ వ్యవస్థలన్నిటీని బిజెపి కీలుబొమ్మలుగా చేసుకొని తనకు అనుకూలంగా నియంత్రిస్తోందని రాహుల్ విమర్శించారు. ఇలా భారత రాజ్యాంగంపై అన్ని వైపుల నుంచి దాడి జరుగుతోందని, దానిని రక్షించుకోవాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాపైనా ఆయన ఘాటు విమర్శలు కురిపించారు. రాజ్యాంగంపై నిరంతరం జరుగుతున్న దాడిలో మోడీ, అమిత్ షా కూడా ఉన్నారని తెలిపారు. వీరి నుంచి రాజ్యాంగాన్ని రక్షించుకోవాలని పిలుపునిచ్చారు.

మోడీ సర్కార్ ఆదివాసీలపై వివక్ష చూపిస్తోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. 'అయోధ్య రామమందిర ప్రారంభోత్సవానికి ప్రముఖ పారిశ్రామికవేత్తలను ఆహ్వానించిన మోడీ సర్కార్, రాష్ట్రపతి ద్రౌపది ముర్మును మాత్రం ఆహ్వానించలేదు. ఎందుకంటే ఆమె ఒక ఆదివాసి కావడమే' అని రాహుల్ గాంధీ అన్నారు. 'ఆదివాసీ'లను బిజెపి 'వనవాసీ'లుగా పేర్కొంటోందని, దీని వెనుకే దాని నైజం దాగుందన్నారు. 'ఆదివాసి అంటే మొదటి నుంచి ఉన్నవారు అని అర్థం. వనవాసి అంటే అటవీ ప్రాంతంలో జీవించేవారు అని అర్థం. ఈ విధంగా ఎంతో ఘనత కలిగిన ఆదివాసీల వారసత్వం, చరిత్ర, సంప్రదాయాలు, వైద్య విధానాలను ధ్వంసం చేసేందుకు బిజెపి ప్రయత్నిస్తోంది' అని చెప్పారు. కుల గణనను, రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం పరిమితిని తొలగించడాన్ని ఏ శక్తీ అడ్డుకోలేదని రాహుల్ గాంధీ అన్నారు.

20 లీటర్ల నీటి బాటిళ్లు, సైకిళ్లపై జిఎస్‌టి తగ్గింపునకు ఉపసంఘం ప్రతిపాదన



న్యూఢిల్లీ : పలు ఉత్పత్తులపై వస్తు సేవల పన్ను (జిఎస్‌టి)ల్లో మార్పులు చేస్తూ మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. 20 లీటర్ల ప్యాకేజ్డ్ నీటి బాటిళ్లు, సైకిళ్లు, నోట్‌బుక్స్ తదితర ఉత్పత్తులపై ఎట్టకేలకు జిఎస్‌టిని తగ్గించాలని ప్రతిపాదించింది. బీహార్ డిప్యూటీ సిఎం సామ్రాట్ చౌదరి నేతృత్వంలో జరిగిన మంత్రివర్గ ఉపసంఘం భేటీలో పలు నిర్ణయాలు తీసుకుంది. శనివారం జరిగిన మంత్రివర్గ ఉపసంఘం చేసిన ప్రతిపాదిత వివరాలు.. ప్రస్తుతం 20 లీటర్ల నీటి బాటిల్‌పై 18 శాతం జిఎస్‌టిని వసూలు చేస్తుండగా.. దీన్ని 5 శాతానికి తగ్గించాలని, అదేవిధంగా రూ.10,000లోపు ధర కలిగిన సైకిళ్లపై 12 శాతంగా ఉన్న పన్నును కూడా 5 శాతానికి తగ్గించాలని ప్రతిపాదించింది. అలాగే నోట్ బుక్స్‌పైనా 12 నుంచి ఐదు శాతానికి తగ్గించాలని సూచించింది. మరోవైపు ఖరీదైన బూట్లు, చేతి వాచీలపై పన్ను రేట్లు సవరించాలని, రూ.15,000 కంటే అధిక విలువ కలిగిన బూట్లు, రూ.25 వేల కంటే ఎక్కువ ధర ఉన్న చేతి వాచ్‌లపై జిఎస్‌టిని 18 నుంచి 28 శాతానికి పెంచాలని ప్రతిపాదించింది. 18 శాతం శ్లాబులో ఉన్న హెయిర్ డ్రైయర్లు, హెయిర్ కర్టర్లు, బ్యూటీ, మేకప్ సామగ్రిపై ఉన్న జిఎస్‌టిని మళ్లీ 28 శాతం శ్లాబులోకి చేర్చాలని పేర్కొంది. ఈ పన్ను రేట్లపై జిఎస్‌టి కౌన్సిల్ భేటీలో తుది నిర్ణయం చేయాల్సివుంది. అలాగే బీమాపై వసూలు చేస్తోన్న 18 శాతం జిఎస్‌టి పన్ను భారంపై తీవ్ర విమర్శలు వస్తున్న నేపథ్యంలో జిఎస్‌టి నుంచి ఆరోగ్య బీమా, జీవిత పాలసీలను మినహాయించాలని ఉపసంఘం ప్రతిపాదించింది. టర్మ్ ఇన్సూరెన్స్‌తో పాటు రూ.5 లక్షల వరకు తీసుకునే ఆరోగ్య బీమాపై జిఎస్‌టి నుంచి మినహాయించాలని సూచించింది.

రాజధానికి మళ్లీ ప్రాణప్రతిష్ట

(మొదటి పేజీ తరువాయి)

ఎక్స్‌ఎల్‌ఆర్‌ఐ యూనివర్శిటీ, లా స్కూలు కూడా వస్తుందని తెలిపారు. దేశంలో టాప్-10 విద్యా సంస్థల బ్రాంచిలన్నీ ఇక్కడకు రావాలని సిఎం కోరారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, అమరావతి మీదుగా బుల్లెట్ రైలు మంజూరు చేయాలని కేంద్రాన్ని కోరినట్లు తెలిపారు. రాజధానిలో తలపెట్టిన పనులన్నీ మూడేళ్లలో పూర్తి చేయాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు.

420లకు నా విజన్ అర్థం కాదు

అమరావతిని సుందరనగరంగా తీర్చిదిద్దుతా మని, వంశధార, గోదావరి, కృష్ణా, పెన్నా నదులను అనుసంధానం చేస్తామని చంద్రబాబు చెప్పారు. గతంలో 2020 అంటే 420 అని హేళన చేశారని, అదే ఇప్పుడు దిక్కయిందని, రాష్ట్రంలో గతంలో పాలన చేసి సర్వనాశనం చేసిన 420లకు తన విజన్ అర్థం కాదని అన్నారు. గత ఐదేళ్లలో ఎవరు ఎప్పుడు వచ్చి దోచుకుంటారో తెలియక భయంతో బతికారని, ఇప్పుడు స్వేచ్ఛగా, ఆనందంగా ఉంటున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర భవిష్యత్ కాపాడుకోవాలని నిర్ణయం తీసుకున్నామని, అందులో భాగంగానే టిడిపి, జనసేన, బిజెపి కలిసి పోటీచేశాయని తెలిపారు. రాష్ట్రం నుండి భూతం పోయిందని, ఏమరపాటుగా ఉండకుండా ఆ భూతాన్ని శాశ్వతంగా దూరం చేయాలని ముఖ్యమంత్రి అన్నారు. అమరావతి పనుల శంకుస్థాపనపై ముఖ్యమంత్రి రైజెస్ ఎగైన్ అంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు. నిజం, న్యాయం, త్యాగం, సంకల్పం ఉన్న అమరావతే గెలుస్తుందని, నిలుస్తుందని ఈ పోస్టులో పేర్కొన్నారు.

మాటల్లోనే రైతుల సంక్షేమం

(మొదటి పేజీ తరువాయి)

టిడిపి కూటమి హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఆ పార్టీల నాయకులు వాటిని విస్మరించి మద్యం షాపులు, ఇసుక అక్రమ రవాణా తదితర పనుల్లో ఉండడం సిగ్గుచేటన్నారు. అనంతపురం జిల్లా సస్యశ్యామలం కావాలంటే సాగునీటి కాలువలను పూర్తి స్థాయిలో మరమ్మతు చేయాల్సి ఉందని తెలిపారు. హంద్రీనీవా నీటితో అన్ని చెరువులనూ నింపి సాగు, తాగునీటి సమస్యలు తీర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాలరంగయ్య, వి.సావిత్రి, జిల్లా కమిటీ సభ్యులు కృష్ణమూర్తి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జార్ఖండ్‌లో ఇండియా బ్లాక్ సీట్ల సర్దుబాటు

(మొదటి పేజీ తరువాయి)

పెరిగిందని, అందువల్ల సాధ్యమైనన్ని ఎక్కువ స్థానాల్లో పోటీ చేసేందుకు వీలుకల్పించాలని ఆర్‌జెడి కోరుతోంది. ప్రస్తుతం సిపిఐ-ఎంఎల్ పక్షాన బగోదార్ స్థానం నుంచి వినోద్ కుమార్ సింగ్ శాసనసభకు ప్రాతినిధ్యం వహిస్తూ హేమంత్ సోరేన్ ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్నారు. సిపిఐ-ఎంఎల్‌లో ఇటీవల మార్క్సిస్టు కోఆర్డినేషన్ కమిటీ (ఎంసిసి) విలీనం అయ్యింది. ఈ నేపథ్యంలో వామపక్ష ప్రజాబలం కూడా పుంజుకుంది. కాగా ఎన్‌డిఎ ఇప్పటికే సీట్ల సర్దుబాటుపై ప్రకటన చేసింది. 68 స్థానాల్లో బిజెపి, ఎజెఎస్‌యు 10 స్థానాల్లో, జెడియు 2 స్థానాల్లో, అలాగే చిరాగ్ పాశ్వన్ నేతృత్వంలోని లోక్ జనశక్తి పార్టీ (రాంవిలాస్) ఒక్క స్థానంలో పోటీ చేస్తాయని ఎన్‌డిఎ ప్రకటించింది.

లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపి రాహుల్ గాంధీ, బీహార్ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు, ఆర్‌జెడి నేత తేజస్వీ యాదవ్ ముఖ్యమంత్రి సోరెన్‌తో విడివిడిగా కలిటిస చర్చించారు. రాంఛీలో సంవిధాన్ సమ్మాన్ సమేళనంలో పాల్గొనేందుకు రాహుల్ విచ్చేసిన సందర్భంగా సోరెన్‌ను కలుసుకొని సీట్ల సర్దుబాటుపై చర్చలు జరిపినట్లు తెలిసింది. వీరితో భేటీల అనంతరం జార్ఖండ్ కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జి గులాం అహ్మద్ మిర్‌తో కలిసి సోరేన్ మీడియాతో మాట్లాడారు. దీనిపై విలేకర్లు అడిగిన ప్రశ్నలకు ఆయన స్పందిస్తూ 'ప్రస్తుతానికి సీట్ల సర్దుబాటు కుదిరింది. నిర్ధిష్ట స్థానాలకు సంబంధించిన ఇతర వివరాలను త్వరలోనే వెల్లడిస్తాం. ఇండియా బ్లాక్‌లోని ఇతర అన్ని పక్షాలతోనూ పూర్తి స్థాయి సంప్రదింపులు జరగాల్సివుంది. అవి పూర్తి అయిన తర్వాత నిర్ధిష్ట వివరాలు తెలియజేస్తాం' అని ఆయన చెప్పారు.



మీకోసం

శీతాకాలంలో పిల్లల మసాజ్‌కు ఆవనూనె వాడాలి. ఇది ఒంటికి సహజంగా వేడినివ్వడంతోపాటు ర్యాష్ వంటి చర్మ సమస్యలను కూడా దూరం చేస్తుంది. ఆవనూనె సాధ్యం కానప్పుడు వెన్న, మీగడలతో కూడా మసాజ్ చేయవచ్చు.

జీవన సౌరభం

వెలిగే దీపమే ఇతర దీపాలను వెలిగించినట్లు నిరంతరం నేర్చుకునే వారే ఇతరులకు జ్ఞానాన్ని పంచగలరు.

శరదృతువు



కారుమబ్బులు పోయాయి
ఉరుములు మెరుపులు తగ్గాయి
వానలు విరామమిచ్చాయి
వాగులు జలాలు ఆగాయి
కొండలు గుట్టలు మెరిశాయి
పచ్చని అందం చూపాయి
తెల్లని మబ్బులు వెలిశాయి
నింగికి బొమ్మలు అద్దాయి
వేగిస పూలు పూశాయి
బంగరు రంగులు చిమ్మాయి
వెన్నెల రాత్రులు వచ్చాయి
వెండి పూతతో వెలిగాయి
శరత్కాలము వచ్చింది
సరదా కాలం తెచ్చింది

– బెలగాం భీమేశ్వరరావు,
99895 37835.



తమాషా చూడండి

పిల్లలూ, ఇక్కడ కొన్ని తెలుగు పదాలను అడ్డంగా, నిలువుగా రాశాం. ఎటూ చదివినా అవే పదాలు వస్తాయి. అయితే కింది పదాల్లో ఉన్న ఖాళీ గడుల్లో మీరే సరైన అక్షరాలు రాయాలి మరి. ఉదాహరణకు ఒకటి ఇచ్చాం.

కో వె ల	ది న –	చ దు –
వె న్నె ల	– గ రి	– ర ద
ల ల న	ము – కి	వు – కం
మ – సు	టో – రా	ప్ర – శం
– య నం	– వ్వ ము	వే ది –
సు నం –	రా ము –	– క రం

నేను గీసిన బొమ్మ





బి.నితిన్ చరణ్ గౌడ్,
8వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
రాంపూర్, మెదక్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

భారత తొలి ఫార్ములా 4 కార్ రేసర్

అమ్మాయిలు ఈ పని చేయలేరు.. ఇది మగవాళ్ల పని.. అన్న మాటలు ప్రతి ఆడపిల్ల ఏదో ఒక సందర్భంలో ఎదుర్కొనే ఉంటుంది. అయితే ఆ మాటలనే తమ ఎదుగుదలకు సోపానాలుగా చేసుకునే వారు మాత్రం చాలా తక్కువ మందే కనిపిస్తారు. అలాంటి వారిలో ఒకరే శ్రియా లోహియా. బొమ్మ కార్లతో ఆడుకునే వయసులోనే కార్ రేసింగ్‌పై మక్కువ పెంచుకుంది శ్రియ. ఆ ఇష్టం ఇప్పుడు ఆమెని భారత మొట్టమొదటి ఫార్ములా 4 కారు రేసర్‌గా నిలిపింది. హిమాచల్‌ప్రదేశ్‌కి చెందిన శ్రియ ఉన్నత కుటుంబంలో పుట్టింది. తల్లి వ్యాపారవేత్త కాగా, తండ్రి, సోదరి క్రీడారంగంలో ప్రతిభ చూపుతున్నారు. శ్రియ కూడా వారిలాగే, వ్యాపారరంగంలోనో, క్రీడల్లోనో రాణిస్తుంటే పెద్దగా చెప్పుకునేవాళ్లం కాదు. అదే ఆమెని ప్రత్యేకంగా నిలిపింది. రేసర్‌గా ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తున్న ఆమె ప్రయాణం గురించి తెలుసుకుందాం.



తొమ్మిదేళ్ల వయసు నుండే శ్రియ, కార్ రేసింగ్‌లో శిక్షణ తీసుకోవడం మొదలుపెట్టింది. 'మా కుటుంబంలో నేనే మొట్టమొదటి కార్ రేసర్‌ని. నాన్న రితేష్ క్రీడాకారుడు. అక్క షూటర్‌గా రాణిస్తోంది. క్రీడాకారుల కుటుంబం అయినప్పటికీ నేను ఎంచుకున్న రంగం పూర్తి భిన్నమైంది. దీంతో ప్రతి ఒక్కటి కొత్తగా నేర్చుకున్నాను. కుటుంబం చాలా మద్దతుగా నిలిచింది. అయితే ఒక పక్క చదువు, రేసింగ్ బ్యాలెన్స్ చేసుకోవడం చాలా కష్టంగా అనిపించేది' అంటున్న శ్రియ 11వ తరగతి చదివేటప్పటికి 16 ఏళ్లు వచ్చాయి. ఆ సమయంలో స్కూలుకు వెళ్లడం, రేసింగ్ శిక్షణ, పోటీల్లో పాల్గొనడం పెద్ద సవాలుగా మారింది. ముఖ్యంగా పురుషాధిక్యత ఎక్కువగా గల రేసింగ్‌లో ఆమె ఎన్నో అవమానాలు కూడా ఎదుర్కొంది.

'శిక్షణలో భాగంగా ట్రాక్‌పై ఏదైనా తప్పుచేస్తే 'ఆమె అమ్మాయి.. ఇది ఆమె తాగే టీ కప్పు కాదు' అని కామెంట్లు చేసేవారు. అయితే అవేమీ నా లక్ష్యాన్ని చెదరనీయలేదు. ఆ అవమానాలనే స్ఫూర్తిగా తీసుకుని ఒక్కో మెట్టు పైకిఎదిగాను. వారి ఆలోచనలు తప్పని నిరూపించాను' అంటోంది శ్రియ.

చిన్న వయసులోనే రేసింగ్‌లో అడుగుపెట్టిన శ్రియ, 11 ఏళ్లు వచ్చేసరికి పోటీల్లో పాల్గొనే స్థాయికి వెళ్లింది. 2019లో జరిగిన జమ్మూ కాశ్మీర్ టైర్ నేషనల్ కార్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచింది. అప్పుడు తను ఆరో తరగతి చదువుతోంది. నిర్దేశించిన లక్ష్యాన్ని కేవలం 11 నిమిషాల 13.233 సెకన్లలో చేరుకుంది. అంతకు ముందే అంటే తనకి పదేళ్లప్పుడే 2018లో అవుట్ స్టాండింగ్ వుమెన్ మోటార్‌స్పోర్ట్స్ కేటగిరీలో ఎఫ్‌ఎంఎస్‌సిఐ అవార్డు గెలుచుకుంది.

2022లో ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార అవార్డు కూడా శ్రియ ఖాతాలో ఉంది. భారత్‌లో మోటార్ స్పోర్ట్స్ క్రీడను ఉన్నత శిఖరాలు తీసుకెళ్లడమే నా లక్ష్యం అంటోన్న శ్రియ ఫార్ములా 1 రేసర్‌గా రాణించాలని కలలు కంటోంది. అయితే రేసర్ రంగంలో అమ్మాయిల సంఖ్య చాలా తక్కువగా ఉందని, తగినంత ప్రోత్సాహం లేదని బాధపడుతోంది.

'చాలా మంది అమ్మాయిలు రేసర్లుగా రావడానికి భయపడతారు. వేగంగా కారు నడపడం ఆషామాషీ కాదు. కానీ పట్టుదలగా ప్రయత్నిస్తే ఈ రంగంలో రాణించవచ్చు. పైగా ఎంత ప్రతిభ చూపుతున్నా ప్రతిభని బట్టి ఆమెకి గౌరవం దక్కడం లేదు.

'వుమెన్ రేసర్' అని పిలిపించుకోవడం నాకు ఇష్టం లేదు. నా ప్రతిభను చూసి నన్ను గౌరవించాలనుకుంటాను. నేను ఒక 'రేసర్'ని అంతే..' అంటోన్న శ్రియ ఎంతోమంది యువతకు గొప్ప స్ఫూర్తి కదూ!



జుట్టు సంరక్షణ ఇలా..

వాతావరణ ప్రభావం వల్ల చాలామందికి చుండ్రు, వెంట్రుకలు రాలిపోవడం జరగుతుంది. కొన్ని జాగ్రత్తలు పాటించి ఈ సమస్య నుంచి ఎలా బయటపడవచ్చో తెలుసుకుందాం.

ఉసిరి : జుట్టు రాలే సమస్యతో పాటు చుండ్రుని నివారించడంలో ఉసిరి ఎంతో మేలు చేస్తుంది. ఎండబెట్టిన ఉసిరికాయలను కొబ్బరినూనెలో వేసి వేడి చేయాలి. అది చల్లారాక జుట్టుకు మర్దన చేసుకోవాలి. దీని వల్ల మంచి ఫలితం ఉంటుంది.

కొబ్బరి పాలతో మసాజ్ : పచ్చి కొబ్బరిని తురిమి, మిక్సీలో వేసి గ్రైండ్ చేసి పాలు తీయాలి.



ఈ పాల మిశ్రమాన్ని తలకు, జుట్టంతా పట్టించి మసాజ్ చేయాలి. 15–20 నిమిషాల పాటు అలాగే ఉంచాలి. తర్వాత నీటితో స్నానం చేయాలి. దీనివల్ల జుట్టు మృదువుగా, కాంతివంతంగా మారుతుంది. జుట్టురాలడం, పొడి బారడం, తలంతా దురదపెట్టడం వంటి సమస్యలూ తలెత్తవు.

పెరుగు, నిమ్మ : ఇంట్లో ఎప్పుడూ అందుబాటులో వుండే పెరుగు, నిమ్మకాయలు జుట్టుకు ఎంతో మేలు చేస్తాయి. ఒక కప్పు పెరుగులో కాస్త నిమ్మరసం కలపాలి. ఈ మిశ్రమాన్ని తలకు పట్టించాలి. అరగంట తర్వాత షాంపూతో కడిగివేయాలి. నిమ్మరసం చుండ్రును తగ్గించటానికి, పెరుగు జుట్టు మృదుత్వం, మెరుపుదనం కోసం చక్కగా ఉపయోగపడతాయి.

తేనె ఆలివ్ ఆయిల్ మసాజ్ : ఒక గిన్నెలో తేనె, ఆలివ్ నూనెలను సమపాళ్లల్లో పోయాలి. ఇందులో కాస్త దాల్చిన చెక్క పొడి వేయాలి. ఈ మిశ్రమాన్ని క్రమం తప్పకుండా జుట్టుకు అప్లై చేస్తూ ఉంటే జుట్టు ఆరోగ్యంగా తయారవుతుంది.

కలబంద రసం : కలబంద రసం (అలోవెర జెల్) సహజసిద్ధమైన హెయిర్ కండీషనర్‌గా పని చేస్తుంది. దీనిని జుట్టుకు, తలకు బాగా పట్టించి కొద్దిసేపయ్యాక తలస్నానం చేస్తే హెయిర్ ఫోలిసెల్స్ ఓపెన్ అవుతాయి. అవి జుట్టును బాగా సంరక్షిస్తాయి.



జయం రవి హీరోగా కొత్త సినిమా

కోలీవుడ్ నటుడు జయం రవి హీరోగా కొత్త సినిమా తెరకెక్కనుంది. ఆయన వరుసగా చిత్రాలు చేసుకుంటూ పోతున్నారు. తాజా చిత్రం 'బ్రదర్' దీపావళికి తెరపైకి రానుంది. ఈ చిత్రం తెలుగులో కూడా విడుదల కానుంది. ప్రస్తుతం సినీ, కాథలిక్క నేరమిల్లై చిత్రాలతోపాటు మరికొన్ని చిత్రాలు ఆయన చేతిలో ఉన్నాయి. తాజాగా మరో చిత్రానికి ఆయన గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో నటించటానికి పచ్చజెండా ఊపినట్లుగా సమాచారం. కార్తీక్ సుబ్బరాజు ప్రస్తుతం నటుడు సూర్య కథానాయకుడిగా 44వ చిత్రాన్ని తెరకెక్కిస్తు న్నారు. పూజాహెగ్డే నాయకిగా నటిస్తున్నారు. 2 డీ ఎంటర్‌టైన్‌మెంట్, స్టోన్ బెంచ్ స్టూడియోస్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నాయి. పూర్తి యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రం షూటింగ్‌ను పూర్తిచేసుకుంది. సంతోష్ నారాయణన్ సంగీతాన్ని అందిస్తున్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది వేసవికి తెరపైకి రానుందని సమాచారం. ఇది పూర్తయిన తర్వాత జయంరవి హీరోగా చిత్రం చేయటానికి కార్తీక్ సుబ్బరాజ్ సన్నాహాలు చేస్తారని సమాచారం. తన సొంత స్టోన్ బెంచ్ స్టూడియోస్ పతాకంపై స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే వెలువడే అవకాశం ఉంది.

సన్నీడియోల్ సినిమా 'జాట్'



గోపీచంద్ మలినేని దర్శకత్వంలో సన్నీ డియోల్ హీరోగా చేస్తున్న సినిమా టైటిల్ వచ్చేసింది. శనివారం సన్నీ డియోల్ పుట్టిన రోజు సందర్భంగా ఈ మూవీ నుంచి ఫస్ట్ లుక్‌తో పాటు టైటిల్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ సినిమాకు జాట్ అని టైటిల్ పెట్టినట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంయుక్తంగా తెరకెక్కిస్తు న్నాయి. రణ్‌దీప్ హుడా ఈ సినిమాలో విలన్‌గా నటిస్తుండగా.. ఎస్ థమన్ సంగీతం అందిస్తున్నా రు. కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా వస్తోన్న ఈ చిత్రంతో గోపీచంద్ మలినేని బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తున్నారు.

'శంబాల'తో ఆది సాయికుమార్




ఆది సాయికుమార్ నటిస్తున్న కొత్త ప్రాజెక్టుకి తాజాగా టైటిల్ ఎనౌన్స్‌మెంట్ పోస్టర్‌ను మేకర్స్ లాంచ్ చేశారు. 'శంబాల' పేరుతో ఈ చిత్రం రానుంది. ఆనంది ఈ సినిమాలో ఆదికి జోడీగా నటిస్తున్నారు. ప్రస్తుతం ప్రొడక్షన్ స్టేజ్‌లో ఉన్న ఈ సినిమా అతి త్వరలో ఆడియన్స్ ముందుకు రానుంది. అమెరికాలోని న్యూయార్క్ ఫిలిం అకాడమీలో ఫిలిం మేకింగ్ ట్రైనింగ్ తీసుకున్న యుగంధర్, ఈ సినిమాను హాలీవుడ్ స్థాయిలో హై టెక్నికల్ స్టాండర్డ్స్‌తో, గ్రాండ్ విజువల్స్‌తో రూపొందిస్తున్నారు. రాజశేఖర్ అన్నభీమోజు , మహిధర్ రెడ్డి నిర్మాతలు. శ్రీరామ్ మద్దూరి సంగీతమందిస్తున్నారు.

'మాయాలోకం' విజువల్స్ మెస్మరైజ్



'మాయాలోకం' ర్యాంప్ వీడియో ఆల్బమ్‌ను స్టార్ సినిమాటోగ్రాఫర్ చోటా కె.నాయుడు శనివారం విడుదల చేశారు. అనంతరం ఆల్బమ్ తయారుచేసిన బృందానికి ఆయన బెస్ట్ విషెస్ తెలిపారు. ఈ సందర్భంగా చోటా కె.నాయుడు మాట్లాడుతూ 'మాయాలోకం' విజువల్స్ మెస్మరైజింగ్‌గా ఉన్నాయి. మిస్టర్ రాకి ఫెర్ఫార్మెన్స్ విజువల్స్ మెస్మరైజింగ్ ఉన్నాయి' అని అభినందించారు. మిస్టర్ రాకి లిరిక్స్ అండ్ ర్యాప్ సమకూర్చగా జెహెచ్‌ఎల్‌టి నిర్మించారు. స్వాతి–విజ్జుముదిరాజ్‌ల కాన్సెప్ట్‌తో హై స్టాండర్డ్స్‌తో తెరకెక్కిన ఈ వీడియో ఆల్బమ్‌కు అసిస్టెంట్ కెమెరామెన్ మాదాసు డేనియల్. హెయిర్ అండ్ మేకప్ బగ్స్ బన్నీ, కాస్ట్యూమ్స్ మిస్టర్ రాకి, మ్యూజిక్ అండ్ మాస్టరింగ్ మార్క్ ప్రశాంత్ మ్యూజిక్, డిపిఒ ఫల్గుణ బెజవాణి, ఎడిటింగ్ బెజవాడ, ఎడిటింగ్ డిఐ శశికుమార్ చిట్లూరి.



'కెసిఆర్..' ట్రైలర్ విడుదల

బుల్లితెర నటుడు రాకేశ్ కథానాయకుడిగా నటిస్తూ.. నిర్మిస్తున్న తాజా చిత్రం 'కేసీఆర్' (కేశవ చంద్ర రమావత్). ఈ సినిమాకు 'గరుడ వేగ' అంజి దర్శకత్వం వహిస్తున్నారు. తెలంగాణ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా రానుంది. తాజాగా ఈ సినిమా నుంచి మేకర్స్ ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సినిమా విడుదల తేదీని త్వరలోనే ప్రకటించనున్నట్లు చిత్రబృందం తెలిపింది. చరణ్ అర్జున్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాకు గోరేటి వెంకన్నతో పాటు కాసర్ల శ్యామ్ లిరిక్స్ అందిస్తున్నారు. తనికెళ్ల భరణి, తాగుబోతు రమేష్, కృష్ణ భగవాన్, ధనరాజ్ తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

గెలిచేదెవరో...?

- న్యూజిలాండ్ లక్ష్యం 107పరుగులు
- సర్ఫరాజ్ సెంచరీ, పంత్‌కు చేజారిన శతకం



సర్ఫరాజ్-పంత్ 177పరుగుల భాగస్వామ్యం

బెంగళూరు: చిన్నస్వామి స్టేడియంలో భారత్–న్యూజిలాండ్ జట్ల మధ్య జరుగుతున్న తొలిటెస్ట్ ఫలితం తేలనుంది. భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 462పరుగులకు ఆలౌట్ కావడంతో న్యూజిలాండ్ జట్టు ముందు 107పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. సర్ఫరాజ్ ఖాన్(150) భారీ శతకానికి తోడు వికెట్ కీపర్ రిషభ్ పంత్(99) ఒక్క పరుగు చేరువలో ఔటయ్యాడు. వీరిద్దరు ఔటయ్యాక టీమిండియా వరుసగా వికెట్లను కోల్పోయింది. న్యూజిలాండ్ పేసర్లు విలియం ఓ రూర్కీ(4/92), మ్యాట్ హెన్రీ(3/102), విజృంభణతో టీ సెషన్ తర్వాత 462 పరుగులకే రోహిత్ సేన కుప్పకూలింది. అనంతరం న్యూజిలాండ్ ఇన్నింగ్స్ ఆరంభించి ఒక్క ఓవర్ కాకముందే అంపైర్లు ఆటను నిలిపివేశారు. స్టేడియం మీద దట్టమైన నల్లని మేఘాలు కమ్ముకోవడంతో.. వర్ష సూచన, వెలుతురు లేమి కారణాలతో మ్యాచ్‌ను ఆపేశారు.

ఓవర్‌నైట్ స్కోర్ 3వికెట్ల నష్టానికి 231పరుగులతో నాలుగో రోజు ఆటను కొనసాగించిన భారత్‌ను సర్ఫరాజ్–రిషభ్ పంత్ సుడిగాలి ఇన్నింగ్స్‌తో కివీస్ బౌలర్లకు ముచ్చెమటలు పట్టించారు. 150 పరుగులు చేసిన సర్ఫరాజ్‌ను సౌథీ వెనక్కి పంపాడు. వీరిద్దరూ 4వ వికెట్‌కు 177పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. టీ సెషన్‌కు ముందు విలియం ఓ రూర్కే వికెట్ల వేటకు తెర తీశాడు. సెంచరీకి ఒక్క పరుగు దూరంలో ఉన్న పంత్‌ను బౌల్డ్ చేశాడు. జట్టు స్కోర్ 408పరుగుల వద్ద సర్ఫరాజ్ ఔట్ కాగా.. మరో 54పరుగుల వ్యత్యాసంలో చివరి ఆరు వికెట్లను టీమిండియా చేజార్చుకుంది. కేఎల్ రాహుల్(12), రవీంద్ర జడేజా(5) వికెట్ సాధించి భారత్‌ను ఒత్తిడిలోకి నెట్టాడు. మరోవైపు హెన్రీ అశ్విన్(15), బుమ్రా(0), సిరాజ్(0)లను వెనక్కి పంపి భారత ఇన్నింగ్స్‌కు తెరదించాడు. చివరిరోజైన ఆదివారం తొలి టెస్ట్ ఫలితం రానుంది. 107పరుగుల లక్ష్యాన్ని ఛేదిస్తే న్యూజిలాండ్, ఈలోపు కివీస్‌ను ఆలౌట్ చేస్తే టీమిండి యాకు విజయం దక్కనుంది.

ఒక్క పరుగు దగ్గర్లో పంత్ సెంచరీ మిస్..

టీమిండియా వికెట్ కీపర్ రిషభ్ పంత్ సెంచరీకి ఒక్క పరుగు ముందు ఔటయ్యాడు. న్యూజిలాండ్ బౌలర్లకు చుక్కలు చూపించిన పంత్ అనూహ్యంగా 99 వద్ద బౌల్డయ్యాడు. విలియం ఓరూర్కీ బౌలింగ్‌లో బంతిని డిఫెన్స్ చేయగా.. అది ఎడ్జ్ తీసుకొని లెగ్ స్టంప్స్‌కు తాకింది. సుదీర్ఘ ఫార్మాట్‌లో పంత్ ఇలా 90ల్లో ఔట్ కావడం ఇది ఏడోసారి. అంతకుముందు సచిన్ టెండూల్కర్ 90ల్లో 10 సార్లు ఔటయ్యాడు. 'ది వాల్'గా పేరొందిన రాహుల్ ద్రవిడ్ 9 పర్యాయాలు 90ల్లో వికెట్ పారేసుకొని రెండో స్థానంలో నిలవగా.. పంత్ మూడో స్థానంలో ఉన్నాడు.

స్కోర్‌బోర్డు...

ఇండియా తొలి ఇన్నింగ్స్ : 46ఆలౌట్

న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్ : 402ఆలౌట్

ఇండియా రెండో ఇన్నింగ్స్ : జైస్వాల్ (సి)బ్లండెల్ (బి)అజాజ్ పటేల్ 35, రోహిత్ (బి)అజాజ్ పటేల్ 52, కోహ్లి (సి)బ్లండెల్ (బి)ఫిలిప్స్ 70, సర్ఫరాజ్ (సి)అజాజ్ పటేల్ (బి)సోథీ 150, పంత్ (సి)విలియమ్ (బి)ఓరూర్కే 99, కెఎల్ రాహుల్ (సి)బ్లండెల్ (బి)ఓరూర్కే 12, జడేజా (సి)యంగ్ (బి)ఓరూర్కే 5, అశ్విన్ (ఎల్‌బి)హెన్రీ 15, కుల్దీప్ (నాటౌట్) 6, బుమ్రా (సి)బ్లండెల్ (బి)హెన్రీ 0, సిరాజ్ (సి)సోథీ (బి)హెన్రీ 0, అదనం 18, (99.3ఓవర్లలో ఆలౌట్) 462పరుగులు. **వికెట్ల పతనం:** 1/72, 2/95, 3/231, 4/433, 5/433, 6/438, 7/441, 8/458, 9/462, 10/462 **బౌలింగ్:** సోథీ 15–2–53–1, హెన్రీ 24.3–3–102–3, ఓరూర్కే 21–4–92–4, అజాజ్ 18–3–100–2, ఫిలిప్స్ 15–2–69–1, రవీంద్ర 6–0–39–0

ఆంధ్ర 137/5

గుజరాత్‌తో రంజీట్రోఫీ మ్యాచ్

అహ్మదాబాద్: గుజరాత్‌తో అహ్మదాబాద్ వేదికగా జరుగుతున్న రంజీట్రోఫీ లీగ్ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు పోరాడుతుంది. వికెట్ కీపర్, టీమిండియా బ్యాటర్ శ్రీకర్ భరత్(78; 12ఫోర్లు, 2సిక్సర్లు)కి తోడు నితీశ్ కుమార్ రెడ్డి(34) బ్యాటింగ్‌లో రాణించారు. దీంతో రంజీట్రోఫీ ఎలైట్ గ్రూప్–బిలో ఆంధ్ర జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 137పరుగులకు 5వికెట్లు కోల్పోయింది. గుజరాత్ కంటే ఇంకా 230పరుగులు వెనుకబడి ఉంది. క్రీజ్‌లో శ్రీకర్ భరత్, నితీశ్ కుమార్ రెడ్డి ఉన్నారు. అంతకుముందు గుజరాత్ లోయర్ ఆర్డర్ బ్యాటర్ అర్జాన్ నాగస్వాల్లా(82) మెరుపు బ్యాటింగ్‌తో చెలరేగడంతో ఆ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 367పరుగులు చేసింది. ఆంధ్ర బౌలర్లు సత్యనారాయణ రాజు, లలిత్ మోహన్‌కు మూడేసి, త్రిపురాణ విజయ్‌కు రెండు వికెట్లు దక్కాయి.

ఇక డెహ్రాడూన్ వేదికగా ఉత్తరాఖండ్‌తో తలపడుతున్న హైదరాబాద్ జట్టు ధీటుగా జవాబిస్తోంది. ఉత్తరాఖండ్ తొలి ఇన్నింగ్స్‌లో 325పరుగులు చేయగా.. అనంతరం హైదరాబాద్ జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 5వికెట్ల నష్టానికి 244పరుగులు చేసింది. హిమతేజ(78), రాహుల్(82నాటౌట్) అర్ధసెంచరీలతో రాణించారు. ఆ జట్టు ఇంకా 81పరుగులు వెనుకబడి ఉంది.

తెలుగు టైటాన్స్ ఓటమి

హైదరాబాద్: ప్రొ కబడ్డీ సీజన్–11 రెండో లీగ్ మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ ఓటమిపాలైంది. గచ్చిబౌలి స్టేడియంలో శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ 29–44 పాయింట్ల తేడాతో పరాజయాన్ని చవిచూసింది. ఇంతకుముందు ఇరుజట్లు 14సార్లు తలపడగా.. టైటాన్స్ 8సార్లు, తమిళ్ తలైవాస్ ఐదుసార్లు గెలిచాయి. మరో మ్యాచ్ టైగా ముగిసింది. చివరిసారిగా సీజన్–10లో తెలుగు టైటాన్స్ జట్టు 54–29పాయింట్ల తేడాతో ఘోర పరాజయాన్ని చవిచూసింది. అలాగే గత సీజన్‌లో తెలుగు టైటాన్స్ 2మ్యాచుల్లో గెలిచి 19మ్యాచుల్లో ఓడి మరో మ్యాచ్‌ను టైగా ముగించింది. దీంతో పాయింట్ల పట్టికలో 12వ స్థానంలో నిలిచి నిరాశపరిచిన సంగతి తెలిసిందే.

తొలి టైటిల్‌పై గురి

- నేడు దక్షిణాఫ్రికా–న్యూజిలాండ్ మహిళల మధ్య టి20 వరల్డ్‌కప్ ఫైనల్
- రాత్రి 7.30గం॥ల నుంచి



దుబాయ్: ఐసిసి టి20 ప్రపంచకప్ టైటిల్ విజేతగా తొలిసారి కొత్త జట్టు అవతరించనుంది. 9వ టి20 ప్రపంచకప్ ఫైనల్ న్యూజిలాండ్–దక్షిణాఫ్రికా మహిళల మధ్య జరగనుంది. న్యూజిలాండ్ జట్టు ఇంతకుముందు రెండుసార్లు ఫైనల్‌కు చేరినా.. రన్నరప్‌గానే నిలిచింది. ఈ టోర్నీ చరిత్రలో ఆస్ట్రేలియా మహిళలజట్టు ఏకంగా ఆరుజట్లు టైటిల్‌ను ఎగరేసుకుపోగా.. వెస్టిండీస్, ఇంగ్లండ్ జట్లు ఒక్కోసారి టైటిల్‌ను సాధించాయి. ఇక దక్షిణాఫ్రికా మహిళల జట్టు తొలిసారి ఫైనల్‌కు చేరింది. సెమీస్‌లో దక్షిణాఫ్రికా జట్టు 8వికెట్ల తేడాతో డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియాను చిత్తుచేయగా.. న్యూజిలాండ్ జట్టు 8పరుగుల తేడాతో వెస్టిండీస్‌పై సంచలన విజయం సాధించింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68